


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 22

శుక్రవారం 14-4-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
శుక్రవారం
14-4-2023

ఫ్యాషన్







సింగిల్ స్టైల్

ఒకే కలర్.. ఒకే ప్రింట్
టాప్ టు బాటమ్ ఒకే ఫ్యాబ్రిక్
కానీ, ఆకర్షణీయమైన హంగులు ఎన్నో
ఫ్యాషనబుల్‌గా కనిపించే స్టైల్స్ మరెన్నో
ఈ జంప్ సూట్ సొంతం.
వేసవికి సౌకర్యంగా.. వేడుకలో ప్రత్యేకంగా కనిపించే ఈ డ్రెస్
కాన్ఫిడెంట్ లుక్‌తో చూపరులను కట్టి పడేస్తుంది

ధోతీ స్టైల్, అంగరఖా షోల్డర్ స్లైప్, డ్రేప్ స్టైల్, సంప్రదాయ లెహంగా, లాంగ్ ఫ్రాక్ మోడల్, ఈవెనింగ్ డ్రెస్, వెస్ట్రన్ లుక్స్.. ఇలా ఒక్క జంప్‌సూట్‌తో ఎన్నో హంగులను క్రియేట్ చేస్తుంది. సీజనల్ వేర్‌గా ఎంపికలో మొదటివరసలో ఉంటుంది. క్యాజువల్ వేర్‌గా తక్కువ ఖర్చులోనే ఈ లుక్స్‌ని సొంతం చేసుకోవచ్చు. స్టైలిష్ వేర్‌గా ఫ్యాబ్రిక్, డిజైన్‌ని బట్టి పార్టీకి జంప్‌సూట్‌ని ఎంచుకోవచ్చు. ఎంబ్రాయిడరీ జిలుగులతో మెరిపించవచ్చు.

కిచెన్‌టిప్స్



- వెల్లుల్లి రేకలు పొట్టు సులువుగా వద లాలంటే... వెల్లుల్లి రేకను కటింగ్ బోర్డు మీద పెట్టి చాకు వెనుక వైపు (మందంగా ఉండే వైపు, ఈ స్థితిలో చాకు పదును ఉన్న వైపు పైకి ఉంటుంది) తిప్పి వెల్లుల్లి రేక చివర గట్టిగా నొక్కితే వెల్లుల్లి రేక విడివడుతుంది.



- పైనాపిల్‌ను కట్ చేయడానికి పెద్ద చాకులను (షెఫ్స్ నైఫ్) వాడా లి. ముందుగా కాయ పైభాగాన్ని, కింది భాగాన్ని తొలగించాలి. ఇప్పుడు కాయను నిలువుగా పెట్టి చెక్కును పై నుంచి కిందకు తొలగించాలి. ఆ తర్వాత మీడియం సైజ్ చాకుతో కాయను చక్రాలుగా తరగాలి.



- బటర్‌ను వంట మొదలు పెట్టడానికి ఓ అరగంట లేదా గంట ముందు ఫ్రిజ్‌లో నుంచి తీసి బయట పెట్టు కోవాలి. ఒకవేళ మర్చిపోతే వేడి పాలగిన్నె మూత మీద లేదా ఉడుకు తున్న వంట పాత్ర మూత మీద పెడితే పది నిమిషాల్లో మెత్తబడుతుం ది. అలా కుదరకపోతే స్టవ్ మీద బర్నర్ల మధ్య ఉండే ఖాళీ ప్రదేశంలో ఉంచాలి.



- ఐస్‌క్రీమ్ ఫ్యామిలీ ప్యాక్ తెచ్చుకున్నప్పుడు దానిని పలు చగా కట్ చేయాలంటే చాకును మరుగుతున్న వేడి నీటిలో ముంచి తీయాలి. ఒక స్లయిస్ కట్ చేయగానే చాకు చల్లబడిపోతుంది. కాబట్టి ప్రతి స్లయిస్‌కు ఓసారి వేడి నీటిలో ముంచాలి.

బ్యూటిప్స్

స్లిమ్మింగ్ జ్యూస్



ఒక నిమ్మకాయను తీసుకుని అడ్డంగా సన్నని స్లైసుల్లాగా కట్ చేసుకోవాలి. తరువాత అంగుళం అల్లం ముక్క తీసుకుని తొక్కతీసి శుభ్రంగా కడిగి సన్నగా తురుముకోవాలి. ఇప్పుడు ఒక గిన్నెలో రెండు గ్లాసుల నీళ్ల పోసి తురిమి పెట్టుకున్న అల్లం, నిమ్మ చెక్కలను వేసి నీళ్లను మరగబెట్టాలి. నీళ్ల బాగా మరిగి సగం అయ్యాక స్టవ్ ఆపేసి పదిహేను నిమిషాలపాటు ఆరనివ్వాలి. తరువాత నీటిని ఒక గ్లాసులోకి వడపోయాలి. వడగట్టిన నీటిలో స్పూను తేనె వేసి కలిపితే బరువును తగ్గించే పానీయం రెడీ అయినట్లే. ఈ నీటిని ఉదయం అల్పాహారానికి, రాత్రి భోజనానికి అరగంట ముందు తాగాలి. ఇలా క్రమం తప్ప కుండా చేయడం ద్వారా అధిక బరువు తగ్గుతుంది.



హోమ్ మేడ్ మందార తైలం

ఇరవై మందార పువ్వులను తీసుకుని శుభ్రంగా కడిగి నీడలో ఆరబెట్టాలి. పువ్వులు బాగా ఆరిన తరువాత మిక్సీజార్‌లో వేసుకుని రెండు స్పూన్ల కొబ్బరి నూనె వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద ఒక గిన్నెపెట్టి దానిలో అరలీటరు నువ్వుల నూనె లేదా కొబ్బరినూనె పోయాలి. అందులో గ్రైండ్ చేసి పెట్టుకున్న మందార పువ్వుల పేస్టు, స్పూను మెంతులు వేసి మరగనివ్వాలి. మరిగిన తరువాత దించే ముందు కొద్దిగా పచ్చకర్పూరం వేయాలి. తర్వాత ఆయిల్‌ను చల్లారనిచ్చి వడకట్టి సీసాలో భద్రపరుచుకోవాలి. ఈ మందార తైలాన్ని వారానికి రెండుసార్లు తలకు పట్టించి మర్దనా చేస్తే.. కుదుళ్లకు పోషణ అందుతుంది. ఫలితంగా రాలడం తగ్గి, జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. పచ్చకర్పూరం లేదా ముద్దక ర్పూరం వేయడం వల్ల పేలు రాకుండా ఉండటమే కాక మాడుకు చల్లగా హాయిగా అనిపిస్తుంది.



పట్టుదల

తేలి రాజేశ్వరిది మెదక్ జిల్లా దప్పూరు.
వలస కూలీలుగా తల్లిదండ్రులు ముంబైకి వెళితే అక్కడే పుట్టింది.
స్లమ్స్‌లో ఉన్నా మరాఠీ మీడియంలో చదువుకున్నా
ఏనాటికైనా పై చదువులకు విదేశాలకు వెళ్లాలని పట్టుదల.
దానిని సాధించింది.
లండన్‌లో మాస్టర్స్ డిగ్రీ చేస్తున్న రాజేశ్వరి
తన చదువు కొనసాగించడానికి డిజిటల్ మార్కెటింగ్‌లో పని చేస్తోంది.
ఆమె ప్రయాణం ఆమె మాటల్లో.

మురికివాడ నుంచి లండన్ వరకు




రాజేశ్వరి

'నా పేరు రాజేశ్వరి. మాది మెదక్ జిల్లా దప్పూరు. మా అమ్మానా న్నలు వలస కూలీలు. ముంబై వలస వెళ్లి భవన నిర్మాణ కార్మికు లుగా పని చేసేవారు. ఎక్కడ కడుతుంటే దాని బేస్‌మెంట్‌లో పట్టాలు కట్టుకుని కాపురం ఉండేవారు. అంధేరిలో వాళ్లు కూలి పని చేస్తుండగా నేను పుట్టాను. నాకు అప్పటికే అన్న ఉన్నాడు. ఎల్.కె.జి, యు.కె.జి నేను మరాఠి స్కూల్‌లో చదువుకున్నాక ముంబైలో చదువు కష్టమని నన్ను, అన్నను దప్పూరులోని మా నానమ్మ దగ్గరకు పంపారు. అక్కడ మళ్లీ అలలు నేర్చుకోవడం నాకు కష్టమైంది. ఐదవ క్లాసు పూర్తయ్యేసరికి మా నానమ్మ చనిపోయింది. ఇక ఊళ్లో ఎవరూ లేరు. మళ్లీ అన్నా, నేను ముంబై చేరుకున్నాం'.

పనిపిల్లగా ఉంటూ

'2006లో ముంబైకి వచ్చాక ఆరోక్లాసు నుంచి చదవడానికి తెలుగుమీడియం స్కూల్ దొరకలేదు. మేముండే ములుండ్ నుంచి గంట దూరం వెళ్లి చదువుకుందా మన్నా దొరకలేదు. చివరకు దగ్గరిలోని కన్నడ మీడియం స్కూల్‌లో చేరాల్సి వచ్చింది. నేను ముంబై వచ్చాక బాగా చదువుకోవాలని అనుకున్నాను. దానికి డబ్బు కావాలి. అందుకని నేను స్కూలుకు వెళ్లడంతోపాటు దగ్గరి ఇళ్లల్లో పనిపిల్లగా చేసేదాన్ని. అందుకు నేను కొంచెం కూడా ఇబ్బంది పడలేదు. నాకంటూ ఒక లక్ష్యం ఉంది. టెన్త్ వరకూ అలాగే చదువుకు న్నాను. ఇంటర్‌కి వచ్చేసరికి కాలేజీకి ఆరా కొరా వెళుతూ టెలీకాలర్‌గా పని చేశాను. దానివల్ల అకౌంట్స్ సబ్జెక్ట్ ఫెయిల్ అయ్యాను. ఇక పై చదవలేనేమో అనిపించింది. ఎలాగో ఇంటర్ పూర్తి చేసి ఆర్థికంగా నిలదొక్కుకోవ డానికి ఉద్యోగంలో చేరిపోయాను. అంతవరకూ నేను జీవితం గడి పింది స్లమ్స్‌లోనే'



మళ్లీ చదువుకు

'ఇంటర్ అయ్యాక నేను ముంబైలోని ఎక్సెంచర్ సంస్థలో ఒక ఏజెన్సీ ద్వారా ఉద్యోగంలో చేరాను. ఇంటర్ పాస్ మీద వారిచ్చిన ఉద్యోగం నాకు తృప్తిగా ఉండేది. కాని 2018 వచ్చేసరికి నా ఉద్యో గంలో ఎటువంటి ఎదుగుదల లేదు. డిగ్రీ లేని నీకు ఈ మాత్రం జీతం ఇవ్వడమే గొప్ప అన్నారు సంస్థ వారు. మళ్లీ చదువు గుర్తుకొ చ్చింది. ఏమిటి ఇలా తయారయ్యాను అనుకున్నాను. పై చదువులు చదవాలన్న పట్టుదల గుర్తుకొచ్చింది. ఎలాగైనా నా కలను సాధించు కోవాలనుకున్నాను. కాని ఉద్యోగం చేస్తూనే చదువుకోవాలని అలాంటి ఆప్షన్ కోసం ఎన్ని కాలేజీలు తిరిగినా వీలు కాదన్నారు. కరెస్పాండెన్స్ కోర్సు చేయమన్నారు. చివరకు కల్యాణ్ (ముంబైలోని ఒక ఏరియా) లో సంకల్ప్ కాలేజీ వాళ్లు నా తపన చూసి నీకు వీలున్నప్పుడు వచ్చి అటెండ్ అవుతూ ఉండు అని సీట్ ఇచ్చారు. అక్కడ నేను బీకాం చేరాను. నా ఉద్యోగం వారంలో ఐదు రోజులు. ఏ రెండు రోజులైనా ఆఫ్ తీసుకోవచ్చు. అలా నేను అందరిలా శని, ఆదివారం కాకుండా వీక్ డేస్ ఆఫ్ తీసుకుంటూ 2021 జూన్‌లో బి.కాం పూర్తి చేశాను. ఉద్యోగం చేస్తూ జాగ్రత్తగా పొదుపు చేస్తూ వచ్చాను'

యు.కె. కల

'ఒకవైపు చదువు, ఉద్యో గంతో పాటు విదేశాలలో చద వడానికి కావలసిన డాక్యు మెంట్స్ ఏమిటో తెలుసు కుంటూ వచ్చాను. పాస్‌పోర్ట్ కోసం నా పర్మినెంట్ అడ్రస్ దప్పూర్ కావడం వల్ల హైదరాబాద్ నుంచే తీసుకోవాల్సి వచ్చింది. దాని కోసం ఆధార్ కరెక్షన్, సర్టిఫి కెట్లు చాలా పని. మరో వైపు 2022 సెప్టెంబర్ ఇన్‌టేక్ (యూకేలో సెప్టెంబర్‌లో మొదలయ్యే అకడెమిక్ ఇయర్ కోసం) కోసం ఆన్‌లైన్‌లో ఆయా యూనివర్సిటీల్లో అప్లికేషన్స్ పేస్తూ వెళ్లాను. కాని యు.కెలో చదవడం చాలా ఖర్చుతో పని. అందుకోసం నేను బ్యాంకులోను, వడ్డీ మీద బయటి వ్యక్తుల దగ్గర లోన్ తీసుకున్నాను. యూకేలో మాస్టర్స్ చేయడానికి నాకు సీట్ వచ్చింది. సెప్టెంబర్ 2022లో లండన్ చేరుకు న్నాను. చదువుకుంటూ పార్ట్‌టైమ్ జాబ్ చేయడానికి పరిమిత గంటల అనుమతి ఉంటుంది. కాని అక్కడ వెంటనే పని దొర కదు. సులభంగా దొరికే ఉద్యోగం కేర్‌హోమ్‌లలో పని చేయ డమే. మతి స్థిమితం లేనివారు, వృద్ధులు... వీరి బాగోగులు చూసుకుంటే డబ్బులు ఇస్తారు. అలా ఆరు నెలలు పని చేశాను. నాకు డిజిటల్ మార్కెటింగ్‌తో బాగా పరిచయం ఉంది కాబట్టి అందులోనూ సంపాదన వెతుకుతు న్నాను. ముంబైలో స్లమ్స్‌లో ఉండిపోవలసిన దాన్ని. నా కష్టమే నన్ను యూకే దాకా చేర్చింది. ఇక్కడకు వచ్చి 9 నెలలు గడిచిపోయాయి. ఇప్పుడు ఈస్టర్ సెలవలు నడుస్తున్నాయి. ఈ సెల వుల్లో ఎక్కువ గంటలు పని చేయవచ్చు. పని చేస్తున్నా. కష్టేఫలి అన్నారు కదా'.

రంజాన్ స్పెషల్

ఓట్స్ ఆరెంజ్ క్యారట్ ఖీర్

కావలసినవి: ఓట్స్– 50 గ్రాములు; పాలు – లీటరు; క్యారట్ తురుము – 100 గ్రాములు; తేనె – కప్పు (ఇష్టమైతేనే); యాలకుల పొడి– టీ స్పూన్; ఆరెంజ్ జెస్ట్ – టేబుల్ స్పూన్ (ఆరెంజ్ తొక్కల తురుము); బాదం – 10 (సన్నగా తరగాలి).

తయారీ: ● మందపాటి పెనం వేడి చేసి ఓట్స్‌ను సన్న మంట మీద దోరగా వేయించాలి. ● పెద్ద పాత్రలో పాలను మరిగించి అందులో క్యారట్ తురుము వేసి కలుపుతూ పది నిమిషాల సేపు ఉడి కించాలి. ఇప్పుడు ఓట్స్ వేసి కలపాలి. చివరగా యాలకుల పొడి, ఆరెంజ్ జెస్ట్ వేసి కలుపుతూ మరో రెండు నిమిషాలపాటు ఉడికించి స్టవ్ ఆపేయాలి. చివరగా బాదం వేసి కలిపి సర్వ్ చేయాలి. తేనె వేసుకోదలిచిన వాళ్లు స్టవ్ ఆపేసిన తర్వాత తేనె కలపాలి.



వంటిల్లు

ఆవ రుచిని ఆస్వాదిద్దాం

ఎండాకాలాన్ని వెంటాడుతూ వస్తుంది ఆవకాయ కాలం. మామిడి కాయలు చెట్టుకొమ్మలకు వేళ్లాడుతూ ఆకుల్లోంచి తొంగి చూస్తూ నోరూరిస్తుంటాయి. మామిడి కాయిలతో చేసుకునే ఊరగాయలు పచ్చళ్లను చూద్దాం. నీళ్లూరుతున్న జిహ్వను లాలిద్దాం.

ఆవకాయ



కావలసినవి: మామిడికాయ ముక్కలు – 4 కప్పులు; నూనె– 2 కప్పులు; ఆవపిండి– కప్పు; మిరప్పొడి– కప్పు (గుంటూరు కారం రుచికి బాగుంటుంది. కశ్మీరీ కారం వాడితే ఆకర్షణీయంగా కనిపిస్తుంది); ఉప్పు – కప్పు (కల్లుప్పును పొడి చేయాలి, టేబుల్ సాల్ట్ వేయాలనుకుంటే ముప్పావు కప్పు సరిపోతుంది); మెంతిపిండి – అర కప్పు; వెల్లుల్లి రేకలు – అర కప్పు (పొట్టు వలిచి నవి); ఆవాలు – పావు కప్పు.

తయారీ: ● మామిడి కాయలను శుభ్రంగా కడిగి ఆరిన తర్వాత పొడి వస్త్రంతో తుడవా లి. సొనపోవడానికి తొడిమలను తొలగించా లి. ఆ తర్వాత టెంకతో సహా ముక్కలు చేయాలి. మీడియం సైజు కాయను 12 ముక్కలు చేయవచ్చు. టెంకలోని గింజను తొలగించి, టెంకకు గింజకు మధ్య ఉండే పొరను కూడా తీసేసి ముక్కలను సిద్ధంగా పెట్టుకోవాలి. ● వెడల్పు పాత్ర తీసుకుని తేమలేకుండా శుభ్రంగా తుడిచి కొద్దిసేపు ఎండలో పెట్టాలి. ఆ తర్వాత ఆ పాత్రలో మిరప్పొడి, ఆవపిండి, మెంతి పిండి, ఉప్పు, వెల్లుల్లి రేకలు వేసి కలపా లి. అందులో మామిడికాయ ముక్కలను వేసి ఆవపిండి మిశ్రమం ముక్కలకు సమంగా పట్టే వరకు తడి లేని గరిటెతో కలపాలి. ఆవపిండి కారంలో ఉప్పు చూసుకుని రుచిని బట్టి అవసరమైతే కొద్దిగా కలుపుకోవాలి. ● బాణలిలో నూనె మరిగించి అందులో ఆవాలు వేసి చిటపటలాడిన తర్వాత స్టవ్ ఆపేయాలి. నూనె బాగా చల్లారిన తర్వాత ఆవకాయ ముక్కల్లో పోసి గరిటెతో కలపాలి. ఈ మిశ్రమాన్ని జాడీలో నింపాలి. ఆవకాయ మీద నూనె తేలుతూ ఉండాలి.

గమనిక: ● నూనెను మరిగించకుండా పచ్చిగా కూడా వేసుకోవచ్చు. ● ఆవకాయ, ఇతర ఊరగాయలను నిల్వ చేసే జాడీలను శుభ్రంగా కడిగి, పొడి వస్త్రంతో తుడిచి పది నిమిషాల సేపు ఎండలో ఉంచాలి. ఎండలో నుంచి తీసిన తర్వాత జాడీ వేడి తగ్గిన తరవాత మాత్రమే ఊరగాయలను నింపాలి.

ముక్కల పచ్చడి



కావలసినవి: మామిడి కాయ – 1 పెద్దది; మిర ప్పొడి– పావు కప్పు; పసుపు – టీ స్పూన్; ఉప్పు – పావు కప్పు (రుచిని బట్టి తగ్గించుకో వచ్చు); ఆవ పిండి– పావు కప్పు; మెంతి పిండి– పావు కప్పు; వెల్లుల్లి రేకలు– పది. **పోపు కోసం:** నూనె – టేబుల్ స్పూన్; ఆవాలు – టీ స్పూన్; మెంతులు – అర టీ స్పూన్; ఎండు మిర్చి – 2; ఇంగువ– అర టీ స్పూన్.

తయారీ: ● మామిడి కాయలను శుభ్రంగా కడిగి, తుడిచి తొడిమ తొలగించాలి. కాయను చెక్కు తీయకుండా చిన్న ముక్కలు చేయాలి. దాదాపుగా కప్పు ముక్కలు వస్తాయి. ఇందులో పసుపు, ఉప్పు, మిరప్పొడి, ఆవపిండి, మెంతి పిండి, వెల్లుల్లి రేకలు వేసి బాగా కలిపి, పదిహేను నిమిషాల పాటు పక్కన ఉంచాలి. మసాలా పొడుల రుచి ముక్కలకు పట్టాలి, ముక్కల నుంచి నీరు వది లేటంత సమయం ఉండకూడదు. ● బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు, మెంతులు వేసి అవి వేగిన తర్వాత ఇంగువ, ఎండుమిర్చి వేసి దించేయాలి. పోపు చల్లారిన తర్వాత మామిడి ముక్కల మిశ్రమంలో వేసి కలపాలి. ఈ పచ్చడి రుచి దాదాపుగా ఆవకాయ రుచికి సమానం. నెలపాటు తాజాగా ఉంటుంది.

మాగాయ



కావలసినవి: మామిడి కాయ ముక్కలు – 4; పసుపు – టీ స్పూన్; ఉప్పు – కప్పు; మిరప్పొడి– కప్పు; కల్లుప్పు – కప్పు (పొడి చేయాలి); ఆవాలు – పావు కప్పు; మెంతులు – పావు కప్పు; ఇంగువ – చిన్న గోళీ అంత (పొడి అయితే అర టీ స్పూన్); **పోపు కోసం:** నువ్వుల నూనె – అర కప్పు; ఆవాలు – టీ స్పూన్; మెంతులు – టీ స్పూన్; ఎండు మిర్చి – 2.

తయారీ: ● మామిడి కాయలను శుభ్రంగా కడిగి, తేమ లేకుండా తుడిచి చెక్కు తీసి సన్నగా పొడవుగా ముక్కలు చేయాలి. ఈ ముక్కల్లో పసుపు, ఉప్పు కలిపి రాత్రంతా అలాగే ఉంచాలి. ఉద యానికి ముక్కల్లోని నీరు అడుగుకు చేరుతుంది. ముక్కలను తీసి ఒక ప్లేట్‌లో పలుచగా పరిచి ఎండబెట్టాలి. నీటిని మూత పెట్టి భద్రపరచాలి. మామిడి ముక్కలను రెండు లేదా మూడు రోజుల పాటు ఎండబెట్టాలి. ముక్కలు మరీ పెళుసుగా మారి విరిగేటట్లు ఎండకూడదు. పైకి తేమలేకుండా ముక్క లోపల ఒక మోస్తరు తేమ ఉండి వేళ్లతో వంచితే వంగేటట్లు ఉండాలి. ● ఆవాలు, మెంతులను కూడా రెండు గంటల పాటు ఎండబెట్టాలి. ఈ రెండింటినీ విడిగా పొడి చేయాలి. పొడి చల్లారిన తర్వాత మామిడి ముక్కల నీటిలో కలపాలి. ఆ తర్వాత మిరప్పొడి కూడా వేసి సమంగా కలిసే వరకు తేమలేని పొడి గరిటెతో కలపాలి. ● మందపాటి బాణలిలో నూనె వేడి చేసి ఇంగువ, ఆవాలు, మెంతు లను వేయించి చివరగా ఎండు మిర్చి వేసి కలిపి ఆపేయాలి. చల్లారిన పోపును మామిడిరసం– ఆవపిండి మిశ్రమంలో వేసి కల పాలి. ఇందులో ఎండిన మామిడి ముక్కలను వేసి నూనె పైకి తేలే వరకు కలిపితే మాగాయ పచ్చడి రెడీ. మూడు లేదా నాలుగు రోజులకు మామిడి ముక్కలు మసాలా పొడుల రుచిని పీల్చు కుంటాయి. అప్పుడు మరోసారి గరిటెతో కలిపి తేమ లేని జాడీలోకి తీసుకుంటే ఏడాది పాటు నిల్వ ఉంటుంది.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 | వెల: ₹ 5.50 | సంపుటి: 16 | సంచిక: 22

శుక్రవారం 14-4-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'



గుజరాత్ గెలిచె...

రాణించిన గిల్. చివరి ఓవర్లో పంజాబ్‌పై నెగ్గిన డిఫెండింగ్ చాంపియన్ -13లో



సరికొత్తగా భారత్: మోదీ

కొత్త విధానాలు, వ్యూహాలతో కొత్త భారత్ ఆవిష్కృతమవుతోందన్న మోదీ -6లో



దార్శనికుడి విశ్వరూపం

'నీ కోసం జీవిస్తే
నీలోనే నిలిచిపోతావు..
జనం కోసం జీవిస్తే
జనంలో నిలిచిపోతావు'..
– అంబేడ్కర్

రాజ్యాంగ నిర్మాతకు
తెలంగాణ సమాజం
అర్పిస్తున్న ఘన నివాళి ఇది
– సీఎం కేసీఆర్

125 అడుగుల అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని నేడు ఆవిష్కరించనున్న సీఎం కేసీఆర్ -2లో

గురువారం రాత్రి విద్యుత్ వెలుగుల్లో అంబేడ్కర్ విగ్రహం



మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క, రాజ్రే, నదీమ్, సంపత్‌కుమార్ తదితరులు

'సత్యాగ్రహ సభ'కు సర్వం సిద్ధం

నేడు మంచిర్యాలలో కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభ

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎంపీ సభ్యత్వం అనర్హత వేటును నిరసిస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మంచిర్యాలలో తలపెట్టిన 'సత్యాగ్రహ సభ'కు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- వివరాలు 11లో

మంచిర్యాల సభకు తరలిరండి!

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్

- వివరాలు 11లో

అనామక లేఖ అడ్డుపెట్టుకుని

దుష్ప్రచారం



ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం

- ఆర్థిక నేరగాడు సుకేశ్ చంద్రశేఖర్‌తో ఎలాంటి పరిచయం లేదు
- ఫేక్ చాట్‌ల ఆధారంగా తప్పుడు వార్తలు రాశారు
- బీఆర్‌ఎస్‌కు ప్రజాదరణను సహించలేక, కేసీఆర్‌ను ఎదుర్కోలేక ఇదంతా చేస్తున్నారు

కవిత స్పందన బ్లేమ్‌గేమ్‌లా ఉంది

సుకేశ్ న్యాయవాది అనంత్ మాలిక్ విమర్శ

- వివరాలు 2లో



పాలమూరు-రంగారెడ్డి

డీపీఆర్ వెనక్కు

- డీపీఆర్‌ను మదింపు చేయలేము.. ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వలేమన్న సీడబ్ల్యూసీ
- తెలంగాణ ప్రభుత్వానికి లేఖ.. నీటి కేటాయింపులపై స్పష్టత లేనందుకేనని వెల్లడి

5లో

యూపీలో ఎన్‌కౌంటర్

- ఉమేశ్ పాల్ హత్య కేసులో ప్రధాన నిందితుడైన గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ కుమారుడు అసద్, అతని సహాయకుడు గుల్హామ్ పోలీసుల ఎదురుకాల్పుల్లో హతమయ్యారు.

- వివరాలు 6లో

ప్రైవేటీకరణపై ముందుకు వెళ్లం



- 'విశాఖ ఉక్కు'పై కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగన్ సింగ్ కులస్తే
- ఆర్‌ఐఎన్‌ఎల్‌ను బలోపేతం చేసేలా చర్యలు
- ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో పనిచేసే ప్రక్రియపై దృష్టి.. గనుల సమస్యనూ పరిష్కరిస్తామని హామీ

- వివరాలు 10లో

కేసీఆర్ వల్లే ప్రైవేటీకరణపై

కేంద్రం వెనక్కు..

కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే స్టీల్‌ప్లాంట్‌కు క్యాప్టివ్ మైన్స్ కేటాయించాలి: కేటీఆర్

ఇది కేసీఆర్, ఏపీ ప్రజల విజయం: హరీశ్

- వివరాలు 3లో

పేపర్ స్టేట్‌మెంట్లతో వ్యవస్థలు మారిపోవు

- బీఆర్‌ఎస్ మంత్రుల తీరుపై ఏపీ మంత్రుల మండిపాటు - 3లో

ఎండలు మండుతాయ్

సాక్షి, హైదరాబాద్: వేసవి సీజన్ మధ్యకు చేరుతుండడంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరింత పెరగనున్నాయి. రాష్ట్రంలో పలుచోట్ల 41డిగ్రీ సెల్సియస్ నుంచి 44 డిగ్రీ సెల్సియస్ మధ్యన ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మాత్రం గరిష్ట ఉష్ణోగ్రతలు 38డిగ్రీ సెల్సియస్ నుంచి 41 డిగ్రీ సెల్సియస్ మధ్యన ఉంటుందని వివరించింది. రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది. గురువారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... గరిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 42 డిగ్రీ సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 22.3డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది.

తెలంగాణ, ఏపీల్లోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	43.6	26.1
అనంతపురం	42.8	19.4
కర్నూలు	42.7	26.1
ఆదిలాబాద్	42.0	24.7
భద్రాచలం	41.5	27.5
నిజామాబాద్	41.4	27.7
రామగుండం	41.2	25.6
నల్లగొండ	40.8	22.8
హనుమకొండ	40.5	25.0
ఖమ్మం	40.4	27.8
మహబూబ్‌నగర్	40.1	26.5
మెదక్	40.0	22.3
హైదరాబాద్	38.9	26.4
హకీంపేట్	38.8	26.0
దుండిగల్	38.5	25.2

ఇదండీ సంగతి



ఇవి బాగానే గుర్తు పడుతున్నారు.. అక్షరాలు గుర్తుపట్టండి!!

దార్శనికుడి విశ్వరూపం

నేడు అంబేడ్కర్ 125 అడుగుల భారీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న సీఎం కేసీఆర్

- హెలికాప్టర్‌తో పూల వర్షం.. బౌద్ధ మత గురువుల ప్రార్థనలు
- ముఖ్య అతిథిగా పాల్గొననున్న అంబేడ్కర్ మనవడు ప్రకాశ్ అంబేడ్కర్
- అంబేడ్కర్ 132వ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఘన నివాళి



ఏరియల్ వ్యూ..

'నీ కోసం జీవిస్తే నీలోనే నిలిచిపోతావు.. అదే జనం కోసం జీవిస్తే జనంలో నిలిచిపోతావు'.. అవును.. అలా చెప్పడమేకాదు.. జనం కోసమే జీవించి జనంలో నిలిచిపోయిన మహా మనిషి బాబాసాహెబ్ అంబేడ్కర్. 'నేను, నా దేశం అని చెప్పాల్సి వస్తే.. నా దేశమే నాకు అత్యంత ముఖ్యమైన'దని చాటిన ఆయనను దేశమంతా స్మరించుకునే రోజు ఏప్రిల్ 14. ఆ మహనీయుడి జయంతి. ఈ రోజునే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అంబేడ్కర్ 125 అడుగుల భారీ విగ్రహాన్ని సీఎం కేసీఆర్ ఆవిష్కరించనున్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాల్లోకెల్లా ఇదే అతిపెద్దది కావడం విశేషం.

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రాజధానిలో హుస్సేన్‌సాగర్ తీరాన సగర్వంగా కొలువైన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల భారీ విగ్రహం ఆవిష్కరణకు సర్వం సిద్ధమైంది. అంబేడ్కర్ 132వ జయంతి సందర్భంగా శుక్రవారం సీఎం కేసీఆర్ ఈ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం భారీ విగ్రహంపై హెలికాప్టర్లతో పూలవర్షం కురిపించనున్నారు. తర్వాత బౌద్ధ గురువుల ప్రార్థనలను నిర్వహిస్తారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేసీఆర్ ప్రసంగిస్తారు. దాదాపు 50వేల మంది దీనికి హాజరవుతారని ప్రభుత్వం అంచనా వేసింది. విగ్రహావిష్కరణ, సభ, ఇతర కార్యక్రమాల కోసం రూ.10 కోట్లతో ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సభకు హాజరైన వారికి మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు, స్వీటు ప్యాకెట్లను పంపిణీ చేయనున్నారు. విగ్రహావిష్కరణ, సభ కార్యక్రమాల్లో ప్రత్యేక అతిథిగా అంబేడ్కర్ మనవడు ప్రకాశ్ అంబేడ్కర్‌తోపాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అంబేడ్కర్‌వాదులు, అభిమానులు పాల్గొననున్నారు.



రూ.146.50 కోట్ల ఖర్చుతో..

అంబేడ్కర్ 125వ జయంతి సందర్భంగా 2016 ఏప్రిల్ 14న సీఎం కేసీఆర్ భారీ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. విగ్రహం, ఇతర ఏర్పాట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.146.50 కోట్లను మంజూరు చేసింది. ఎన్టీఆర్ గార్డెన్ సమీపంలో 11.7 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. విగ్రహ నిర్మాణం, డిజైన్, పనులు తదితర అంశాలపై అప్పటి ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ పలు దేశాలు, రాష్ట్రాల్లోని భారీ విగ్రహాలపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దాని ప్రకారం ఏడేళ్ల పాటు శ్రమించిన శిల్పులు, ఇంజనీర్లు భారీ విగ్రహాన్ని ఆవిష్కరణకు సిద్ధం చేశారు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా నిర్మించారు. పీఠంపైకి ఎక్కి విగ్రహం వద్దకు చేరుకునేందుకు మెట్లదారి, ర్యాంప్ ఉంటాయి.

విగ్రహంలో గ్రంథాలయం, హాల్స్

విగ్రహం దిగువన పీఠంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. అందులో అంబేడ్కర్ రచనలు, ఆయన చరిత్రకు సంబంధించిన అంశాలు, కీలక సందర్భాలను తెలిపే పుస్తకాలు, చిత్రాలు ఉంటాయి. భవనంలోపల ఆడియో విజువల్ రూమ్ ఉంటుంది. అందులో అంబేడ్కర్ జీవన విశేషాలను ప్రదర్శిస్తారు.

36 ఎకరాల్లో స్మృతివనం: అంబేడ్కర్ స్మృతివనం కోసం విగ్రహం పక్కనే 36 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. అందులో రాక్ గార్డెన్, ల్యాండ్ స్కేపింగ్, ప్లాంటేషన్, వాటర్ ఫౌంటేన్స్, శాండ్‌స్టోన్ వర్క్ ఉంటాయి. దాదాపు 450 కార్ల పార్కింగ్ చేసేందుకు అవకాశం ఉంటుంది.

విగ్రహం, ఇతర ఏర్పాట్ల విస్తీర్ణం ఇలా..

విగ్రహం ఏర్పాటు చేసిన ప్రాంతం	11.7 ఎకరాలు
ప్రధాన, అనుబంధ భవనాలు	1.35 ఎకరాలు
చుట్టూ పచ్చదనం	2.93 ఎకరాలు
పేవర్ ఏరియా	1.37 ఎకరాలు
చుట్టూ అభివృద్ధి చేసిన ప్రాంతం	1.23 ఎకరాలు
కామన్ పార్కింగ్	4.82 ఎకరాలు

అంబేడ్కర్ విగ్రహం ప్రత్యేకతలివీ..

విగ్రహం ఎత్తు	125 అడుగులు
పీఠం ఎత్తు	50 అడుగులు
మొత్తం ఎత్తు	175 అడుగులు
వినియోగించిన స్టీల్	791 టన్నులు
వినియోగించిన ఇత్తడి	96 టన్నులు
పనిచేసిన శ్రామికులు	425 మంది
లిఫ్టులు	2 (ఒక్కోదానిలో 15 మంది సామర్థ్యం)

జీవం పోసిన వంజి సుతార్



హుస్సేన్‌సాగర్ తీరాన 125 అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహానికి జీవం పోసిన శిల్పి రామ్ వంజి సుతార్. మహారాష్ట్రకు చెందిన ఆయన వయసు 98 ఏళ్లు. దేశంలోని అతిపెద్ద విగ్రహాలన్నీ సుతార్ రూపొందించినవే. పార్లమెంట్ భవనం వద్ద కూర్చున్న స్థితిలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి.. గుజరాత్‌లోని నర్మదా నది తీరాన కొలువైన ప్రపంచంలోని అతిపెద్ద విగ్రహం 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ (సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్)'కు రూపమిచ్చిన నదీ ఆయనే కావడం విశేషం. భారత ప్రభుత్వం సుతార్‌ను 1999లో పద్మశ్రీతో, 2016లో పద్మభూషణ్‌తో సత్కరించింది కూడా.

అంబేడ్కర్‌కు తెలంగాణ ఘన నివాళి ఇది

ఆయన భారీ విగ్రహం రాష్ట్రంతోపాటు దేశానికే గర్వకారణం: కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల అంబేడ్కర్ మహా విగ్రహాన్ని ప్రతిష్టించడం రాష్ట్రానికే కాక దేశానికే గర్వకారణమని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటుకు మూలమైన రాజ్యాంగంలోని ఆర్టికల్–3ను పొందుపరిచిన తెలంగాణ బాంధవుడికి తెలంగాణ సమాజం అర్పిస్తున్న ఘన నివాళి అని ప్రకటించారు. రాష్ట్ర నూతన సచివాలయానికి 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం' అని పేరుపెట్టి సమున్నతంగా గౌరవించుకున్నామని తెలిపారు. శుక్రవారం అంబేడ్కర్ 132వ జయంతి సందర్భంగా.. భారత రాజ్యాంగ నిర్మాతగా దేశ గమనాన్ని మార్చడంలో ఆయన పోషించిన పాత్రను, జాతికి అందించిన సేవలను సీఎం కేసీఆర్ స్మరించుకున్నారు. వర్ణం, కులం పేరుతో వివక్షను, అంటరానితనం అనే సామాజిక దురాచారాన్ని చిన్నతనం నుంచే ఎదుర్కొన్నా.. ఏనాడూ వెనకడుగు వేయని ధీరోదాత్తుడు అంబేడ్కర్ అని కొనియాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగానికి రూపమిచ్చిన అంబేడ్కర్ రచనలు, ప్రసంగాలు, విమర్శలు యావత్ ప్రపంచాన్ని ఆలోచింపజేశాయన్నారు. సామాజిక వివక్షకు గురవుతున్న ఎస్సీ కులాల అభ్యున్నతి కోసం అంబేడ్కర్ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అమలు చేస్తోందని కేసీఆర్ పేర్కొన్నారు. దళితబంధు, గురుకులాలు, ఎస్సీ,ఎస్టీ ప్రత్యేక నిధి, అంబేడ్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు, ఎస్సీలకు నైపుణ్య శిక్షణ, టీఎస్ ప్రైడ్, మూడెకరాల భూపంపిణీ, ఎస్సీలకు 101 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఈ పథకాలు, కార్యక్రమాలతో దళితులు ఎంతో ఎదుగుతున్నారని, చేయూతనిస్తే సమాజంలో ఎవరికీ తీసిపోమనే విషయాన్ని రుజువు చేస్తున్నారని పేర్కొన్నారు.

అనామక లేఖ అడ్డుపెట్టుకుని దుష్ప్రచారం

ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: ఆర్థిక నేరగాడు సుకేశ్ చంద్రశేఖర్ విడుదల చేసిన అనామక లేఖను అడ్డుపెట్టుకుని తనపై పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేక్ చాట్‌ల ఆధారంగా తనపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు వార్తలతో ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. సుకేశ్ చంద్రశేఖర్‌తో తనకెలాంటి పరిచయం లేదని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి వస్తున్న ప్రజాదరణను సహించలేని, కేసీఆర్ జాతీయ స్థాయి కార్యాచరణను రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేని తెలంగాణ వ్యతిరేకులు మీడియా సంస్థల ద్వారా ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని కవిత తెలిపారు. ఆర్థిక నేరగాడు విడుదల చేసిన అనామక లేఖపై బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాయడం, బీజేపీ టూల్‌కిట్‌లో భాగంగా ఎంపీ అరవింద్ పనిగట్టుకుని సామాజిక మాధ్యమాల్లో బురద జల్లడం.. అంతా ప్రణాళిక ప్రకారం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

తెలంగాణ సమాజం అప్రమత్తంగా ఉండాలి

తన మొబైల్ ఫోన్ల విషయంలోనూ గతంలో తొందరపడి వార్తలు రాశారని, ప్రస్తుతం నేరగాడు సుకేశ్‌ను పావుగా వాడుకుని తెలంగాణ ప్రభుత్వం, కేసీఆర్ కుటుంబసభ్యులను బదనాం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని కవిత పేర్కొన్నారు. రాజకీయ ఎజెండాలో మీడియా సంస్థలు పావుగా మారి బీఆర్ఎస్‌పై తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. ఎన్నికల ఏడాదిలో వచ్చే ఈ తరహా వార్తల విషయంలో తెలంగాణ సమాజం అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అయినా తెలంగాణ ప్రజలకు పాలు, నీళ్ల నడుమ తేడా తెలుసని, కేసీఆర్ మీద కక్షతో, బీఆర్ఎస్ మీద ఈర్ష్యతో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని తరిమికొడతారని పేర్కొన్నారు. తెలంగాణ బిడ్డలుగా తాము తలవంచబోమని, తెగించి కొట్లాడతామని స్పష్టం చేశారు.

కవిత స్పందన బ్లేమ్‌గేమ్‌లా ఉంది

- సుకేశ్ న్యాయవాది అనంత్ మాలిక్
- తన క్లయింట్ ఈ వారంలోనే పూర్తి స్థాయిలో స్పందిస్తారని వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: తన క్లయింట్ సుకేశ్ చంద్రశేఖర్ లేవనెత్తిన ఆరోపణలపై ఎమ్మెల్సీ కవిత స్పందించిన తీరు మీడియా, రాజకీయ పార్టీలపై బ్లేమ్ గేమ్ (పరిష్కారం కోసం చూడకుండా నిందలు వేయడం)లా ఉందని న్యాయవాది అనంత్ మాలిక్ విమర్శించారు. సుకేశ్ ఎవరో తనకు తెలియదంటూ కవిత విడుదల చేసిన ప్రకటనపై స్పందించారు. ఈ మేరకు మీడియాకు ప్రకటన విడుదల చేశారు. 'సుకేశ్ చంద్రశేఖర్ లేవనెత్తిన అంశాలపై కవిత జారీ చేసిన ప్రకటన చిన్నపిల్లల వ్యవహారంలా ఉంది. సుకేశ్ తన ఆరోపణలను అఫిడవిట్ రూపంలో ఇచ్చారు. ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ సెక్షన్ 65బీ కింద ధ్రువపత్రం కూడా ఇచ్చారు. ఈ విషయంలో న్యాయమైన విచారణను స్వాగతించకుండా అస్పష్టమైన ఆరోపణలతో దర్యాప్తు నుంచి తప్పించుకోవాలని యత్నించడం నీటిని ఒడిసి పట్టుకొని ఉంచాలనుకోవడమే. అనుభవజ్ఞురాలైన రాజకీయ నాయకురాలెవరైనా విచారణ స్వాగతించేవారు. కవిత స్పందన చూస్తుంటే దాగుడుమూతలు ఆడడంలో ఉన్న నైపుణ్యం కనిపిస్తోంది. ఈ అంశం ప్రత్యేక దర్యాప్తు సంస్థల ప్రత్యేక పరిశోధనకు సంబంధించినదే కానీ, ప్రజల్లో ప్రజాదరణ కోసం పోటీ కాదు. అయితే నా క్లయింట్ కూడా ఈ వారంలోనే పూర్తిస్థాయిలో స్పందిస్తారు' అని అనంత్ తెలిపారు.

క్లుప్తంగా...

గొప్ప సంఘ సంస్కర్త అంబేడ్కర్: గవర్నర్ తమిళిసై



సాక్షి, హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆయనకు ఘన నివాళి అర్పించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ..దేశ రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్ భారతజాతి గొప్ప బిడ్డల్లో ఒకరని కొనియాడారు. అంబేడ్కర్ గొప్ప సంఘ సంస్కర్తతో పాటు ప్రఖ్యాత న్యాయవాదన్నారు. అణచివేతపై మానవ విజయానికి ఆయన జీవితమే గొప్ప ఉదాహరణ అని పేర్కొన్నారు. రాజ్యాంగ హక్కుల కల్పనకు అంబేడ్కర్ చేసిన కృషి ప్రశంసనీయమని గవర్నర్ నివాళులర్పించారు.

ఆ సొమ్ముతో నిజాం షుగర్స్ తెరవండి: బండి సంజయ్



సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కొంటామన్న డబ్బుతో నిజాం షుగర్స్‌ను తెరిపించాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ డిమాండ్ చేశారు. గురువారం ఢిల్లీలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ తన వద్ద ఉన్న డబ్బును బయ్యారం స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు కూడా వెచ్చించాలని సూచించారు.

అంబేడ్కర్ ఆశయాల అమల్లో కేసీఆర్

- ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే 'దళిత చైతన్య జ్యోతి' అమలు చేశారు
- నూతన సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టారు... సీఎం తెచ్చిన దళితబంధు పథకంతో పారిశ్రామికవేత్తలుగా దళితులు
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో మంత్రి కేటీఆర్
- టీ–ప్రైడ్ కింద 8 వేల మంది ఔత్సాహికులకు రూ. 523 కోట్లు మంజూరు



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రులు కేటీఆర్, కొప్పుల, సత్యవతి రాథోడ్, డిక్కీ జాతీయ అధ్యక్షుడు రవికుమార్ తదితరులు

సనత్‌నగర్: దేశ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్నారని ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖల మంత్రి కె. తారక రామారావు తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో గురువారం నిర్వహించిన అంబేడ్కర్ జయంతి ఉత్సవాలకు మంత్రులు కొప్పుల ఈశ్వర్, సత్యవతి రాథోడ్‌లతో కలసి మంత్రి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగం వల్లే తెలంగాణ వచ్చిందన్నారు. ఆయన ఆశయాల అమల్లో భాగంగానే దళితబంధు వంటి పథకాలను సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారని చెప్పారు. దళితబంధు పథకంతో దళితుల జీవితాల్లో వెలుగులు నిండాయని, పారిశ్రామికవేత్తలుగా వారు ఎదుగుతున్నారన్నారు. కేసీఆర్ ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడే ఎమ్మెల్యేగా ఆయన నియోజకవర్గమైన సిద్దిపేటలో దళిత చైతన్య జ్యోతి పేరిట దళితబంధు తరహా పథకాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. అలాగే నూతన సచివాలయ భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టారని తెలిపారు. దళిత, గిరిజన యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకే టీ–ప్రైడ్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని కేటీఆర్ వివరించారు. కాగా, ఈ వేదికపై టీ–ప్రైడ్ కింద 8 వేల మంది ఔత్సాహికులకు రూ. 523 కోట్లను కేటీఆర్ మంజూరు చేశారు. అలాగే టీ–ప్రైడ్ కింద సబ్సిడీ పొంది విజయవంతంగా దూసుకెళ్తున్న 17 మందికి బెస్ట్ టీ–ప్రైడ్ అవార్డులను ప్రదానం చేశారు. దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (డిక్కీ)కి 2 ఎకరాల స్థలం కేటాయించనున్నట్లు మంత్రి కేటీఆర్ ప్రకటించడంతో హర్షధ్వానాలతో సభాప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ వెంకటేశ్ నేత, ఎమ్మెల్యేలు సైదిరెడ్డి, రేఖానాయక్, టీఎస్ఐఐసీ చైర్మన్ బాలమల్లు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ రామచంద్రనాయక్, ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, 'డిక్కీ' జాతీయ అధ్యక్షుడు నర్రా రవికుమార్, రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ, ఇండస్ట్రీస్ డైరెక్టర్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళిత, గిరిజనులకు స్వర్ణయుగం: సత్యవతి

దళిత, గిరిజనులు కూడా అందరితో సమానంగా వృద్ధిలోకి రావాలని రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయాలను తీసుకుంటోందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. దళిత, గిరిజనులకు ఇది స్వర్ణయుగం లాంటిదన్నారు. తెలంగాణ రాకముందు 283 గురుకులాలు ఉంటే ఇప్పుడు వాటి సంఖ్య వెయ్యికి చేరిందన్నారు. నూతన ఆవిష్కరణలతో తెలంగాణ దేశానికే దిక్సూచిగా మారిందని, విజన్ ఉన్న సీఎంతోనే ఇది సాధ్యమవుతోందని ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. టీ–ప్రైడ్ ద్వారా ఎస్సీ, ఎస్టీలు యువ పారిశ్రామికవేత్తలుగా వృద్ధిలోకి వస్తున్నారన్నారు.

కేసీఆర్ వల్లే విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రం వెనక్కి...

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను విరమించుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్ బలంగా డిమాండ్ చేయడం, వైజాగ్ స్టీల్ ప్లాంట్ జారీ చేసిన ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్‌లో పాల్గొంటామని కేసీఆర్ ప్రకటించడం వల్లే కేంద్రం దిగొచ్చి తాత్కాలికంగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను విరమించుకున్నట్లు ప్రకటించిందని మంత్రి కేటీఆర్ వివరించారు. అదానీకి బైలడిల్లా గనుల కేటాయింపు కుట్రను బీఆర్ఎస్ బయట పెట్టిన నేపథ్యంలో ప్రజల దృష్టి మళ్లించేందుకే వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించడం లేదంటూ కేంద్రం నామమాత్ర ప్రకటన చేసిందని కేటీఆర్ అంతకుముందు ఓ ప్రకటనలో విమర్శించారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు వెంటనే క్యాప్టివ్ మైన్స్ కేటాయించాలని డిమాండ్ చేశారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ సంపూర్ణంగా ఆగేంత వరకు, బయ్యారంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటయ్యే వరకు కేంద్ర ప్రభుత్వంపై తమ ఒత్తిడి కొనసాగుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ దెబ్బకు కేంద్రం దిగొచ్చింది

- విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేయబోమని ప్రకటించింది
- ఇది కేసీఆర్, ఏపీ ప్రజల విజయం
- పార్టీ ఆత్మీయ సమ్మేళన సభలో మంత్రి హరీశ్‌రావు



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

వికారాబాద్: బీఆర్ఎస్ దెబ్బకు దిగివచ్చిన కేంద్ర ప్రభుత్వం.. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు పరం చేయబోమని ప్రకటించిందని, ఇది తెలంగాణ సీఎం కేసీఆర్‌తో పాటు ఏపీ ప్రజలు, విశాఖ కార్మికుల విజయమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. వికారాబాద్ జిల్లా మర్పల్లిలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని చవకగా అమ్మేందుకు ప్రయత్నించిందన్నారు. ఈ విషయంపై ఏపీలోని పార్టీలు ప్రశ్నించకుండా ఉంటే, కేసీఆర్, కేటీఆర్‌తో పాటు తాను కూడా కేంద్రాన్ని నిలదీశామని స్పష్టంచేశారు. ఇక ముందు కూడా ఏపీ ప్రజలకు తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అన్యాయానికి వ్యతిరేకంగా ఎక్కడైనా పోరాటం చేసేందుకు గులాబీ జెండా సిద్ధంగా ఉందని ప్రకటించారు. యాభై ఏళ్ల పాలనలో కాంగ్రెస్, టీడీపీలు చేయలేని అభివృద్ధిని కేవలం ఎనిమిదేళ్లలో చేసి చూపామని స్పష్టంచేశారు. అందుకే ఇక్కడ ఓటు అడిగే హక్కు కేవలం బీఆర్ఎస్‌కే ఉందన్నారు. కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా ఆశీర్వదించాలని కార్యకర్తలు, పార్టీ శ్రేణులను కోరారు. కాంగ్రెస్ హయాంలో ఎరువుల కోసం రైతులు రోజుల తరబడి క్యూలో నిలబడేవారన్నారు. కేసీఆర్ పాలనలో రైతులు ఏ ఒక్క రోజు కూడా ఇబ్బంది పడలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేపర్ స్టేట్‌మెంట్లతో వ్యవస్థలు మారిపోవు

- బీఆర్ఎస్ మంత్రుల తీరుపై ఏపీ మంత్రుల మండిపాటు
- ముందు మీ సంగతి చూసుకోవాలని హితవు

సాక్షి, అమరావతి/వజ్రపుకొత్తూరు/ఏలూరు(మెట్రో): బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన రెండు పేపర్ స్టేట్‌మెంట్లతోనే విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ నుంచి కేంద్రం వెనక్కి తగ్గిందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, తెలంగాణ మంత్రులు తొలుత వారి రాష్ట్రం సంగతి చూసుకోవాలని ఏపీ మంత్రులు బొత్స సత్యనారాయణ, సీదిరి అప్పలరాజు, పినిపే విశ్వరూప్, మాజీ మంత్రి పేర్ని నాని హితవు పలికారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలోనే హైదరాబాద్ అభివృద్ధి చెందిందనే వాస్తవాన్ని తెలుసుకోవాలన్నారు. ముందు సింగరేణి సంగతి చూసుకోవాలని చెప్పారు. గురువారం వారు ఆయా ప్రాంతాల్లో మీడియాతో మాట్లాడారు.

మీ వెర్రికి నా జోహార్లు..



విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకునేందుకు మా ప్రభుత్వం మొదటి నుంచీ చిత్తశుద్ధితో పని చేస్తోంది. సమయం వచ్చినప్పుడల్లా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధానికి లేఖలు రాస్తూనే ఉన్నారు. ప్రైవేటీకరణను ఏ విధంగా ఆపుకోవాలో మా ప్రభుత్వానికి తెలుసు. కేంద్ర ప్రభుత్వ ప్రకటన తాత్కాలిక ఉపశమనమే. సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యేవరకు మేము పోరాడుతూనే ఉంటాం. బీఆర్ఎస్ రెండు పేపర్ ప్రకటనలు ఇస్తే కేంద్ర ఆపేసిందా? రెండు స్టేట్‌మెంట్లకు వ్యవస్థలు మారిపోతాయా? వాళ్ల వెర్రికి నా జోహార్లు.

– బొత్స సత్యనారాయణ, విద్యా శాఖ మంత్రి

సంయమనంతో వ్యవహరించాలి

హరీశ్‌రావు వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం. ఆయన తీరు మార్చుకోవాలి. ఏపీ గురించి తక్కువ చేసి మాట్లాడితే సహించబోం. మా ముఖ్యమంత్రిని ఎవరైనా ఏదైనా అంటే కచ్చితంగా నిలువరించే ప్రయత్నం చేస్తాం. హరీశ్‌రావు అదే పనిగా గిల్లుతూ మాట్లాడుతున్నారు. మనం ఇరుగు పొరుగు రాష్ట్రాల వాళ్లం. సంయమనంతో వ్యవహరించాలి.

– సీదిరి అప్పలరాజు, పశుసంవర్ధకశాఖ మంత్రి

జనం నవ్విపోతారు..



హైదరాబాద్ చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో, ఎయిర్‌పోర్టు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే వచ్చాయి. గత 40 ఏళ్లుగా అనేక మంది ముఖ్యమంత్రులు హైదరాబాద్‌ను అభివృద్ధి చేశారు. ఇటీవల కాలంలో మాత్రమే భారీగా అభివృద్ధి చెందిందనే మాట వాస్తవం కాదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి ఫలితంగానే విశాఖ ఉక్కు కర్మాగారం అంశంలో కేంద్రం దిగివస్తోంది. ఇందులో బీఆర్ఎస్ ఒత్తిడి ఏమిటి? జనం నవ్విపోతారు.

– పినిపే విశ్వరూప్, రవాణా శాఖ మంత్రి

'సీమ'ఎత్తిపోతలకు ఎందుకు అడ్డు తగులుతున్నారు?



తెలంగాణ సీఎం కేసీఆర్ భయంతోనే విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణపై కేంద్రం వెనకడుగు వేసిందన్న కేటీఆర్ మాటలను చూస్తుంటే ఉట్టికే ఎక్కలేనమ్మ స్వర్గానికి ఎక్కుతానన్నట్లుంది. సింగరేణిని కేంద్రం అమ్మేస్తానంటోంది. కేటీఆర్.. ముందు ఆసంగతి చూడండి. నిజంగా ఆంధ్ర రాష్ట్ర ప్రజలపై కేసీఆర్‌కు, హరీశ్‌రావుకు ప్రేమ ఉంటే.. రాయలసీమ ఎత్తిపోతలకు ఎందుకు అడ్డుతగలుతున్నారు?

– మాజీ మంత్రి పేర్ని నాని



విశాఖ ఉక్కుపై కేంద్రం దిగి వచ్చింది: తోట చంద్రశేఖర్

సాక్షి, హైదరాబాద్: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ విషయంలో తమ పార్టీ దెబ్బకు కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మంత్రి కేటీఆర్ కేంద్రానికి లేఖ రాశారని, సీఎం కేసీఆర్ ఒక అధ్యయన బృందాన్ని పంపారని అన్నారు. తమ పార్టీకి ఇది తొలి విజయమన్నారు.

హైదరాబాద్‌లో వ్యవసాయంపై జీ20 సదస్సు


జూన్‌లో 15 నుంచి 17 వరకు మూడు రోజులపాటు నిర్వహణ

సాక్షి, హైదరాబాద్: అత్యంత ప్రతిష్టాత్మకమైన జీ20 దేశాల వ్యవసాయ సదస్సు హైదరాబాద్‌లో జరగనుంది. జూన్ 15 నుంచి 17వ తేదీ వరకు దీనిని నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు 30 దేశాల వ్యవసాయ శాఖ మంత్రులు హాజరవుతారని రాష్ట్ర వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. జీ 20 దేశాలైన ఇండోనేసియా, బ్రెజిల్, అర్జెంటీనా, ఆస్ట్రేలియా, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, కొరియా, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, టర్కీ, యూకే, ఈయూలోని కొన్ని దేశాలు, యూఎస్ఏల మంత్రులు హాజరుకానున్నారు. అలాగే ఈ సదస్సుకు బంగ్లాదేశ్, ఈజిప్ట్, మారిషస్, నెదర్లాండ్స్, ఒమన్, నైజీరియా, సింగపూర్, స్పెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, వియత్నాం దేశాలకు చెందిన వ్యవసాయ మంత్రులను కూడా ఆహ్వానించారు. వీరితోపాటు ఇక్రిశాట్, ఏడీబీ, ఐక్యరాజ్య సమితి, వరల్డ్‌బ్యాంక్.. తదితర సంస్థల ప్రతినిధులు కూడా హాజరవుతారు. రాష్ట్ర వ్యవసాయశాఖ ఈ సదస్సుకోసం అన్ని రకాల ఏర్పాట్లు చేస్తోంది. కాగా, ఇప్పటివరకు దేశంలో మూడు వ్యవసాయ సంబంధిత జీ20 సదస్సులు జరిగాయి. ఫిబ్రవరిలో ఇండోర్‌లో, మార్చి చివరి వారంలో చండీగఢ్‌లో, తర్వాత ఈ నెలలో వారణాసిలో మూడు రోజులపాటు వ్యవసాయ రంగానికి చెందిన ముఖ్య శాస్త్రవేత్తల సదస్సు జరిగింది. ఇప్పుడు నాలుగో వ్యవసాయ సదస్సు హైదరాబాద్‌లో జరగబోతుంది.



పెట్టుబడిదారులకు న్యాయం చేస్తాం

హీరా గ్రూప్స్ సీఈవో నౌహీరా షేక్



బంజారాహిల్స్: తమ సంస్థలో పెట్టుబడిదారులకు ఎలాంటి అన్యాయం జరగలేదని త్వరలోనే అందరికీ న్యాయం చేస్తామని హీరా గ్రూప్స్ సీఈవో నౌహీరా షేక్ తెలిపారు. బంజారాహిల్స్‌లోని హీరా గ్రూప్స్ కార్పొరేట్ కార్యాలయంలో సుప్రీంకోర్టు న్యాయవాది వరప్రసాద్‌తో కలిసి ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. కొంతమంది దురుద్దేశపూర్వకంగా తమ సంస్థపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. గత 20 ఏళ్లుగా ఎంతో నమ్మకంతో వ్యాపారం చేస్తున్నామని, 2018లో మహిళల కోసం మహిళా ఎంపవర్‌మెంట్ పార్టీని స్థాపించిన తర్వాతనే తనపై అక్రమ కేసులు నమోదయ్యాయన్నారు. నాలుగేళ్లుగా సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తున్నామని, త్వరలోనే ఇన్వెస్టర్లందరికీ న్యాయం చేస్తామన్నారు.





మనుషులు నశ్వరులు. అలాగే ఆలోచనలు.
ఒక మొక్కకు నీళ్లు ఎలా అవసరమో, ఆలోచనకు వ్యాప్తి అలా
అవసరం. లేదంటే రెండూ వాడిపోయి చచ్చిపోతాయి.
– డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్

సాక్షి

శుక్రవారం, 14 ఏప్రిల్ 2023

జగన్ నిర్ణయం చరిత్రాత్మకం

ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చింది మొదలు అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం వినూత్నమైన, సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో బీసీల కుల గణనకు సంకల్పించి ఆ వర్గాల చిరకాల వాంఛ నెరవేర్చారు. గద్దెనెక్క దల్చుకున్న ప్రతి పార్టీ అట్టడుగు వర్గాల ఉద్ధరణే ధ్యేయమని ప్రకటించటం మన దేశంలో రివాజు. అధికారం వస్తే గిస్తే ఆ వర్గాల నేతల్లో కొందరికి మొక్కుబడిగా పదవులివ్వటం, ఆ వర్గాల ప్రజలను ఆర్థికంగా ఆదుకునే పేరుతో నామమాత్రంగా నిధులు విదల్చటం కూడా షరా మామూలే. కానీ జగన్‌మోహన్ రెడ్డి ఇందుకు భిన్నంగా సాధారణ ప్రజానీకానికి అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే తన కేబినెట్‌లో 68 శాతం పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు కేటాయించి ఔరా అనిపించారు. సామాజిక న్యాయానికి పెద్ద పీట వేస్తూ చట్టసభల్లో, స్థానిక సంస్థల పదవుల్లో అట్టడుగు కులాలకు ప్రాతినిధ్యం గణనీయంగా పెంచటమే కాదు... అన్ని రకాల నామినేటెడ్ పదవుల్లో, నామినేషన్లపై ఇచ్చే పనుల్లో కూడా ఆ వర్గాలకు 50 శాతం కేటాయించాలని నిర్దేశించారు. వెనకబడిన కులాల్లో ఇంతవరకూ ఎవరి దృష్టీ పడని కులాలకు సైతం ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారి సామాజిక ఆర్థిక ప్రగతికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఆ క్రమంలో బీసీల కుల గణనకు పూనుకోవాలనుకోవటం అత్యంత కీలక నిర్ణయం.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లవుతున్నా, జనాభాలో 56 శాతంగా ఉన్న బీసీ కులాలకు విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో పెద్దగా ప్రాధాన్యత లేదు. వివక్ష కారణంగా వెనకబాటుతనానికి గురవుతున్న కులాలను గుర్తించేందుకు 1979లో కేంద్రంలోని అప్పటి జనతా పార్టీ ప్రభుత్వం మండల్ కమిషన్ ఏర్పాటు చేసింది. ఆ కమిషన్ ఇచ్చిన సమగ్రమైన నివేదికను పట్టించుకుని తగిన చర్యలు తీసుకోవాలన్న స్పృహ ఎవరికీ లేని కారణంగా దశాబ్దంపాటు అది మూలనపడింది. 1989లో అప్పటి ప్రధాని వీపీ సింగ్ నేతృత్వంలోని సర్కారు ఆ నివేదిక దుమ్ము దులిపి ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించటం ఆ వర్గాల వారికి విద్య, ఉద్యోగావకాశాలను కల్పించటం మాత్రమే కాదు... దేశ రాజకీయాల గతినే మార్చేసింది. ఆ తర్వాత నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏదోమేరకు ఆ వర్గాల వారికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. అరకొరగానైనా ఆ వర్గాలకు రాజకీయ పదవులు దక్కుతున్నాయి. విద్య, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లు ఇంకా పూర్తి స్థాయిలో అమలుకావటం లేదు. ఉన్నతశ్రేణి విద్యాసంస్థల్లోనూ, ఇతరత్రా ప్రభుత్వరంగ సంస్థల్లోనూ కోటా అమలు అంతంతమాత్రంగానే ఉన్నదని బీసీ వర్గాలు తరచు ఆరోపిస్తున్నాయి. జనాభాలో మెజారిటీ వర్గ ప్రజలు అభ్యున్నతి సాధించకుండా దేశం ఉన్నత స్థాయికి చేరుకోవటం సాధ్యమవుతుందా? దేశంలో చివరిసారి కులగణన బ్రిటిష్ పాలకుల హయాంలో 1931లో జరిగింది. స్వతంత్ర భారతదేశంలో పదేళ్లకోసారి నిర్వహించే జనాభా లెక్కల సేకరణ 1951లో మొదలు కాగా, 2011లో జరిగిన జనాభా లెక్కల సేకరణ వరకూ బీసీ కులాల గణన జోలికే మన పాలకులు పోలేదు. పశుపక్ష్యాదుల లెక్కలు సైతం తెలుసుకోవాలనుకునే ప్రభుత్వాలకు బీసీ జనాభా గణన పట్టకపోవటం దిగ్భ్రాంతి కలిగిస్తుంది. ఒకవక్క అట్టడుగు వర్గాల ఉద్ధరణ ధ్యేయమంటూ పథకాలు రూపొందించిన పాలకులు అవి లక్షిత వర్గాలకు చేరుతున్నాయో లేదోనన్న స్పృహ లేకుండా గడిపారు. అందువల్లే ఇన్నేళ్లుగా ఆశించిన ఫలితాలు రాలేదన్నది వాస్తవం. వేళ్లమీద లెక్కించదగ్గ కులాలు మినహా ఇప్పటికీ చాలా బీసీ కులాలు సంక్షేమ పథకాల మాట అటుంచి కనీస అవసరాలు కూడా దక్కించుకోలేకపోతున్నాయి. మండల్ కమిషన్ నివేదిక ప్రకారం బీసీ కులాలు 2,666 కాగా సంక్షేమ ఫలాలు అందుకునే కులాలు అందులో పట్టుమని పదిశాతం కూడా ఉండటం లేదు. బీసీ జనాభా సంఖ్య ఎంతన్నది మిస్టరీగా మిగిలిపోవటం వల్ల ఆర్థికంగా, విద్యాపరంగా, ఉపాధిపరంగా ఆ వర్గాల స్థితిగతులేమిటన్నది ప్రభుత్వాలకు తెలియటం లేదు. రూపొందించే పథకాలు, అందుకోసం కేటాయించే నిధుల వ్యవహారం చీకట్లో తడుములాటగా సాగుతోంది.

ఆంధ్రప్రదేశ్‌లో 341 రోజులపాటు సాగించిన 3,641 కిలోమీటర్ల ప్రజా సంకల్పయాత్రలో కోట్లాదిమంది అట్టడుగు ప్రజానీకం కష్టాలనూ, కడగండ్లనూ జగన్ కళ్లారా చూసినందువల్లే నవరత్నాల పేరిట అనేక సంక్షేమ పథకాలు పొందుపరిచి మేనిఫెస్టో రూపొందించారు. వాటిని అమలు చేస్తూనే ఇతరేతర వర్గాలకు లబ్ధి చేకూరేలా మరిన్ని పథకాలను ఆచరణలోకి తీసుకొచ్చి సంక్షేమ ఫలాలు సంపూర్ణంగా అందేలా చర్యలు తీసుకున్నారు. బీసీల జనాభా గణన పూర్తయితే ఇది మరింత పదునుతేరుతుందన్న ఆలోచన ఆయనది. అందువల్లే ఈసారి జనాభా లెక్కల్లో బీసీ కులాలను గణించాలన్న బీసీ వర్గాలకు అందరికన్నా ముందు మద్దతు పలకటమేకాక, ఆ డిమాండ్‌ను సమర్థిస్తూ పార్లమెంటులో తమ పార్టీ ఎంపీలతో మాట్లాడించారు. రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం ఆమోదింపజేశారు. బీసీల కుల గణన నిర్ణయానికి అనువుగా ఇప్పటికే ఆ దిశగా అడుగులేసిన రాష్ట్రాల్లో కార్యాచరణ ఏ విధంగా ఉందన్న అంశాన్ని అధ్యయనం చేసేందుకు, మార్గదర్శకాలు రూపొందించేందుకు కమిటీ ఏర్పాటు చేశారు. జాతీయ పక్షాలుగా ముద్రపడిన పార్టీలు సైతం బీసీ వర్గాల డిమాండ్‌పై నికరమైన విధానం ప్రకటించలేని నిస్సహాయతలో పడగా ఆదినుంచీ అందుకు మద్దతిస్తున్న జగన్‌మోహన్ రెడ్డి తన తాజా నిర్ణయంతో ఆ వర్గాలకు మరింత చేరువయ్యారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, తిథి: బ.నవమి రా.9.55 వరకు, తదుపరి దశమి, నక్షత్రం: ఉత్తరాషాఢ ఉ.9.18 వరకు, తదుపరి శ్రవణం, వర్జ్యం: ప.11.58 నుండి 1.25 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.16 నుండి 9.07 వరకు తదుపరి ప.12.23 నుండి 1.15 వరకు
అమృతఘడియలు: రా.8.48 నుండి 10.17 వరకు.

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం : 6.11
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

ఈ యుగం బాబాసాహెబ్‌దే!

ఇవ్వాళ పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులు అందరూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను భుజానికి ఎత్తుకుంటున్నారు. ఇందులో కొందరు అంబేడ్కర్ చెప్పిన సామాజిక న్యాయాన్ని ప్రజలకు అందించేవారూ ఉన్నారు. కానీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... బాబాసాహెబ్ ఏం చెప్పారో దానికి పూర్తి వ్యతిరేకంగా వ్యవహరిస్తూ దేశ రాజ్యాంగ మౌలిక సూత్రాలనే దెబ్బతీయ చూస్తున్నవారూ ఉండటం! విభిన్న భౌగోళిక ప్రాంతాలూ, అనేక జాతులూ, మతాలూ, కులాలూ, భాషలూ ఉన్న భారతదేశం సమాఖ్య లౌకిక రాజ్యంగా విలసిల్లాలని అంబేడ్కర్ ఆశించారు. ఆ మేర రాజ్యాంగంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. కానీ నేడు కొందరు పాలకులు, ప్రభుత్వాలు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు తూట్లు పొడిచే విధంగా అడుగులు వేస్తుండడం విషాదకరం.

సందర్భం



డాక్టర్ కత్తి పద్మారావు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి సందర్భంగా, ప్రపంచవ్యాప్తంగా ఆయన వ్యక్తిత్వాన్ని గురించి, సిద్ధాంత అన్వయం గురించి ముఖ్యంగా భారత రాజ్యాంగ నిర్మాణం గురించి, కుల నిర్మూలనా సిద్ధాంత ప్రతిపాదన గురించి చర్చ జరుగుతోంది. ఆయన తన జీవిత కాలంలో విస్తృతంగా రచనలు చేశారు. ఆయన మేధో సంపన్నత ఆయన గవేషణ పద్ధతిలోనే ఉంది. ముఖ్యంగా వేదాలను పరిశీలించిన పద్ధతి వినూత్నమైనది, విశ్లేషణాత్మకమైనది. ఎందుకంటే అంతకుముందు వేదాల గురించి పరిశోధించిన మాక్స్ ముల్లర్, సురేంద్ర దాస్ గుప్తా, సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటివారు ఎవరూ కూడా వేదాలు అశాస్త్రీయమైన భావాలతో రూపొందాయని చెప్ప లేకపోయారు. ముఖ్యంగా శంకరాచార్యులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు తమ తమ కోణాల్లో వేద సమర్థకులుగా భాష్యం రాసుకున్నారు. అంబేడ్కర్ ఒక్కరే వేదాలను, భగవద్గీతను హింసాత్మక గ్రంథాలుగా పేర్కొన్న సాహసవంతుడు. అలాగే ఆయన 'శాక్రెడ్ ఆఫ్ ఈస్ట్' పేరుతో వచ్చిన 50 వాల్యూమ్స్ చదివి రాసుకున్న నోట్స్ ఎంతో విలువైనవి. దాన్ని ముద్రిస్తే ప్రపంచ మూల తత్వ శాస్త్రానికి ఎంతో విలువైన సమాచారం జోడించగల గ్రంథాలు అందుబాటులోకి వస్తాయి. ఆయన తాత్విక దర్శనాలు శాస్త్రీయమైన చర్చతో కూడి ఉంటాయి. మార్క్స్, ఎంగెల్స్‌లు రాసిన 'కమ్యూనిస్ట్ మేనిఫెస్టో', ఎంగెల్స్ రాసిన 'డైలెక్టిక్స్ ఆఫ్ నేచర్', మోర్గాన్ రాసిన 'ఏన్షియంట్ సొసైటీ' వంటి వాటి స్థాయిలో... ఆయన తాత్విక, సామాజిక, రాజకీయ చర్చలు ఉంటాయి.

వేదాల గురించి అంబేడ్కర్ ఇలా అన్నారు. 'వేదాలు హిందువుల మతసాహిత్యంలో అత్యున్నత స్థానాన్ని ఆక్రమించుకున్నాయని చెప్పడం వాటిని గురించి చాలా తక్కువ చెప్పినట్టే అవుతుంది. వేదాలు హిందువుల పవిత్ర సాహిత్యం అని చెప్పినా సరిపోనిదే అవుతుంది. ఎందుచేతనంటే అవి తప్పు పట్టడానికి వీలు లేనివి. వాటిని అపౌరుషేయాలని నమ్ముతారు కాబట్టి'. అంటే వేదాలు మానవ కల్పితాలు కావు అని అర్థం. మానవ కల్పితాలు కాకపోవడం వల్ల సాధారణంగా ప్రతి మానవుడు చేసే తప్పిదాలకు, దోషాలకు, పొరపాట్లకు అవి అతీతంగా ఉంటాయి. అందుచేతనే అవి అమోఘమైనవిగా భారతీయులు నమ్ముతున్నారు. అయితే అంబేడ్కర్ వేదాలను మానవ మాత్రులైన రుషులే రచించారని చెప్పారు. ఒకరిని ద్వేషించే, అపహాస్యం చేసే, హింసను ప్రోత్సహించే ఏ గ్రంథాలైనా అవి విశ్వజనీనమైనవి కావు అని అంబేడ్కర్ చెప్పారు.

అంబేడ్కర్ ప్రతిభ బహుముఖీనం. ప్రధానంగా ఆయన తాత్వికులు. ముందు తన్ను తాను తెలుసుకున్నారు. తర్వాత తన చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా తెలుసుకున్నారు. తనకూ సమాజానికీ ఉండే అంతఃసంబంధాలను అధ్యయనం చేశారు. సమాజానికి అంతః ప్రకృతి అయిన రాజ్యాన్నీ, దాని అంగమైన ప్రభుత్వాన్నీ, వాటి పునాదుల్నీ పరిశోధించారు. వాటికీ తనకూ ఉండే వైరుధ్యాలనూ బయటకు తీశారు. ఈ దృష్టితో చూసినప్పుడు భారతావనిలో బుద్ధుని తర్వాత అంతటి లోతైన నైతిక వ్యక్తిత్వం అంబేడ్కర్‌దే అవుతుంది. ఆయన సామాజిక జీవితానికి పునాది బుద్ధుని బోధనా తత్వంలోనే అంతర్లీనంగా ఉంది. ఆయన బోధనలో ప్రేమ, కరుణ, ప్రజ్ఞ, ఆచరణ, దుఃఖ నివారణ, సంఘ నిర్మాణం, నైతికత, త్యాగం, ప్రధానమైనవి.

ఆయన ఎంతో నిబద్ధంగా జీవించారు. రాత్రి పది గంటలకు ఆయన అన్నం తినేటప్పుడు పుస్తకాల జ్వలనంతో పాటు ఆకలి మంట కూడా రగులుతూనే ఉండేది. లండన్ వీధుల్లో అర్ధాకలితో తిరిగారు. ఆయన ధనాన్ని జ్ఞానానికి ఎక్కువ ఖర్చు చేశారు. ఆకలి తీర్చుకోవడానికి తక్కువ డబ్బు వాడేవారు. కాల్చిన రొట్టె ముక్క లను ఒక కప్పు టీలో ముంచి తిని అనంత అధ్యయనం చేసిన త్యాగశీలి ఆయన. ఈరోజు స్కాలర్‌షిప్‌తో చదువుకుంటున్న కొందరు దళిత విద్యార్థులు తమ ఉపకార వేతనాన్ని విలాసాలకు వాడుతున్న వైనం చూస్తుంటే అంబేడ్కర్ నుంచి వీరు ఎంత నేర్చుకోవాలో అర్థమవుతుంది.

అంబేడ్కర్ పరీక్షల కోసం చదవలేదు. విజ్ఞానం కోసం, అవగాహన కోసం సిద్ధాంత నిర్మాణం కోసం, సాక్ష్యాధారాల కోసం చదివారు.



నేడు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతి

రాత్రంతా చదువుతూ కనిపించే అంబేడ్కర్‌తో రూమ్‌మేట్ ఎప్పుడైనా చదువు ఆపు అంటే...'నా పరిస్థితులు, నా పేదరికం, నేను ఎంత త్వరగా విద్యార్జన పూర్తి చేస్తే అంత మంచిది. నా కాలాన్ని నేను ఎంత విద్యార్జనలో గడిపితే, ఎంత సద్వినియోగం చేసుకుంటే అంత మంచిది' అని చెప్పేవారు. ఆయన చదువు పట్ల చూపిన నిబద్ధతని ఈనాటి దళిత విద్యార్థి లోకం అనుసరించినట్లయితే మేధోసంపన్నత వీరి సొంతమై వీరు భారత దేశ పునర్నిర్మాణానికి ముందుకు వస్తారు.

నీటి వినియోగం పైన అంబేడ్కర్ పెట్టిన శ్రద్ధ ఏ జాతీయ నాయకుడూ పెట్టలేదు. అంతగా పట్టించుకోలేదు. ఆయన ప్రణాళికలు నిర్దిష్టమైనవి. కార్మికుల అభివృద్ధి కోసం, వ్యవసాయ, వ్యవసాయేతర కార్మికులకు ఉపాధి కల్పించాలని ఆయన పోరాడారు. గ్రామీణ శ్రామికులను పారిశ్రామిక పనుల్లో ఉపయోగించుకుంటే పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా కొలంబియా, హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలలో అంబేడ్కర్ మీద జరిగినంత పరిశోధన భారతదేశంలో జరగడం లేదు. అన్ని కేంద్రీయ, రాష్ట్రీయ, దేశీయ విశ్వ విద్యాలయాల్లోనూ అంబేడ్కర్ పరిశోధనా కేంద్రాలు నిర్మించి... తగినన్ని నిధులు ఇచ్చి ప్రోత్సహించటం ద్వారా ఆయన రచనల లోని ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, విద్యా అంశాలపై పరిశోధనలు జరిగేలా చూడాలి. ఆయన నడిపిన పత్రికలు, ఆయన నిర్మించిన సంస్థలు, పార్టీలు, ఆయన ప్రణాళికలు దేశ భవిష్యత్తుకు మార్గదర్శకాలు. ముఖ్యంగా భూమినీ, పరిశ్రమలనూ జాతీయం చేయాలనే ఆయన ఆలోచన... దళిత, బహుజన, మైనారిటీలు రాజకీయ అధికార సాధన మీద ఆధారపడి ఉంది. అంబేడ్కర్ ముందటి భారతదేశం వేరు. ఆయన తర్వాతి భారతదేశం వేరు. అందుకే అంబేడ్కర్ యుగ కర్త. ఈ యుగం ఆయనదే. ఆయన మార్గంలో నడుద్దాం.

వ్యాసకర్త దళిత ఉద్యమనేత । 98497 41695

రాజ్యాంగం నిర్దేశించిన సూత్రాల ప్రకారమే భారత్‌లో సమాఖ్య ప్రభుత్వాలు పూర్తిగా నడవక పోయినా... రాజ్యాంగ మౌలిక సూత్రాలను మాత్రం గత ఆరు దశాబ్దాల్లో అవి అతిక్రమించ లేదనేది వాస్తవం. ఒక వేళ అటువంటి పరిస్థితులు తలెత్తినా న్యాయవ్యవస్థ ఎప్పటికప్పుడు తన న్యాయ సమీక్షాధికారం ద్వారా రాజ్యాంగాన్ని రక్షిస్తూ వచ్చింది.

ఆర్ఎస్ఎస్ భావజాలం పుణికిపుచ్చుకున్న బీజేపీ 'ఒకే జాతి, ఒకే భాష, ఒకే దేశం' అంటూ నియంతృత్వ భారతాన్ని నిర్మించడానికి వడి వడిగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. భారత రాజ్యాంగం బోధిస్తున్న బహుళత్వం, పరస్పర సహకారం, రాష్ట్రాల హక్కులు, స్థానిక స్వయం పరిపాలన వంటి వాటిని తుంగలో తొక్కడానికే అఖండ ఏకైక భారత్ ప్రాపగాండా అనేది స్పష్టం.

ఈ దేశంలోని వేల కులాలు, విభిన్న జాతులు, మతాలు, ప్రాంతాల అస్తిత్వాలను కనుమరుగు చేసి మెజారిటీ మతాన్నీ, భాషనూ ఇతరులపై రుద్దడానికి చేస్తున్న ప్రయత్నాలను ఇంతకన్నా ఏవిధంగా అర్థం చేసుకోవాలి? 'రాష్ట్రాలు మిథ్య, కేంద్రమే నిజం' అన్న రీతిలో కేంద్రంలోని అధికార పార్టీ విధానాలు సాగుతున్నాయి. ఇదే సమయంలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ మాత్రం చైతన్యరహితంగా తన పాత పద్ధతుల్లోనే వ్యవహరిస్తూ అనేక రుగ్మతలతో కునారిల్లుతోంది. దేశ నవ నిర్మాణంపై స్పష్టమైన జాతీయ విధానాలు లేని మిగతా జాతీయ పార్టీలు నామమాత్రంగానే మనుగడ సాగిస్తున్నాయి. మరో పక్క చాలా ప్రాంతీయ పార్టీలు అవినీతికి, కుటుంబ పాలనకు కేరాఫ్ అడ్రస్‌గా ఉంటూ జాతీయ రాజకీయాల్లో ప్రభావవంతమైన పాత్రను పోషించే స్థితిలో లేవు.

ఈ పరిస్థితులను అనువుగా తీసుకుని బీజేపీ ఈసారి పార్లమెంట్‌లో అత్యధిక మెజారిటీ సాధించడంతో పాటూ, దేశంలోని సగానికి పైగా రాష్ట్రాల్లో ప్రభుత్వాలను హస్తగతం చేసుకోవాలని వ్యూహం పన్నుతోంది. నిజంగా ఈ వ్యూహం ఫలిస్తే రాజ్యాంగానికి భారీ సవరణలు చేపట్టి దాని మౌలిక స్వరూపాన్ని మార్చడం బీజేపీకి సులువవుతుంది. మెజారిటీ మతం దేశ ప్రజలందరి మతం అయినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఆ మతానుయాయుల సంస్కృతే మొత్తం దేశ సంస్కృతిగా చలామణీ అవుతుంది. ఇప్పటికే మైనారిటీలు, నిమ్నవర్గాల ఆహార విహారాలపై ఛాందసవాదుల దాడులు, ఆంక్షలను చూస్తూనే ఉన్నాం. బీఫ్‌ను ఆహారంగా తీసుకున్న వారు మత విలువల్ని కించపరచిన వారుగా దాడులకు గురవుతున్నారు. ఎక్కువగా ఉత్తరాదికి పరిమితమైన మూక దాడుల సంస్కృతిని దక్షిణాదికీ, ఈశాన్య భారతానికీ ఛాందసవాదులు విస్తరింపచూస్తున్నారు.

ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఇప్పటి వరకు ఎలాంటి సైనిక, ప్రజా తిరుగుబాటులు జరుగలేదంటే అందుకు రాజ్యాంగం ఇచ్చిన లౌకిక ప్రజాస్వామ్య విలువలే ప్రధాన కారణం. అన్ని కులాలూ, జాతులూ, మతాలూ, భాషలూ, ప్రాంతాలకు సమాన ప్రాతినిధ్యం, హక్కులు కల్పించడమనే మౌలిక సూత్రం రాజ్యాంగంలో ఉన్నది కాబట్టే తిరుగుబాట్లు తలెత్తలేదు. కానీ ఒకే దేశం, ఒకే జాతి లాంటి నినాదాలను ముందుకు తెచ్చి కేంద్రీకృత నియంతృత్వ విధానాలనూ, ఫాసిజాన్నీ దేశంలో అమలు చేయడానికి నేడు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అధికార పార్టీ తన నియంతృత్వ ధోరణిలో భాగంగానే పెద్ద నోట్ల రద్దు వంటి నిర్ణయాలను రాత్రికి రాత్రే తీసుకుని ప్రజలను ఇక్కట్ల పాలు చేసింది.

సందర్భం



డా॥ గాలి వినోద్ కుమార్

ప్రాతినిధ్య ప్రజాస్వామ్య దేశ నిర్మాణంలో భాగంగా డాక్టర్ అంబేడ్కర్... ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సామాజికంగా వెనుక బడిన కారణంగా వారికి రాజ్యాంగంలో రిజర్వేషన్లు పొందుపరచి... విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అవకాశాలు కల్పించారు. కానీ అంబేడ్కర్ నిర్దేశించిన రిజర్వేషన్ల స్ఫూర్తికి తూట్లు పొడుస్తూ ఆర్థికంగా వెనుకబాటు ఆధారంగా 10 శాతం అగ్ర వర్ణ పేదలకు రిజర్వేషన్లను ఎటువంటి కమిషన్ వేయకుండా, ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మూడు రోజుల్లోనే పార్లమెంట్‌లో ఆమోదింపచేసుకున్న మోదీ ప్రభుత్వాన్ని ఏవిధంగా అర్థం చేసుకోవాలి?

6 కోట్ల జనాభా ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు సామాజిక న్యాయాన్ని పాటిస్తూ అయిదుగురికి ఉప ముఖ్యమంత్రి పదవులనిచ్చి ముఖ్యమంత్రి జగన్ దేశానికే ఆదర్శంగా నిలిచారు. 135 కోట్ల జనాభాను పాలించే బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కనీసం అయిదు ప్రాంతాలకు అయిదుగురు ఉపప్రధానులను చేస్తే తప్పేమిటి? 1955 లోనే మొదటి 'రాష్ట్రాల విభజన కమిషన్'కు భారత రాజ్యాంగ పిత అంబేడ్కర్ ఓ లేఖ రాస్తూ... ఉత్తరాదిన ఢిల్లీని మొదటి దేశ రాజధానిగానూ, దక్షిణాదిన ఉన్న హైదరాబాద్‌ను దేశ రెండో రాజధానిగానూ చేయాలని ప్రతిపాదించారు. ఇంత వరకు కాంగ్రెస్ కాని, బీజేపీ కానీ ఈ ప్రతిపాదనను పట్టించుకోలేదు. పాలన, అధికార వికేంద్రీకరణ జరిగితేనే కదా అన్ని ప్రాంతాల ప్రజలకూ న్యాయం జరిగేది.

స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా... 135 కోట్ల జనాభాకు కేవలం 29 రాష్ట్రాలు మాత్రమే ఉన్నాయి. అన్ని అంశాల్లో అమెరికాను ఆదర్శంగా తీసుకుంటున్న భారత్ రాష్ట్రాల సంఖ్య విషయంలో ఎందుకు తీసుకోదో అర్థం కాదు. 35 కోట్ల జనాభాకన్నా తక్కువే ఉన్న అమెరికాలో 50 రాష్ట్రాలు ఉన్నాయి. స్వయం నిర్ణయాధికారాలూ, సొంత సుప్రీంకోర్టు, సొంత రాజ్యాంగం, సొంత జెండా, ఎజెండా కలిగి ఉండే స్వేచ్ఛ అక్కడి రాష్ట్రాలకు ఉంది. అందుకే అక్కడ రాష్ట్రాలు సర్వతోముఖాభివృద్ధి చెందాయి. బాబాసాహెబ్ సూచించినట్లు భారత్‌లో 2 కోట్ల జనాభాకు ఒక రాష్ట్రం చొప్పున ఏర్పాటు చేస్తే మేలు జరిగి ఉండేది.

జాతీయ వాదం ముసుగులో దళిత, మైనార్టీలపై దాడులు చేస్తే... దేశ జనాభాలో 35 శాతం ఉన్న ఈ వర్గాలు ఎలా నవభారత నిర్మాణంలో భాగస్వాములు అవుతాయి? అందుకే బీజేపీ పాలకులు దుందుడుకు పోకడలకు పోకుండా అంబేడ్కర్ ఆశయాల సాధనకు పాటు పడితే దేశం దానంతట అదే అభివృద్ధి చెందుతుంది.

వ్యాసకర్త ఫౌండర్ చైర్మన్, నవ భారత్ నిర్మాణ్ ఛారిటబుల్ ట్రస్టు

ఇన్‌బాక్స్

ఆలోచనలే స్ఫూర్తి

'రాజ్యాంగం ఎంత మంచిదైనా, దాన్ని అమలు చేసేవాళ్ళు మంచి వాళ్ళు కానట్లయితే, అది చెడ్డ ఫలితాలిస్తుంది. రాజ్యాంగం ఎంత చెడ్డదైనా దాన్ని అమలు చేసేవాళ్ళు మంచివాళ్లయితే, అది మంచి ఫలితాలు ఇస్తుంది' అని తన ఆలోచనలను అంబేడ్కర్ ఎంతో స్పష్టంగా దూరదృష్టితో తెలియచేశారు. ప్రజాస్వామ్యం పేరుకు మాత్రమే కాకుండా, ప్రస్తుత, భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా వాస్తవంగా కొనసాగడానికి మూడు పనులు చేయాలని 1949 నవంబర్ 25న ఇచ్చిన తన చిరస్మరణీయ ప్రసంగంలో కోరారు. మన సామాజిక, ఆర్థిక లక్ష్యాలను సాధించుకోవడానికి చేసే నిరసనలు, ప్రతిఘటనలు రాజ్యాంగబద్ధ పద్ధతుల్లోనే ఉండాలనీ, అరాచకాలకు తావివ్వవద్దనీ విజ్ఞప్తి చేశారు. ఒక వ్యక్తి ఎంత గొప్పవాడైనా ఆయన ముందు మన స్వేచ్ఛను పాదక్రాంతం చేయవద్దని హితవు పలికారు. కులం, మతం, ప్రాంతం వంటి విభేదాలను అధిగమించేలా, సామాజిక ప్రజాస్వామ్యాన్ని నిర్మించాలన్నారు.

'ఒక సమాజ పురోగతి ఆ సమాజంలో మహిళలకు ఇచ్చే ప్రాధాన్యతను బట్టి అంచనా వేయవచ్చు' అన్నారు అంబేడ్కర్. తదనుగుణంగా మహిళా సంక్షేమం గురించి అనేక పథకాలను అమలు చేస్తూ అనేక చట్టాలు వచ్చాయి. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ వచ్చి, రాజకీయ చైతన్యం కల్పించాయి. 'రాజ్యాంగంలో అన్నిటికంటే ప్రాముఖ్యత గల ప్రకరణ ఏది అని నన్ను అడిగినట్లు అయితే నేను ఒకే ఒక్క ప్రకరణను పేర్కొంటాను. అది మొత్తం రాజ్యాంగానికి ప్రాణం, ఆత్మ, హృదయం' అంటూ 32వ ప్రకరణ మీద తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు అంబేడ్కర్. ఈ వివరణ వల్ల దేశంలోని ప్రజలందరూ తమ ప్రాథమిక హక్కులను ఏ విధంగా పొందాలో, ఎలా వాటిని పరిరక్షించుకోవాలో తెలుసుకున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇచ్చేలా, ప్రతి ఒక్కరికి జీవనోపాధిని కల్పించేలా, అందరూ ఉచిత న్యాయం పొందేలా, నిరుద్యోగులు, వృద్ధులు, వికలాంగులకు జీవన భృతిని కల్పించేలా, ఇంకా ఎన్నో అంశాల్లో అంబేడ్కర్ ఆలోచనలు ఎంతగానో తోడ్పడ్డాయి.

– ఆర్. భాస్కర్ రెడ్డి, యాదాద్రి భువనగిరి

తెలుగు సాహిత్యంలో అంబేడ్కర్ శకం

విశ్లేషణ



డాక్టర్ శిఖామణి

అంబేడ్కర్ కోట్లాది భారతీయ దళితుల దాస్య విమోచకుడు మాత్రమే కాదు; భారతీయ దళిత సాహిత్యానికి ఆద్యుడు, ఆధ్యుడు కూడా. అంబేడ్కర్ తన గురుత్రయంగా ప్రకటించుకున్న గౌతమ బుద్ధుడు, సంత్ కబీర్, మహాత్మా జ్యోతిబా పూలేల తాత్విక ఆలోచనా విధానమే అటు అంబేడ్కరిజానికీ, ఇటు భారతీయ దళిత సాహిత్యానికీ సిద్ధాంత భూమిక అయింది.

తెలుగు దళిత సాహిత్యానికి అంబేడ్కర్ ఆంధ్రదేశ పర్యటన ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ గొప్ప ప్రేరణ ఇచ్చింది. నందనార్ హరిశ్చంద్రుడి పట్టువదలని పూనికతో అంబేడ్కర్ 1942 సెప్టెంబర్ 28న ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో అడుగుపెట్టారు. అప్పటికి దళిత నాయకులుగా ఉన్న ఈలి వాడపల్లి, పాము రామ్మూర్తి, కుసుమ ధర్మన్న, బొజ్జా అప్పలస్వామి వంటి వారు ఆ పర్యటనలో పాల్గొన్నారు.

అంబేడ్కర్ మరణించిన దశాబ్దాలకు గానీ ఆయన జీవితం, రచనలు చదివే అవకాశం తెలుగు దళితులకు దక్కలేదు. 1968లో మొదటిసారి యెండ్లూరి చిన్నయ్య రాసిన డా.అంబేడ్కర్ జీవిత చరిత్ర గ్రంథ రూపంలో వచ్చింది. ఆ కాలంలోనే అంబేడ్కర్ రచించిన 'ఇన్హిలేషన్ ఆఫ్ క్యాస్ట్' గ్రంథానికి యెండ్లూరి చిన్నయ్య, బోయి భీమన్నల అనువాదాలు వచ్చాయి. ఆ తర్వాత అంబేడ్కర్ జీవితచరిత్రను గ్రంథస్థం చేసినవారిలో బి.విజయభారతి, ఆమూల్యశ్రీ, బోయ జంగయ్య, పి.అబ్బాయి, ఉదయకీర్తి, బొనిగెల రామారావు, బూతం స్వామి వంటి వారున్నారు.

తెలుగునాట మొదటిసారిగా అంబేడ్కర్‌ను సాహిత్యంలో ప్రస్తావించిన ఘనత మహాకవి గుర్రం జాషువాకే దక్కుతుంది. 1947లో వెలువరించిన ఆయన కావ్యం గబ్బిలంలో 'కలడంబేడ్కరుడండు నా సహోదరుడు' పద్యంలో గబ్బిలాన్ని అంబేడ్కర్ దీవెనలు తీసుకోమంటారు. పద్యకావ్యాలు, శతకాలు, గేయాలు, వచన కవితలు, నాటకాలు, బుర్రకథలు, హరికథలు ఒకటేమిటి అన్ని ప్రక్రియల్లోనూ అంబేడ్కర్ ఆవిష్కరించబడ్డారు. బోయి భీమన్న 'నమస్సుల్, డాక్టరంబేడ్కరా?' మకుటంతో సుప్రభాతం, రాపాక ఏకాంబరం 'అంబేడ్కరో! సమరసింహో!', చోడగిరి చంద్రరావు 'భీమరాయ శతకం'



వెలువరించారు. దళిత ఉపాధ్యాయ కవులు మల్లవరపు జాను, జల్లి రాజగోపాలరావు, మల్లవరపు వెంకటరావు, బుంగా ఆదమ్‌బాబు, రాచమల్లు దేవయ్య, తోటకూర జార్జి, వలివెల సుదర్శనరావు, గుర్రం ధర్మోజి, నక్కా అమ్మయ్య, మద్దా సత్యనారాయణ వంటి వారు అంబేడ్కర్‌కు పద్యనీరాజనాలు పలికారు.

భీమన్న 'జయ జయ జయ అంబేడ్కర! జయ దళిత జనస్వర!' గేయం దళితుల జాతీయగీతంగా ప్రసిద్ధికెక్కింది. నీల్ సలామ్ కావ్యంలో 'వ్రాయుటబ్బిన నీ పేరె వ్రాయవలయు' అన్నారు కందిపాటి గోపాలరావు. మాష్టార్జీ గేయం 'అందుకో దండాలు బాబా అంబేడ్కరా! / అంబరాన ఉన్నట్టి సుక్కలు పొడవంగో' ఆల్‌టైమ్ రికార్డు. గోరటి వెంకన్న 'వైతాళికా! ఈ యుగము నీదిరా! బౌద్ధాళికా! ఈ జగము నీదిరా!' అని ఆలాపిస్తే, జయరాజు 'జాగోరే జాగో అంబేడ్కర్/ జగజ్జన నేత అంబేడ్కర్' అని తమ బతుకు ఆశగా వర్ణిస్తారు. పావన ప్రసాద్ 'దేశానికి రక్షణ కవచం / అంబేడ్కర్ తత్వం కాదా' అని ప్రశ్నిస్తే, బోయి భీమన్న 'పాటలలో అంబేడ్కరు' పేరుతో ప్రత్యేకంగా ఒక గ్రంథాన్నే ప్రచురించారు.

దళిత సామాజిక సాహిత్యోద్యమాలలో భాగంగా ఎందరో కవులు వేలాది గేయాలను ఆలపించారు. సవేరా, శ్రమశ్రీ, భీమసేన, రాంచందర్, శుక్తి, భీమసేన, లెల్లె సురేశ్, ఉదయ భాస్కర్, నాగబత్తుల గోపాలకృష్ణ వంటి కవులు పదుల సంఖ్యలో అంబేడ్కర్‌కు గేయ హారతి పట్టారు. నగేష్ బాబు, ఖాజా సంపాదకత్వంలో వెలువడిన 'పిడి ఆకాశం' కవితా సంకలనానికి 'అంబేడ్కరిస్టు ప్రేమ కవిత్వం' అని ఉపశీర్షిక పెట్టారు. 'అతడు జాతి బువ్వ, అతడు వెలుగుతొవ్వ, అతడు పాలబువ్వ, అతడు నివ్వురువ్వ' అని అంబేడ్కర్ ఏమిటో తెలియజేస్తాడు ఎండ్లూరి సుధాకర్. శిఖామణి అంబేడ్కర్ విగ్రహాన్ని 'శతాబ్దాలుగా ఘనీభవించిన దళితాగ్రహం'గా భావిస్తాడు. అంబేడ్కర్‌ను దళితుల అన్నంగిన్నెతో పోలుస్తారు నేతల ప్రతాప్ కుమార్. 'నీ పురుటి నొప్పులతో రాజ్యాంగాన్ని కాదు/ తరాల స్వప్నాల్ని ప్రసవించావు / నువ్వు మాకు తండ్రివా! తల్లివా' అని అంబేడ్కర్‌లో అమ్మతనాన్ని దర్శిస్తారు కలేకూరి ప్రసాద్. చల్లపల్లి స్వరూప రాణి 'ఇప్పుడు మనువు / అగ్రహారం వీడి / అంబేడ్కర్ కాలనీకొచ్చాడు / బాబా! నాకు పాలను నీళ్లను వేరు చేసే జ్ఞానాన్నివ్వ'మని వేడుకొంటారు. సతీష్ చందర్, తుల్లిమిల్లి విల్సన్ సుధాకర్, బన్న అయిలయ్య, జి.వి.రత్నాకర్, పైడి తెరేష్‌బాబు, విరియాల లక్ష్మీపతి, కొలకలూరి ఇనాక్... అంబేడ్కర్‌ను కవిత్వంలో ఆవిష్కరించారు.

అంబేడ్కర్ భావజాలంపై అనేక గ్రంథాలు వెలువడ్డాయి. కత్తి పద్మారావు అంబేడ్కర్ జీవిత చరిత్ర పేరుతో బృహత్ గ్రంథాన్ని వెలువరించారు. కె.జి. సత్యమూర్తి 'అంబేడ్కర్ సూర్యుడు' రాశారు. అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్టు మూడు దశాబ్దాలకు పైగా అంబేడ్కర్ వర్ధంతి అయిన డిసెంబరు 6న స్మారకోపన్యాసాలు ఏర్పాటుచేసి, వాటిని గ్రంథరూపంలో తెస్తోంది. హైదరాబాద్ బుక్ ట్రస్టు వంటి సంస్థలు అంబేడ్కర్ భావజాలాన్ని అనువాదాల రూపంలో తెలుగులో అందించడం అభినందనీయం. అంబేడ్కర్ జీవిత చరిత్రను తెలుగులో చలనచిత్రంగా రూపొందించిన డాక్టర్ పద్మావతి దళితులకు గొప్ప ఉపకారం చేశారు. ఆ సినిమాకు సి.నారాయణరెడ్డి అంబేడ్కర్ జీవితాన్ని ప్రతిఫలించే భావస్ఫోరకమైన గీతాల్ని అందించారు. సాదా ఆరుణల 'జాతిపిత అంబేడ్కర్', పాటిబండ్ల ఆనందరావు 'రాజగృహ ప్రవేశం' నాటకాలు రంగస్థలం మీద అటు ప్రయోగానికీ, ఇటు ప్రయోజనానికీ పెద్దపీట వేశాయి. జయభేరి, ప్రజాబంధు, రిపబ్లికన్ జ్యోతి, గబ్బిలం, ఏకలవ్య, నీలిజెండా, బహుజన కెరటాలు, దళిత కిరణాలు, సమాంతర వంటి దళిత పత్రికలు అవి బతికినంతకాలం అంబేడ్కర్ భావజాలాన్ని ప్రచారం చేశాయి. ఈ వ్యాసకర్త 15 సంవత్సరాల క్రితమే 'అంబేడ్కర్ శకం' పేరుతో సేకరించి సంకలించిన దాదాపు 500 పుటల అంబేడ్కర్ పద్య, గేయ, వచన కవితా సంపుటి అముద్రితంగా ఉండిపోయింది. ఒక్కో ప్రక్రియలో ఇలాంటి ఒక్కో బృహత్తర సంపుటి రావలసిన అవసరం ఉంది.

వ్యాసకర్త కవి, 'కవిసంధ్య' సంపాదకుడు
మొబైల్: 98482 02526

యాదాద్రీశునికి బంగారు కిరీటాలు





ఈవో గీతారెడ్డికి బంగారు కిరీటాలు, వెండి పళ్లెం అందజేస్తున్న దాత ప్రకాశ్ ముదిరాజ్

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలోని ముఖ మండపంలో సువర్ణ మూర్తులకు కొత్త శోభ చేకూరింది. హైదరాబాద్‌లోని చంపాపేట్‌కు చెందిన వి.ప్రకాశ్ ముదిరాజ్ కుటుంబ సభ్యులు రూ.30 లక్షలు విలువ చేసే 429 గ్రాముల బంగారంతో తయారు చేయించిన 3 కిరీటాలు, 520 గ్రాముల వెండి పళ్లేన్ని బహూకరించారు. వీటిని గురువారం ఆలయ ఈవో గీతారెడ్డికి అందించగా, సువర్ణ మూర్తులకు అలంకరించారు.

పోలీస్ కస్టడీకి 'టెన్త్ లీక్' నిందితుడు

వరంగల్ లీగల్: పదవ తరగతి హిందీ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో నిందితుడైన పి.వర్షిత్‌ను 2రోజుల పోలీస్ కస్టడీకి అనుమతి ఇస్తూ హనుమకొండ 4వ మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి మట్ట సరిత గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసులో నిందితుడి తరఫున దాఖలైన బెయిల్ పిటిషన్ పెండింగ్‌లో ఉంది. దీంతో పది మంది నిందితులైన ఈ కేసులో ఇప్పటివరకు ఒకరిని జువైనల్‌హోంకు తరలించగా, 8 మందిని అరెస్ట్ చేశారు. వారిలో నలుగురు నిందితులైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడైన బండి సంజయ్, ప్రశాంత్, మహేశ్, శివగణేష్‌లు బెయిల్‌పై విడుదల కాగా, ఒకరు పోలీస్ కస్టడీ, మరో ముగ్గురు నిందితులు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు.

ప్రేమ వ్యామోహంలో బాలుడి ఆత్మహత్య

అశ్వారావుపేట రూరల్: ఇద్దరూ మైనర్లే.. ప్రేమ పేరిట వ్యామోహంలో పడ్డారు. మేజర్లు అయ్యాక పెళ్లి చేస్తామని పెద్దలు చెప్పినా అనుమానంతో ఆ బాలుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి గ్రామానికి చెందిన సరిహద్దు వెంకన్నబాబు(17) అదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన తొమ్మిదో తరగతి చదివే 14 ఏళ్ల బాలికను ప్రేమించాడు. వీరిద్దరూ కలిసి ఈనెల 9న ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. రెండు రోజులపాటు సూర్యాపేట, హైదరాబాద్ ప్రాంతాల్లో తిరిగి బుధవారం అశ్వారావుపేట మండలంలోని నారంవారిగూడెంలో ఉన్న బంధువుల ఇంటికి వచ్చారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు ఇద్దరికీ నచ్చజెప్పారు. ఒకే సామాజికవర్గం కావడంతో మేజర్లు అయిన తర్వాత పెళ్లి చేస్తామని చెప్పారు. అయితే తాను ప్రేమించిన బాలికతో పెళ్లి కాదేమోనని ఆందోళనకు గురైన బాలుడు గురువారం ఇంట్లో కుటుంబీకులు లేని సమయాన ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.రాజేశ్‌కుమార్ తెలిపారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన పెంచాలి

- వారోత్సవాల పోస్టర్ విడుదలలో హోం మంత్రి

సాక్షి, హైదరాబాద్: అగ్నిప్రమాదాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్‌అలీ అధికారులకు సూచించారు. అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి వారం పాటు నిర్వహించనున్న అవగాహన కార్యక్రమాల పోస్టర్లను హోం మంత్రి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ డీజీ వై.నాగిరెడ్డి, అగ్నిమాపకశాఖ డైరెక్టర్ పి.లక్ష్మీ ప్రసాద్, అడిషనల్ డైరెక్టర్ వెంకట నారాయణరావు, తెలంగాణ ఫైర్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ ప్రసన్నకుమార్, రీజనల్ ఫైర్ ఆఫీసర్ వి.పాపయ్య పాల్గొన్నారు.

నివారణ చర్యలపై సీఎస్ సమీక్ష

అగ్నిమాపక భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వ్యూహం రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. అగ్ని ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన పలు భద్రతా చర్యలపై గురువారం బీఆర్‌కేఆర్ భవన్ లో సమీక్ష నిర్వహించారు. అన్ని షాపింగ్ కాంప్లెక్స్‌లు, మల్టీప్లెక్స్‌లు, ఆసుపత్రులు, ఇతర వాణిజ్య సంస్థలను సకాలంలో తనిఖీలు నిర్వహించాలని స్పష్టం చేశారు. వాటి ప్రాంగణాల్లో అగ్నిమాపక భద్రతా పరికరాలను ఏర్పాటు చేసేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని జీహెచ్‌ఎంసీ, అగ్నిమాపక శాఖ అధికారులను సీఎస్ ఆదేశించారు. సమావేశంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్, మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి పాల్గొన్నారు.

విషాదంలోనే మూడు గ్రామాలు

- చీమలపాడు పేలుడులో మృతి చెందిన ముగ్గురి అంత్యక్రియలు పూర్తి
- బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్సీ మధు, ఎమ్మెల్యే రాములు నాయక్
- కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరిని అడ్డుకున్న పోలీసులు

కారేపల్లి: చీమలపాడు సిలిండర్ పేలుడు ఘటన విషాదం ఇంకా వీడలేదు. ప్రమాదంలో కన్నుమూసిన ముగ్గురి అంత్యక్రియలు గురువారం పూర్తయ్యాయి. నిన్నటి వరకు తమతో గడిపినవారు ఇక లేరనే విషయాన్ని తట్టుకోలేక కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు అందరినీ కంటతడి పెట్టించాయి. ఖమ్మం జిల్లా చీమలపాడులో బుధవారం బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా కార్యకర్తలు పేల్చిన బాణసంచాతో గుడిసెకు నిప్పంటుకుని, అందులోని సిలిండర్ పేలి ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. మృతదేహాలకు బుధవారం రాత్రే పోస్టుమార్టం పూర్తిచేసి స్వగ్రామాలకు తరలించారు. గురువారం ఉదయం చీమలపాడులో అజ్మీరా మంగు, స్టేషన్ చీమలపాడులో బానోతు రమేశ్, గేటురేలకాయలపల్లిలో ధరంసోత్ లక్ష్మాల మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు, వైరా ఎమ్మెల్యే రాములునాయక్, మరికొందరు నేతలు మూడు గ్రామాలకు వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఎమ్మెల్యే రాములునాయక్.. మృతుల కుటుంబాలకు రూ.2లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.



బానోతు లక్ష్మా అంతిమ యాత్రలో పెద్ద కుమార్తె సరస్వతి

ప్రమాదంపై పోలీసుల ఆరా..

చీమలపాడు ఘటనకు సంబంధించి పోలీసులు గురువారం దర్యాప్తు చేపట్టారు. గుడిసెకు నిప్పంటుకోవడం, సిలిండర్ పేలడంపై ఆరా తీశారు. ఆధారాలు చెరిగిపోకుండా.. గుడిసెతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలను సీజ్ చేసి పరిశీలించారు. ఈ ఘటనకు నిరసనగా ప్రతిపక్షాలు గురువారం కారేపల్లి బంద్ చేపట్టాయి. బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు చీమలపాడుకు వస్తున్న కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరిని పోలీసులు కామేపల్లిలోనే అడ్డుకున్నారు. కాంగ్రెస్ నేతలు అక్కడికి చేరుకుని ఆందోళనకు దిగడంతో ఇల్లెందు-ఖమ్మం రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. తర్వాత రేణుకా చౌదరి పోలీసుల కళ్లుగప్పి.. ఇల్లెందు మీదుగా గేటురేలకాయలపల్లికి చేరుకుని ధరంసోత్ లక్ష్మా కుటుంబాన్ని పరామర్శించారు. ప్రమాదానికి కారణమైన ఎమ్మెల్యే రాములునాయక్, ఎంపీ నామా నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కాగా.. కామేపల్లి ఘటనకు సంబంధించి రేణుకా చౌదరి, మరికొందరు నేతలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

తలకొరివి పెట్టిన తనయ

చీమలపాడులో మృతిచెందిన బానోతు లక్ష్మాకు భార్య సరోజ, నలుగురు కుమార్తెలు ఉన్నారు. తండ్రి మృతదేహాన్ని చూసి తట్టుకోలేక వారు చేసిన రోదనలు అందరినీ కన్నీళ్లు పెట్టించాయి. లక్ష్మాకు ఆయన పెద్ద కుమార్తె సరస్వతి తలకొరివి పెట్టింది.



పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రేణుకాచౌదరి

పార్టీ, ప్రభుత్వపరంగా అండగా ఉంటాం

- నిమ్స్‌లో చీమలపాడు క్షతగాత్రులకు మంత్రులు కేటీఆర్, పువ్వాడ భరోసా
- మరింత మెరుగైన వైద్యం అందించాలని నిమ్స్ డైరెక్టర్‌కు ఆదేశం



నిమ్స్‌లో బాధితుడిని పరామర్శిస్తున్న కేటీఆర్, పువ్వాడ అజయ్, నామా, వద్దిరాజు

లక్డీకాపూల్: ఖమ్మం జిల్లా చీమలపాడు అగ్నిప్రమాద ఘటన క్షతగాత్రులకు ప్రభుత్వం, పార్టీ తరఫున పూర్తిస్థాయిలో అండగా ఉంటామని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కె. తారక రామారావు భరోసా ఇచ్చారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఐదుగురు క్షతగాత్రులను గురువారం బీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రలతో కలిసి కేటీఆర్ పరామర్శించారు. క్షతగాత్రులకు అందుతున్న చికిత్స గురించి నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, ఓఎస్డీ గంగాధర్‌లను అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాధితులకు అండగా ఉండాలనే సీఎం కేసీఆర్ తమను పంపారని వారి కుటుంబాలకు చెప్పారు. మృతుల కుటుంబ సభ్యులకు రూ. 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందిస్తామన్నా రు. అలాగే క్షతగాత్రుల జీవనోపాధి దెబ్బతినకుండా అన్ని చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ క్షతగాత్రుల పరిస్థితి ప్రస్తుతానికి నిలకడగానే ఉందన్నారు. ఐదుగురిలో ఇద్దరికి సర్జరీ జరుగుతోందన్నారు.

క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమం...

నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఐదుగురిలో మహారాష్ట్ర చంద్రాపూర్‌కు చెందిన సందీప్‌కు వెంటిలేటర్ ద్వారా వైద్యం అందుతోంది. ప్రస్తుతం అతని ఆరోగ్యం విషమంగా ఉంది. పేలుడు ఘటనలో అతని ఉదరభాగం మొద్దుబారిపోయింది. చాలా క్లిష్టమైన స్థితిలో అతని ఆరోగ్య పరిస్థితి ఉంది. అతనితోపాటు తేజావత్ భాస్కర్‌కు న్యూ ఆర్‌ఐసీసీలో చికిత్స అందిస్తున్నారు. అతని ఎడమ చేయి, మోకాలికి తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ఈఎండీలో చికిత్స పొందుతున్న అగ్నోత్ రవి కుమార్, కె. శ్రీనివాసరావు, నరతి వెంకన్నలకు కాళ్లు, చేతులు, కళ్లు దెబ్బతిన్నాయి.

లీకేజీ కేసులో ఈడీ స్పీడు

- టీఎస్‌పీఎస్సీ అధికారి శంకరలక్ష్మి, సత్యనారాయణలను ప్రశ్నించిన ఈడీ అధికారులు



శంకరలక్ష్మి

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) స్పీడ్ పెంచింది. పేపర్ లీకేజీలో హవాలా లావాదేవీలకు అవకాశం ఉన్నందున వీటిపై దర్యాప్తు చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మరికొందరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఈడీ అధికారులు ఆ కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసులో కీలకమైన టీఎస్‌పీఎస్సీ కాన్ఫిడెన్షియల్ సెక్షన్ అధికారి శంకరలక్ష్మితోపాటు టీఎస్‌పీఎస్సీ తరఫున ఈ కేసులో ఫిర్యాదుదారు సత్యనారాయణలను గురువారం ఈడీ అధికారులు 10 గంటలపాటు విచారించినట్టు సమాచారం. శంకర లక్ష్మిని ఈ కేసులో కేవలం సాక్షిగానే సిట్ పేర్కొనగా.. ఇప్పుడు ఈడీ మాత్రం శంకర్ లక్ష్మి నుంచే దర్యాప్తు ప్రారంభించడం ఈ కేసు విచారణపర్వంలో కొత్త కోణంగా చెప్పవచ్చు. మొత్తం పేపర్ల లీకేజీ కుట్రకు శంకర్‌లక్ష్మి కంప్యూటర్ నుంచే మూలాలు ఉండడంతో తొలుత ఆమెను ఈడీ అధికారులు విచారించినట్టు సమాచారం. ప్రధా నంగా ఈ కేసులో కీలక నిందితులైన ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డిల గురించి ఆరా తీసినట్టు తెలిసింది. కాగా, టీఎస్‌పీఎస్సీకి సంబంధించి ఈడీ అధికారులు కొన్ని ప్రశ్నలు అడిగారని విచారణానంతరం శంకరలక్ష్మి మీడియా ప్రతినిధులకు తెలిపారు. తన ఆధార్, పాన్ వివరాలు తీసుకున్నారని, అవసరమైతే మళ్లీ విచారణకు పిలుస్తామన్నారని ఆమె చెప్పారు.

మీ సిస్టంలోకి వాళ్లు యాక్సెస్ ఎలా అయ్యారు?


శంకర్‌లక్ష్మికి ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డిలతో ఉన్న పరిచయం, ఆఫీస్‌లో వారి ప్రవర్తన, కాన్ఫిడెన్షియల్ సెక్షన్‌లో వారు వచ్చేవారా..? డబ్బు లావాదేవీల గురించి మీతో ఎప్పుడైనా చర్చించే వారా..? మీ కంప్యూటర్‌లోకి యా క్సెస్ ఎలా అవుతారు..? ఈ కంప్యూటర్ పాస్‌వర్డ్‌లు ఇంకా ఎవరికైనా తెలిసే అవకాశం ఉందా?..మీ కంప్యూటర్ పరిసరా ల్లో సీసీటీవీ కెమెరాలు ఏమైనా ఉంటాయా?.. అన్న అంశాలపై నా ప్రశ్నించినట్టు తెలిసింది. టీఎస్‌పీఎస్సీ అధికారి సత్యనారాయ ణ నుంచి సైతం కీలక వివరాలు సేకరించినట్టు తెలిసింది. పేపర్ లీకేజీ వ్యవహారం టీఎస్‌పీఎస్సీ దృష్టికి ఎలా వచ్చింది? ఏయే పేపర్లు లీకై నట్టు గుర్తించారు..? ఉద్యోగుల పాత్రపై అంతర్గతంగా ఏ చర్యలు తీసుకున్నారు? ఇలాంటి వివరాలు సేకరించినట్టు తెలిసింది. వీటిని ఆధారంగా చేసుకుని ఈడీ అధికారులు దర్యాప్తును కొనసాగించనున్నట్టు తెలుస్తోంది. సిట్ అధికారులను వివరాలు ఇవ్వాలని ఈడీ అధికారులు కోరినా స్పందన లేకపోవడంతో కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. గురువారం విచారణకు హాజరైన శంకర్‌లక్ష్మి, సత్యనారాయణలను అవసరం మేరకు మరోమారు పిలుస్తామని ఈడీ అధికారులు స్పష్టం చేసినట్టు తెలుస్తోంది.

ప్రవీణ్, రాజశేఖర్‌ల ఈడీ కస్టడీపై తీర్పు రిజర్వ్

పేపర్ల లీకేజీలో నిందితులు ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డిల కస్టడీ కోరుతూ నాంపల్లి కోర్టులో ఈడీ అధికారులు పిటిషన్ వేశారు. గురువారం దీనిపై వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేయాల్సి ఉందని, ఈ కేసులో సిట్ వివరాలు ఇవ్వడం లేదని ఈడీ కోర్టుకు తెలిపింది. 8 డాక్యుమెంట్లు కావాలని, కేసు వివరాలు ఇచ్చేలా సిట్‌ను ఆదేశించాలని ఈడీ కోరింది. అయితే కేసు కీలక దశలో ఉన్నందున వివరాలు ఇవ్వడం కుదరదని సిట్ న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు తీర్పును రిజర్వ్ చేసినట్టు తెలిసింది.

విజయవాడ రూట్లో 10% రాయితీ

- సూపర్ లగ్జరీ, రాజధాని సర్వీసుల్లో అమలు: టీఎస్ ఆర్టీసీ ప్రకటన
- ఈ నెల 30 వరకు ఆఫర్ కొనసాగింపు




సజ్జనార్

హైదరాబాద్: హైదరాబాద్ - విజయవాడ మార్గంలో నడిచే సూపర్ లగ్జరీ, రాజధాని బస్సు ల్లో టికెట్ చార్జీలపై 10 శాతం రాయితీ ఇస్తున్నట్టు టీఎస్ ఆర్టీసీ ప్రకటించింది. రాను, పోను టికెట్లన్నింటిపై ఇది వర్తిస్తుందని, ఈ నెల 30వ తేదీ వరకు దీనిని కొనసాగిస్తామని ఎండీ సజ్జనార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం విజయవాడ వరకే వెళ్లే బస్సులతోపాటు ఆ మార్గంలో నడిచే ఇతర సర్వీసులకూ వర్తిస్తుందని వెల్లడించారు. ఒక ప్రయాణికుడు రాజధాని ఏసీ సర్వీస్‌లో హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లాలనుకుంటే.. అతడి టికెట్‌లో విజయవాడ వరకు 10శాతం రాయితీ లభిస్తుందన్నారు. రాయితీతో ఒక్కో ప్రయాణికుడికి రూ.40 నుంచి రూ.50 వరకు ఆదా అవుతుందని.. ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ముందస్తు రిజర్వేషన్ చేసుకునే ప్రయాణికులకు సైతం టీఎస్ ఆర్టీసీ రాయితీ కల్పిస్తోందని తెలిపారు. రోజుల నుంచి 44 రోజుల ముందు అడ్వాన్స్ బుకింగ్ చేసుకుంటే 5 శాతం.. 45 నుంచి 60 రోజుల ముందు రిజర్వేషన్ చేసుకుంటే 10 శాతం రాయితీ లభిస్తుందని వివరించారు.

వ్యాక్సిన్ వికటించి పసికందు మృతి?

సైదాబాద్: బస్తీ దవాఖానాలో ఇప్పించిన వ్యాక్సిన్ వికటించడంతో పసికందు మృతి చెందాడని, వైద్య సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతుడి తల్లిదండ్రులు చెప్పిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం బాలునాయక్ తండాకు చెందిన లచ్చీరాం, మౌనిక దంపతులు జీవనోపాధి కోసం ఏడాది క్రితం నగరానికి వచ్చి ఐఎస్ సదన్ డివిజన్ ఖాజాబాగ్‌లో ఉంటున్నారు. లచ్చీరాం స్థానికంగా ఉన్న ఓ కాలేజీలో స్వీపర్‌గా పని చేస్తున్నాడు. మౌనిక ఇంటి వద్దే ఉంటోంది. 52 రోజుల క్రితం మౌనిక తొలి కాన్పులో బాబుకు జన్మనిచ్చింది. బాలుడికి జస్వంత్ అని పేరు పెట్టుకున్నారు. ఈ క్రమంలో బుధవారం బాలుడికి సుబ్రమణ్యనగర్‌లోని బస్తీ దవాఖానాలో మౌనిక వ్యాక్సిన్ ఇప్పించింది. సాయంత్రమయ్యే సరికి చిన్నారి అస్వస్థతకు గురయ్యాడు. విపరీతమైన జ్వరం, రక్త విరేచనాలతో అదే రోజు రాత్రి మృతి చెందాడు.

జాతీయ విద్యావిధానం వల్ల నష్టమే: టీఎస్ యూటీఎఫ్



సాక్షి, హైదరాబాద్: జాతీయ విద్యావిధానం పేరిట పాఠ్యపుస్తకాల్లోని చరిత్ర పాఠ్యాంశాల తొలగింపు, తరగతి గదుల్లో ఉపాధ్యాయులు నిలబడే బోధించాలనే నిబంధనలు విద్యారంగం విధ్వంసానికి దారితీస్తాయని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధానకార్యదర్శులు కె.జంగయ్య, చావ రవి అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) పదో ఆవిర్భావ దినోత్సవం గురువారం రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా జరిగింది. జంగయ్య మాట్లాడుతూ కాషాయీకరణల దిశగా సాగుతున్న జాతీయ విద్యావిధానం- 2020ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల్లోని 'మహాత్మాగాంధీ హత్య', 'గుజరాత్ అల్లర్లు'వంటి పాఠ్యాంశాలను తొలగించటం చరిత్రను మరుగుపరచటానికేనని విమర్శించారు. చావ రవి మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలని ఉద్యమాలు చేస్తుంటే, కేంద్రం దానిపై నిపుణుల కమిటీని ఏర్పాటు చేయటం ఉద్యోగులను మభ్యపెట్టటమేనని అన్నారు.

పాలమూరు-రంగారెడ్డి డీపీఆర్ వెనక్కి

- డీపీఆర్‌ను మదింపు చేయలేము, ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వలేమన్న సీడబ్ల్యూసీ
- తెలంగాణ ప్రభుత్వానికి లేఖ
- నీటి కేటాయింపులపై స్పష్టత లేనందుకేనని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను మదింపు చేయలేమని, ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వలేమని తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) తేల్చిచెప్పింది. డీపీఆర్‌ను వెనక్కి పంపింది. ఈ మేరకు గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా సీఈ (ప్రాజెక్ట్స్)కి సీడబ్ల్యూసీ డైరెక్టర్ నిత్యానంద ముఖర్జీ లేఖ రాశారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి రోజుకు 1.5 టీఎంసీల చొప్పున 60 రోజుల్లో 90 టీఎంసీలను తరలించేందుకు తెలంగాణ ప్రభుత్వం పాలమూరు ఎత్తిపోతలను చేపట్టింది. చిన్న నీటిపారుదల విభాగంలో మిగులుగా ఉన్న 45 టీఎంసీలు, కృష్ణా డెల్టాకు మళ్లించే గోదావరి జలాలకు గానూ కృష్ణా జలాల్లో అదనంగా 45 టీఎంసీల వాటా తమకే దక్కుతుందని పేర్కొంటూ 90 టీఎంసీలను ఆ ఎత్తిపోతలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వాలని సీడబ్ల్యూసీకి డీపీఆర్‌ను సమర్పించింది. దీనిపై సీడబ్ల్యూసీ.. అభ్యంతరాలను లేవనెత్తింది.

ఆ 45 టీఎంసీలపై ఉభయ రాష్ట్రాలకూ హక్కు

కృష్ణా డెల్టాకు మళ్లించే 80 టీఎంసీల గోదావరి జలాలకు గానూ నాగార్జునసాగర్‌కు ఎగువన కృష్ణా నదిలో 45 టీఎంసీలను అదనంగా వాడుకునే వెసులుబాటును ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు గోదావరి ట్రిబ్యునల్ ఇచ్చిందని తెలిపింది. అయితే విభజన నేపథ్యంలో ఆ 45 టీఎంసీలపై రెండు రాష్ట్రాలకు హక్కు ఉంటుందని పేర్కొంది. ఈ జలాల పంపిణీ అంశాన్ని బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ-2) దృష్టికి ఏపీ ప్రభుత్వం తీసుకెళ్లిందని, ట్రిబ్యునల్ దీనిపై విచారణ జరుపుతోందని పేర్కొంది. ఆ 45 టీఎంసీల వినియోగంపై ఏపీ తెలంగాణల మధ్య ఒప్పందం కూడా జరగకపోవడాన్ని ఎత్తిచూపుతూ.. తెలంగాణ నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, ఈఎన్‌సీ మురళీధర్‌లకు లేఖలు రాసినా.. వారి నుంచి స్పష్టమైన సమాధానాలు రాలేదని తెలిపింది. నీటి కేటాయింపులపై స్పష్టత లేని నేపథ్యంలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల డీపీఆర్‌ను మదింపు చేయలేమని సీడబ్ల్యూసీ స్పష్టం చేసింది.

రాయలసీమ లిఫ్టుకీ అనుమతులు ఇవ్వలేదు..

శ్రీశైలం ప్రాజెక్టు పరిధిలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో మొత్తం 8 ప్రాజెక్టులు ఉండగా, అందులో శ్రీశైలం కుడి గట్టు కాలువ, తెలుగుగంగ ద్వారా చెన్నైకి 15 టీఎంసీల తాగునీటి సరఫరాకి మాత్రమే నీటి కేటాయింపులు జరిగాయని సీడబ్ల్యూసీ స్పష్టం చేసింది. రాయలసీమ ఎత్తిపోతల పథకానికి అనుమతుల కోసం ఏపీ దరఖాస్తు చేసుకోగా, ఆ ప్రాజెక్టుకు ఎలాంటి నీటి కేటాయింపులు లేకపోవడంతో పాటు ఏపీ, తెలంగాణ మధ్య ఒప్పందం జరగకపోవడంతో ఆ ప్రాజెక్టుకూ అనుమతులు జారీ చేయలేమని స్పష్టం చేసినట్లు సీడబ్ల్యూసీ వెల్లడించింది.

ఎందుకు సాధ్యం కాదంటే ..?

కేంద్ర జల శక్తి శాఖ 2006 జనవరి 16న జారీ చేసిన ఆదేశాల ప్రకారం.. అంతర్రాష్ట్ర జల కేటాయింపులకు సంబంధించిన అంశాల పరిశీలన కోసం తొలిసారిగా ట్రిబ్యునల్ ఏర్పాటైన సందర్భంలో ట్రిబ్యునల్ సమ్మతి లేకుండా సదరు బేసిన్‌లో నిర్మించే ప్రాజెక్టులకు టెక్నో ఎకనామిక్ అనుమతులు జారీ చేయరాదని సీడబ్ల్యూసీ గుర్తు చేసింది. ఒకవేళ బేసిన్ పరిధిలోని రాష్ట్రాల మధ్య ఒప్పందం జరిగిన పక్షంలో ట్రిబ్యునల్‌కు సమాచారం ఇచ్చి, ఆయా ప్రాజెక్టులకు టెక్నో ఎకనామిక్ అనుమతులు, ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ జారీ చేయవచ్చని స్పష్టం చేసింది. ప్రాజెక్టుల వారీగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు నీటి కేటాయింపుల అంశాన్ని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తొలిసారిగా చేపట్టిన నేపథ్యంలో అనుమతులు ఇవ్వడం సాధ్యం కాదని తేల్చిచెప్పింది.

అభినవ అంబేడ్కర్ కేసీఆర్: శ్రీనివాస్ గుప్త

సాక్షి, హైదరాబాద్: అభినవ అంబేడ్కర్‌గా ముఖ్యమంత్రి కేసీఆర్ మారారని రాష్ట్ర టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ (టీఎస్ టీడీసీ) మాజీ చైర్మన్, ఉప్పల శ్రీనివాస్ గుప్త అభివర్ణించారు. నేడు డా.బీఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ట్యాంక్ బండ్ దగ్గర 125 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహం ప్రారంభోత్సవం కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఒకవైపు, దేశానికే తలమానికమైన అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయం మరోవైపు, అమరవీరుల స్మారక జ్యోతి ఇంకోవైపు ఏర్పాటు చేసిన కేసీఆర్ దృక్పథానికి జనం జేజేలు పలుకుతున్నారని పొగడ్తలతో ఆయన ముంచెత్తారు.

ఎయిర్‌పోర్ట్‌లో రోబోటిక్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని జీఎమ్మార్ ఇన్నోవెక్స్ విస్తరణలో భాగంగా గురువారం రోబోటిక్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఐటీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్ డైరెక్టర్ రమాదేవి లంక, జీఎమ్మార్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌జీకే కిషోర్, సీఈవో హరి ఫణికర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా రోబోటిక్స్ సాంకేతికత మునుపెన్నడూ లేని విధంగా వివిధ రంగాలకు చెందిన పరిశ్రమలను విశేషంగా ఆకర్షిస్తోందన్నారు. రోబోటిక్స్, ఆటోమేషన్ స్పేస్‌లో పనిచేస్తున్న స్టార్టప్‌లు, ఇండస్ట్రీ ప్లేయర్‌లకు వేదికను అందించడం ద్వారా సాంకేతికతను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ఈ దిశగా మరిన్ని పెట్టుబడులను, నైపుణ్యాలను, ఆవిష్కరణలను ఆకర్షించాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు.

16న పశువైద్య విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని పీవీ నరసింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయం 4వ స్నాతకోత్సవం ఈ నెల 16న ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు పశువైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ వి.రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్, విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్, రాజస్తాన్ యూనివర్సిటీ ఆఫ్ వెటర్నరీ అండ్ యానిమల్ సైన్సెస్ ఉపకులపతి ప్రొఫెసర్ సతీష్‌కుమార్ విద్యార్థులకు పట్టాలు అందజేస్తారని వివరించారు. సమావేశంలో రిజిస్ట్రార్ ఎస్‌టీ వీరోజీరావు, డీన్ రఘునందన్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ గోపాల్‌రెడ్డి, ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కర్ణాటకలో అన్నదమ్ముల సవాల్

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో అన్నదమ్ముల మధ్య సవాల్ ఆసక్తిని రేపుతోంది. కర్ణాటక దివంగత ముఖ్యమంత్రి ఎస్. బంగారప్ప కుమారులిద్దరూ మరోసారి పోటీపడుతున్నారు. శివమొగ్గ జిల్లాలోని సొరబ నియోజకవర్గం నుంచి కుమార్ బంగారప్ప బీజేపీ నుంచి, మధు బంగారప్ప కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. బంగారప్ప 1967 నుంచి 1994 వరకు సొరబ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. చిట్టచివరి సారిగా ఆయన ఎంపీగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం సొరబ సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన కుమార్ బంగారప్ప మరోసారి ఎన్నిక కావాలని తహతహలాడుతున్నారు. 2018 ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌కు గుడ్ బై కొట్టిన బీజేపీలో చేరిన కుమార్, అప్పటికే జేడీ(ఎస్) సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన మధుపై 3,286 ఓట్ల తేడాతో నెగ్గారు. 2021లో కాంగ్రెస్‌లో చేరిన మధు బంగారప్ప మరోసారి అదే నియోజకవర్గం బరిలో దిగడంతో అన్నదమ్ముల మధ్య పోరు ఉత్కంఠకు దారి తీస్తోంది.

ఒక్క రోజులో 10వేలకుపైగా..

న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్ మళ్లీ విజృంభిస్తోంది. 24 గంటల వ్యవధిలో కొత్తగా 10,158 కేసులు నమోదయ్యాయి. ఎనిమిది నెలల తర్వాత ఇదే అత్యధికమని కేంద్ర ఆరోగ్య శాఖ గురువారం తెలిపింది. యాక్టివ్ కేసులు 44,998కి పెరిగినట్లు వెల్లడించింది. అదేసమయంలో, ఒక్క రోజు వ్యవధిలోనే మరో 19 మంది బాధితులు చనిపోవడంతో మొత్తం కోవిడ్ మరణాలు 5,31,035కు చేరాయంది.

బీబీసీపై ఈడీ కేసు

న్యూఢిల్లీ: బీబీసీ ఇండియాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసు నమోదు చేసింది. విదేశీ నిధుల్ని పొందినప్పుడు ఫెమా నిబంధనల్ని ఉల్లంఘించినట్లుగా ఈడీ ఆరోపించింది. బీబీసీ కార్యాలయంలో ఆదాయ పన్ను శాఖ సర్వే నిర్వహించిన రెండు నెలల తర్వాత ఈ కేసు నమోదైంది. బీబీసీకి ప్రవాసుల నుంచి అందుతున్న నిధులపై బీబీసీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. వీటికి సంబంధించిన లావాదేవీలన్నింటినీ సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. ఫారెన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ (ఎఫ్‌డీఐ) కింద కేసుని విచారించాల్సిన అవసరం ఉందని ఈడీ అధికారులు చెప్పారు. ఫారెన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఫెమా) కింద ఆర్థిక లావాదేవీలన్నీ సమర్పించాలని ఆదేశించినట్టుగా వెల్లడించారు. బీబీసీలో కొందరు ఉద్యోగుల్ని ప్రశ్నించారు. బీబీసీ డిప్యూటీ మేనేజింగ్ ఎడిటర్ గురువారం ఈడీ అధికారుల ఎదుట హాజరయ్యారు. గుజరాత్ మత ఘర్షణల్లో ప్రధాని మోదీని దోషిగా ఆరోపిస్తూ 'ఇండియా ది మోదీ క్వశ్చన్' పేరుతో బీబీసీ డాక్యుమెంటరీని ప్రసారం చేసిన కొద్ది రోజులకే ఆ సంస్థలో ఆదాయపన్ను శాఖ సర్వే నిర్వహించడం రాజకీయ దుమారానికి దారి తీసింది.

అత్యంత కరడుగట్టిన నేరగాడు అతీక్ అహ్మద్

- కిడ్నాప్‌లు, బెదిరింపులు, వసూళ్లతో ప్రస్థానం ఆరంభం
- బినామీ కాంట్రాక్టులు, వ్యాపారాలతో రూ. వందల కోట్ల ఆర్థిక సామ్రాజ్యం
- మాఫియా–బాహుబలిగా అలహాబాద్‌లో సమాంతర పాలన
- ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా ఎన్నిక
- కుమారుడు అసద్ అహ్మద్ ఎన్‌కౌంటర్‌తో మళ్లీ తెరపైకి అతీక్ పేరు

మాఫియా డాన్, గ్యాంగ్ లీడర్, హిస్టరీ షీటర్, రౌడీ షీటర్, మాఫియా–బాహుబలి, దబాంగ్, పొలిటికల్ లీడర్.. ఇవన్నీ ఒకే వ్యక్తికి పర్యాయ పదాలు. ఆ ఒక్కడే అతీక్ అహ్మద్. ఉత్తరప్రదేశ్‌లో అసద్ అహ్మద్ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో అతడి తండ్రి అతీక్ అహ్మద్ పేరు మళ్లీ ప్రముఖంగా చర్చల్లోకి వచ్చింది. నిరుపేద టాంగావాలా కుమారుడైన అతీక్ అహ్మద్ రౌడీయిజంలో, రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగాడు. రూ.వందల కోట్ల విలువైన ఆర్థిక సామ్రాజ్యం నిర్మించుకున్నాడు. దివంగత ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జన్మించిన అలహాబాద్(ప్రయాగ్‌రాజ్)ను అతీక్ అహ్మద్ సొంత జాగీరుగా మార్చేసుకొని, సమాంతర పాలన సాగించాడంటే అతడి హవా ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. వందకుపైగా కేసులు నమోదైనప్పటికీ.. ఉమేశ్‌పాల్ కిడ్నాప్ కేసు మినహా ఏ కేసులోనూ అతీక్‌కు శిక్ష పడలేదు. వ్యవస్థ మొత్తం అతడికి దాసోహమైందని, నిస్సిగ్గుగా ఊడిగం చేసిందని ప్రత్యర్థులు విమర్శిస్తూ ఉంటారు. నేరాల నుంచి వ్యాపారాలు, వ్యాపారాల నుంచి రాజకీయాలు.. ఇలా సాగింది అతీక్ ప్రస్థానం. నేరాలను, అవినీతి అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి, శిక్షల నుంచి తప్పించుకోవడానికి రాజకీయాలను రక్షణ కవచంగా వాడుకున్నాడు. **– సాక్షి, నేషనల్ డెస్క్**

క్రిమినల్ కథా చిత్రమ్



18 ఏళ్ల వయసులో తొలి ఎఫ్ఐఆర్

- అతీక్ అహ్మద్ ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జన్మించాడు. టాంగా నడిపే అతడి తండ్రి హాజీ ఫిరోజ్ నేరస్వభావం ఉన్నవాడే. అతీక్ బాల్యంలో కటిక పేదరికం అనుభవించాడు. ఎలాగైనా డబ్బు సంపాదించాలన్న కసితో నేరమార్గం ఎంచుకున్నాడు. స్నేహితులతో కలిసి ముఠా ఏర్పాటు చేశాడు. కిడ్నాప్‌లు, బెదిరింపులు, బలవంతపు వసూళ్లతో చెలరేగిపోయాడు. 1983లో 18 ఏళ్ల వయసున్నప్పుడు అతీక్‌పై మొదటి ఎఫ్ఐఆర్ నమోదయ్యింది. అతడిని అదుపులోకి తీసుకొనేందుకు పోలీసులు విసిరిన వల నుంచి చాలాసార్లు తప్పించుకున్నాడు. అతీక్‌పై నమోదైన కేసులను విచారించాలంటే న్యాయమూర్తులు వెనుకంజ వేసేవారు. అలహాబాద్ హైకోర్టుకు చెందిన 10 మంది జడ్జీలు తమంతట తామే ఈ కేసుల విచారణ నుంచి తప్పుకున్నారు. అతీక్ చంపేస్తాడన్న భయమే ఇందుకు కారణం. యూపీలో యోగి ఆదిత్యనాథ్ పాలన మొదలయ్యాక కూడా ప్రత్యర్థులను కిడ్నాప్ చేసి, తానున్న జైలుకు రప్పించి, తీవ్రంగా హింసించాడు. అతడిని ఉత్తరప్రదేశ్ జైళ్లలో కాకుండా ఇతర రాష్ట్రాల్లోని జైళ్లలో ఉంచాలని నాలుగేళ్ల క్రితం సుప్రీంకోర్టు ఆదేశించింది.

కుటుంబం.. నేరమయం

- ఉమేశ్ పాల్ హత్య కేసులో నిందితుడైన అతీక్ కుమారుడు అసద్ అహ్మద్ ఎన్‌కౌంటర్‌లో హతం కావడం దేశవ్యాప్తంగా సంచలనాత్మకంగా మారింది. కరడుగట్టిన నేరగాడైన అతీక్ అహ్మద్ కుటుంబ సభ్యులు సైతం నేరాలబాట పట్టినవారే కావడం గమనార్హం. కొందరు ఇప్పటికే వేర్వేరు కేసుల్లో జైలుపాలయ్యారు. అతడి భార్య మాత్రం పరారీలో ఉన్నారు.

- నేర సామ్రాజ్యాధినేతగా ఎదిగిన అతీక్ అహ్మద్ కన్ను 1980వ దశకంలో రాజకీయాలపై పడింది. 1989లో యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో అలహాబాద్ వెస్ట్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశాడు. మతం కార్డు వాడుకున్నాడు. తన ప్రత్యర్థి చాంద్‌బాబాను హత్య చేశాడు. సులువుగా విజయం సాధించాడు.

ఎమ్మెల్యేగా, ఎంపీగా..

తొలిసారి ఎమ్మెల్యే హోదా సంపాదించాడు. ఆ తర్వాత అదే స్థానం నుంచి 1991, 1993లోనూ స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందాడు. 1996లో సమాజ్‌వాదీ పార్టీ టికెట్‌తో, 2002 అప్నా దళ్ టికెట్‌తో గెలిచాడు. 2002లో అప్నా దళ్ ఉత్తరప్రదేశ్ అధ్యక్షుడయ్యాడు. హెలికాప్టర్లలో తిరుగుతూ రాష్ట్రమంతటా సుడిగాలి పర్యటనలు చేశాడు. 2004లో మళ్లీ సమాజ్‌వాదీ పార్టీలో చేరాడు. ఆ పార్టీ తరఫున ఫూల్పూర్ ఎంపీగా ఘన విజయం సాధించాడు. పార్లమెంట్‌లో అడుగుపెట్టాడు. మొత్తం ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలుపొందాడు. ప్రజాప్రతినిధిగా ఎన్నికైన తర్వాత కూడా నేరాలు ఆపలేదు. మరింత రాటుదేలాడు. బినామీల పేరిట కాంట్రాక్టులు దక్కించుకున్నాడు. ఇతర కాంట్రాక్టర్ల వద్ద కమీషన్లు వసూలు చేసేవాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి దిగాడు. అడ్డొచ్చిన వారిని అంతం చేశాడు. భారీగా ఆస్తులు కూడబెట్టాడు. దేశవ్యాప్తంగా పదికిపైగా రాష్ట్రాలకు అతీక్ నేరసామ్రాజ్యం విస్తరించింది. అచ్చంగా సినిమాల్లో చూపించే డాన్ల తరహాలోనే అతడి వ్యవహార శైలి, ప్రవర్తన ఉండేవి. తరచుగా గుర్రంపై వీధుల్లో తిరిగేవాడు. కొన్నిసార్లు ఖరీదైన కార్ల కాన్వాయ్ వెంటరాగా పాదయాత్ర చేస్తుండేవాడు.

రాజుపాల్ హత్య కేసు

- 2005 జనవరి 25న ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన ఎమ్మెల్యే రాజుపాల్ హత్యతో అతీక్ పతనం ప్రారంభమైంది. ఈ తర్వాత జరిగిన పలు ఎన్నికల్లో ఎమ్మెల్యేగా, ఎంపీగా పోటీ చేశాడు. కానీ, ఓటమే ఎదురయ్యింది. 2004లో ఎంపీగా గెలిచాక తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశాడు. ఉప ఎన్నికల్లో తన సోదరుడు అజీమ్‌కు సమాజ్‌వాదీ పార్టీ టికెట్ ఇప్పించుకున్నాడు. ఈ స్థానంలో నేరచరిత్ర ఉన్న రాజుపాల్‌కు బీఎస్పీ టికెట్ ఇచ్చింది. ఎన్నికల్లో అజీమ్ ఓడిపోయాడు. రాజుపాల్ ఎమ్మెల్యే అయ్యాడు. తర్వాత రాజుపాల్ హత్య జరిగింది. ఈ కేసులో అతీక్, అజీమ్ నిందితులు. రాజుపాల్ హత్యతో మళ్లీ ఉప ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ టికెట్‌పై అజీమ్ గెలిచాడు. అతీక్ 2019 లోక్‌సభ ఎన్నికల్లో వారణాసి నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, ఓడిపోయాడు.

అసద్ అహ్మద్

- ఉమేశ్‌పాల్ మర్డర్ కేసులో అసద్ అహ్మద్ నిందితుడు. చాలా రోజులు పోలీసుల కళ్లుగప్పి తిరిగాడు.
- అతడిపై రూ.5 లక్షల రివార్డు ఉంది.
- గురువారం ఉత్తరప్రదేశ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు జరిపిన కాల్పుల్లో మరో నిందితుడు గులామ్‌తోపాటు మరణించాడు.
- అతీక్ అహ్మద్ మరో ఇద్దరు కుమారులైన అజాన్, అబాన్ మైనర్లు. వారు ప్రస్తుతం ప్రభుత్వ ఆధ్వర్యంలోని చైల్డ్ ప్రొటెక్షన్ హోంలో ఉన్నారు.

అతీక్ అహ్మద్

- గత 43 ఏళ్లుగా పోలీసు రికార్డుల్లో కొనసాగుతున్నాడు. ఇప్పటికే 100కుపైగా కేసులు నమోదయ్యాయి.
- ఉమేశ్‌పాల్ అపహరణ కేసులో అతీక్ అహ్మద్‌కు యావజ్జీవ కారాగార శిక్ష పడింది.
- ప్రస్తుతం గుజరాత్‌లోని సబర్మతీ జైలులో ఉన్నాడు.
- అతీక్ అహ్మద్ 1996లో షాయిస్తా పర్వీన్‌ను వివాహం చేసుకున్నాడు.
- వారికి ఐదుగురు కుమారులు.. అలీ అహ్మద్, ఉమర్ అహ్మద్, అసద్ అహ్మద్, అజాన్ అహ్మద్, అబాన్ అహ్మద్ ఉన్నారు.
- పాకిస్తాన్ ఉగ్రవాదులతో, అక్కడి నిఘా సంస్థ ఐఎస్ఐతో అతీక్ అహ్మద్‌కు సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలు గతంలో వెల్లువెత్తాయి.

అష్రాఫ్ అలియాస్ అజీమ్ అహ్మద్

- అతీక్ అహ్మద్ సోదరుడే అష్రాఫ్/అజీమ్ అహ్మద్.
- ఇతడిపై మొత్తం 52 కేసులు ఉన్నాయి. ఒకసారి సమాజ్‌వాదీ పార్టీ టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలుపొందాడు.
- 2006 నాటి ఉమేశ్‌పాల్ కిడ్నాప్ కేసులో ఇతడిని ప్రయాగ్‌రాజ్ కోర్టు దోషిగా తేల్చింది.
- యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు.

షాయిస్తా పర్వీన్

- ఉమేశ్ పాల్ హత్య వ్యవహారంలో అతీక్ అహ్మద్, అష్రాఫ్ అహ్మద్‌తోపాటు షాయిస్తా పర్వీన్‌పై కేసు నమోదయ్యింది.
- పరారీలో ఉన్న పర్వీన్‌పై ఉత్తరప్రదేశ్ పోలీసులు రివార్డు ప్రకటించారు.
- ఆమె ఆచూకీ ఇంకా దొరక్కపోవడంతో రివార్డు మొత్తాన్ని రూ.25,000 నుంచి రూ.50,000కు పెంచారు.

అలీ అహ్మద్

- బలవంతంగా డబ్బు వసూళ్లకు పాల్పడిన కేసులో 2021లో అలీ అహ్మద్‌ను పోలీసులు అరెస్టు చేసి, జైలుకు పంపించారు.
- ఉమేశ్‌పాల్ హత్య కేసులోనూ అతడి పేరు తెరపైకి వచ్చింది.
- అలీ అహ్మద్ బెయిల్ పిటిషన్‌ను ఈ ఏడాది మార్చి 3న అలహాబాద్ హైకోర్టు తిరస్కరించింది. ఇప్పుడు లక్నో జైలులో ఉన్నాడు.
- అలీ అహ్మద్ లాంటి నేరగాళ్లు బయట ఉంటే కేవలం సాక్షులకే కాదు, సమాజానికి సైతం ముప్పేనని న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

ఉమర్ అహ్మద్

- లక్నోకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మోహిత్ జైస్వాల్ కిడ్నాప్, దాడి కేసులో అతీక్ అహ్మద్‌తోపాటు ఉమర్ అహ్మద్‌పై 2018 ఎఫ్ఐఆర్ నమోదయ్యింది.
- అదే కేసులో ఉమర్ అహ్మద్ ప్రస్తుతం ప్రయాగ్‌రాజ్‌లోని నైనీ సెంట్రల్ జైలులో ఉన్నాడు.

అతీక్‌కు ఐఎస్ఐ, లష్కరేతో లింకులు

ప్రయాగ్‌రాజ్: ఉమేశ్‌పాల్ హత్యకేసులో గ్యాంగ్‌స్టర్, రాజకీయ నాయకుడు అతీక్ అహ్మద్‌కు పాకిస్తాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ, ఉగ్రవాద లష్కరే తోయిబాతో సంబంధాలున్నాయని పోలీసులు తెలిపారు. గురువారం యూపీ పోలీసులు అతీక్ అహ్మద్‌ను, అతడి సోదరుడు అష్రాఫ్‌ను భారీ బందోబస్తు నడుమ ప్రయాగ్‌రాజ్‌లోని జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. 'నాకు ఆయుధాలు, డబ్బుకు కొదవలేదు. పాక్ నుంచి డ్రోన్ల ద్వారా సరిహద్దుల్లో పంజాబ్‌కు ఆయుధాలు, డబ్బు చేరుతాయి. అక్కడ మా వాళ్లు వాటిని అందుకుంటారు. కశ్మీర్ ఉగ్రవాదులు కూడా తీసుకెళతారు. కావాలంటే మీరు నన్ను అక్కడికి తీసుకెళ్తే డబ్బు, ఆయుధాలు అందజేస్తా' అంటూ అతీక్ అహ్మద్ విచారణలో వెల్లడించిన విషయాలను యూపీ పోలీసులు ఈ సందర్భంగా కోర్టుకు సమర్పించారు. రెండు గంటలపాటు సాగిన వాదోపవాదాల అనంతరం అతీక్, అష్రాఫ్‌లిద్దరికీ ఈనెల 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి, ఐదు రోజుల పోలీసు రిమాండ్‌కు అనుమతినిస్తూ మేజిస్ట్రేట్ దినేశ్ గౌతమ్ ఆదేశాలిచ్చారని ఉమేశ్ పాల్ భార్య తరఫు లాయర్ చెప్పారు. ఇద్దరినీ రిమాండ్ పూర్తయ్యేదాకా ప్రస్తుతమున్న సబర్మతీ, బరేలీ జైళ్లలోనే ఉంచుతారన్నారు.

మరీ ఇంత పెద్ద శిక్షా ?

- నేర నిరూపణ విధానం సరిగా లేదు
- పరువు నష్టం కేసులో కోర్టు ఎదుట రాహుల్ లాయర్ల వాదన

సూరత్: మోదీ ఇంటి పేరును అనుచితంగా వాడారనే పరువు నష్టం కేసులో రెండేళ్ల జైలు శిక్ష, ఎంపీగా అనర్హత వేటును ఎదుర్కొంటున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తరఫున ఆయన న్యాయవాదులు గురువారం సూరత్ కోర్టులో వాదనలు వినిపించారు. 'నేర నిరూపణ విధానం సవ్యంగా లేదు. ఈ కేసులో ట్రయల్ కోర్టు జడ్జి అనమతుల్య సాక్ష్యాధారాలను ఆధారం చేసుకుని తీర్పు చెప్పారు. ఎలక్ట్రానిక్ సాక్ష్యాలతో మొత్తం కేసు ఆధారపడింది. రాఫెల్ కేసులో రాహుల్ చెప్పిన బేషరతు క్షమాపణ అంశాన్ని ఈ కేసుకు సంబంధంలేకున్నా ఇందులో జతచేశారు. మరీ ఇంత పెద్ద శిక్షా ?. ఈ కేసులో గరిష్ట శిక్షను అమలుచేయాల్సిన అవసరం లేదు' అని అదనపు సెషన్స్ జడ్జి ఆర్‌పీ మొగెరా ముందు రాహుల్ లాయర్ ఆర్ఎస్ ఛీమా వాదించారు. శిక్షను నిలుపుదల చేయాలని కోరారు. 'దొంగలందరి ఇంటి పేరు మోదీ అనే ఎందుకుంది? అనే ప్రసంగం చేసే నాటికి రాహుల్ దేశంలోనే రెండో అతిపెద్ద పార్టీకి అధ్యక్షునిగా ఉన్నారు. దేశ ప్రజలపై ఆయన ప్రసంగ ప్రభావం చాలా ఎక్కువ ఉంటుంది. ప్రసంగాన్ని సంచలనం చేయాలనేది ఆయన ఉద్దేశ్యం. ఇలాంటి పరువునష్టం కేసులు ఆయన వేర్వేరు కోర్టుల్లో చాలా ఎదుర్కొంటున్నారు. రాఫెల్ కేసులో అనుచిత వ్యాఖ్యలు, అనేక క్షమాపణల తర్వాతా ఆయన ఇలాంటి ప్రసంగాలు చేశారు' అని పరువునష్టం కేసు వేసిన పూర్ణేశ్ మోదీ తరఫు లాయర్ హర్షిత్ తోలియా వాదించారు. తర్వాత జడ్జి తీర్పును 20వ తేదీకి వాయిదావేశారు.

యూపీలో పోలీసు ఎన్‌కౌంటర్

గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ కుమారుడు అసద్ హతం ● సహాయకుడు గులామ్ సైతం..


ఘటనాస్థలిలో అసద్, గులామ్ మృతదేహాలు

లక్నో/ఝాన్సీ: ఉత్తరప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన ఉమేశ్ పాల్ హత్య కేసులో ప్రధాన నిందితుడైన గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ కుమారుడు అసద్‌ను పోలీసులు ఎదురుకాల్పుల్లో మట్టుబెట్టారు. అసద్‌తోపాటు అతని సహాయకుడు గులామ్ పోలీసుల తూటాలకు హతమయ్యాడు. ఝాన్సీ పట్టణం సమీపంలో గురువారం మధ్యాహ్నం ఈ ఎన్‌కౌంటర్ జరిగింది.

మారువేషం.. 42 రౌండ్ల కాల్పులు..

నాటి బీఎస్పీ ఎమ్మెల్యే రాజు పాల్ హత్యకేసులో ప్రత్యక్ష సాక్షి ఉమేశ్ పాల్‌ను హత్య చేశాక అసద్, గులామ్‌లు లక్నోకు, తర్వాత కాన్పూర్‌కు పారిపోయారు. ఆ తర్వాత మీరట్‌కు చివరకు ఢిల్లీకి చేరుకుని 15 రోజులు అక్కడే ఉన్నారు. తర్వాత అజ్మీర్‌కు వెళ్లారు. ఇక మధ్యప్రదేశ్‌లో దాక్కుందామని నిర్ణయించుకుని బయల్దేరారు. అసద్ గ్యాంగ్‌లో ఇన్‌ఫార్మర్‌ను నియమించుకున్న పోలీసులు అసద్ ఎక్కడెక్కడికి వెళ్తున్నాడనేది ఓ కన్నేసి ఉంచారు. ఝాన్సీ పట్టణం మీదుగా మారువేషంలో అసద్ వెళ్తున్నాడని తెల్సి ఇద్దరు డీఎస్పీలుసహా 12 మందితో యూపీ స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందం రాష్ట్ర సరిహద్దుల్లో మాటువేసింది. ఝాన్సీ దగ్గర్లోని బబీనా మార్గంలో బైక్‌పై వెళ్తుండగా హఠాత్తుగా పోలీసులు కంటబడి చుట్టుముట్టేసరికి కాల్పులు జరిపి పారిపోబోయారు. దీంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో ఇద్దరూ అక్కడే హతమయ్యారు. ఎన్‌కౌంటర్‌లో మొత్తం 42 రౌండ్ల కాల్పులు జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. చనిపోయిన వారిపై తలో రూ.5 లక్షల రివార్డ్ ఉంది. 'ఘటనాస్థలిలో అత్యాధునిక విదేశీ ఆయుధాలు బ్రిటిష్ బుల్‌డాగ్ రివాల్వర్, .455 బోర్, వాల్డర్ బోర్ పిస్టల్ స్వాధీనం చేసుకున్నాం' అని ఉత్తరప్రదేశ్ స్పెషల్ డైరెక్టర్ జనరల్(శాంతిభద్రతలు) ప్రశాంత్ చెప్పారు. ఉమేశ్ హత్య కేసులో అతీక్‌ను ప్రయాగ్‌రాజ్‌లోని కోర్టులో హాజరుపరిచిన రోజే అసద్ మరణించడం గమనార్హం.

నకిలీ ఎన్‌కౌంటర్ అంటూ ఎస్పీ, బీఎస్పీ ఆరోపణలు

ఈ నకిలీ ఎన్‌కౌంటర్‌లో నిజాలు బయటకురావాలంటే సమగ్ర దర్యాప్తు జరగాల్సిందేనని సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్‌సమాజ్ పార్టీలు డిమాండ్‌చేశాయి. ప్రజా సమస్యల నుంచి అందరి దృష్టి మరల్చేందుకే యోగి సర్కార్ ఇలా ఎన్‌కౌంటర్ల పర్వానికి తెరలేపిందని ఆరోపించాయి. ఇది మరో వికాస్ దూబే ఘటన అని బీఎస్పీ చీఫ్ మాయావతి వ్యాఖ్యానించారు.

ఎవరీ అసద్ ?

రాజకీయనేతగా మారిన గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ కుమారుడే ఈ అసద్ అహ్మద్. 2004లో అలహాబాద్(పశ్చిమ) నియోజకవర్గం ఉప ఎన్నికల్లో ఈ స్థానం నుంచి ఎమ్మెల్యేగా అతీక్ తన సోదరుడు అష్రాఫ్‌ను బరిలోకి దింపాడు. అయితే ఆ ఉప ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థి అయిన రాజుపాల్ అనూహ్యంగా విజయం సాధించారు. తమ్ముడి ఓటమిని తట్టుకోలేక ఆగ్రహంతో అతీక్ 2005లో ఎమ్మెల్యే రాజుపాల్‌ను తన సహచరులతో కలిసి హత్యచేయించారు. ఈ హత్యకు న్యాయవాది ఉమేశ్ పాల్ ప్రత్యక్ష సాక్షి. దీంతో ఉమేశ్‌పాల్, ఇద్దరు గన్‌మెన్‌లను అతీక్ కుమారుడు అసద్ అనుచరులు ఈ ఏడాది ఫిబ్రవరి 24వ తేదీన పట్టపగలు దారుణంగా హత్య చేశారు. అప్పటి నుంచి అసద్, గులామ్ పరారీలో ఉన్నారు. అసద్ ఎన్‌కౌంటర్ వార్త తెల్సి సంతోషంతో ఉమేశ్ పాల్ కుటుంబసభ్యులు సీఎం యోగి ఆదిత్యనాథ్, పోలీసు యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. 'ఈ ఎన్‌కౌంటర్ నా కుమారుడికి ఘన నివాళి' అని ఉమేశ్ పాల్ తల్లి శాంతీదేవి మీడియా ముందు వ్యాఖ్యానించారు.


కోర్టు హాలులో అతీక్, అష్రాఫ్

అంతా నావల్లే: తండ్రి పశ్చాత్తాపం!

కోర్టుకు హాజరైనపుడు అసద్ మరణవార్త తెల్సి తండ్రి అతీక్ విపరీతంగా ఏడ్చినట్లు సమాచారం. 'ఇదంతా నావల్లే జరిగింది. కొడుకు చావుకు నేనే కారణం. కడసారి చూసుకునేందుకు అంత్యక్రియల్లో పాల్గొంటా. అందుకు అనుమతి ఇవ్వండి. ఈ కేసులో నా కుటుంబసభ్యులను ఇకనైనా వేధించడం ఆపండి' అని ఉన్నతాధికారులను అతీక్ వేడుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. కాగా, కోర్టులో హాజరుపరిచేందుకు అతీక్‌ను తీసుకొచ్చే మార్గమధ్యంలో పోలీసు వాహన శ్రేణిపై దాడి చేసి తండ్రిని విడిపించుకోవాలని అసద్ ప్రణాళిక వేశాడని పోలీసు అధికారి ప్రశాంత్ చెప్పారు.

భారత వ్యతిరేక శక్తులపై గట్టి చర్యలు తీసుకోండి

రిషి సునాక్‌ను కోరిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ గురువారం బ్రిటన్ ప్రధాని రిషి సునాక్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ యూకేలో దౌత్య కార్యాలయాల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. ఖలిస్తానీ అనుకూలవాదులు కొందరు ఇటీవల లండన్‌లో భారత దౌత్య కార్యాలయంపై దాడికి దిగడం, భారత జాతీయ పతాకాన్ని అవమానించిన ఘటనలను ఈ సందర్భంగా రిషి సునాక్‌తో ప్రస్తావించారు. భారత వ్యతిరేక శక్తులపై గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా, ఆర్థిక నేరస్తులను భారత్‌కు తిరిగి అప్పగించేందుకు తీసుకుంటున్న చర్యలను వేగవంతం చేయాలన్నారు. ఇద్దరు నేతలు పలు ద్వైపాక్షిక అంశాలు, ముఖ్యంగా వాణిజ్యం, ఆర్థిక రంగాల పురోగతిని సమీక్షించారని అధికారులు తెలిపారు.

విపక్షాల ఐక్యతా యత్నాలు

న్యూఢిల్లీ: 2024లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో అధికార బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా ప్రతిపక్షాల ఐక్యతకు వేగంగా అడుగులు ముందుకు పడుతున్నాయి. బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) నేత నితీశ్ కుమార్ గురువారం సీపీఎం, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శులు సీతారాం ఏచూరి, డి.రాజాతో సమావేశమయ్యారు. ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తోనూ నితీశ్ కుమార్ భేటీ అయ్యారు. విపక్షాల ఐక్యత, తాజా రాజకీయ పరిణామాలపై వారు చర్చించుకున్నట్లు సమాచారం. రాబోయే రోజుల్లో మరిన్ని సమావేశాలు ఉంటాయని తెలుస్తోంది. అతిత్వరలో వివిధ పార్టీల అగ్రనేతలతో కీలక భేటీ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. విపక్షాలు రాష్ట్రాల స్థాయిలో సీట్ల సర్దుబాటు చేసుకోవాలని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి అన్నారు. దేశంలో మూడో కూటమి సాధ్యమేనని ఉద్ఘాటించారు. అయితే, ఈ కూటమి ఎన్నికలు పూర్తయిన తర్వాత ఏర్పడే అవకాశం ఉందన్నారు. దేశాన్ని, దేశ ప్రజల జీవితాలను కాపాడాలంటే బీజేపీని ఓడించాల్సిందేనని సీతారం ఏచూరి ట్వీట్ చేశారు. బీజేపీ అరాచక పాలనతో దేశ ప్రజలంతా విసుగెత్తిపోయారని డి.రాజా ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

ఐటీ రూల్స్‌లో సవరణలు ఉపసంహరించండి

కేంద్ర ప్రభుత్వానికి ఐఎన్ఎస్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: ఐటీ నిబంధనల్లో తీసుకొచ్చిన సవరణలను ఉపసంహరించుకోవాలని ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ(ఐఎన్ఎస్) అధ్యక్షుడు కేఆర్‌పీ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భాగస్వామ్యపక్షాలతో ఎలాంటి సంప్రదింపులు జరపకుండానే సవరణలను ఈ నెల 6న నోటిఫై చేశారని పేర్కొన్నారు. ఏది నిజమో, ఏది నకిలీనో గుర్తించే అధికారాన్ని ఈ సవరణలు ప్రభావితం చేస్తాయని వెల్లడించారు. ఇప్పటిదాకా ఇలాంటి సంపూర్ణ అధికారం ప్రభుత్వానికి, ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏజెన్సీ ఐఎన్ఎస్‌కు ఉందని గుర్తుచేశారు. మీడియా వృత్తి, విశ్వసనీయతతో ముడిపడి ఉన్న ఏ అంశంపై అయినా నోటిఫికేషన్ జారీ చేసే ముందు మీడియా సంస్థలు, విలేకరుల సంఘాలతో విస్తృత, అర్థవంతమైన సంప్రదింపులు జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. నిజ నిర్ధారణ కోసం ఎలాంటి యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తారు? న్యాయ సహాయం కోరవచ్చా? అప్పీల్ చేసే హక్కు ఉంటుందా? తదితర కీలక అంశాలను నోటిఫైడ్ రూల్స్‌లో ప్రస్తావించలేదని కేఆర్‌పీ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది జనవరిలో బహిర్గతం చేసిన ముసాయిదా సవరణల కంటే ఈ నెల 6న నోటిఫై చేసిన కొత్త ఐటీ రూల్స్ ఏమాత్రం భిన్నంగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. భాగస్వామ్య పక్షాలతో చర్చించకుండా ఐటీ రూల్స్‌లో సవరణలు చేయడం సహజ న్యాయ సూత్రాలను ఉల్లంఘించడమే అవుతుందని ఐఎన్ఎస్ సెక్రెటరీ జనరల్ మేరీ పాల్ స్పష్టం చేశారు. సవరణలు నోటిఫై చేసే ముందు మీడియా సంస్థలతో చర్చల కోసం కేంద్ర సమాచార, ప్రసార శాఖ కనీసం ప్రయత్నం కూడా చేయకపోవడం విచారకరమని పేర్కొన్నారు.


గిన్నిస్ డ్యాన్స్. ఒకేసారి బిహూ నృత్యం చేస్తూ, డోలు వాయించి కొత్త గిన్నిస్ ప్రపంచ రికార్డు సృష్టించిన 11,304 మంది కళాకారులు. గురువారం గువాహటిలో తీసిందీ ఫొటో.

కొత్తరకం క్షిపణిని పరీక్షించిన ఉ.కొరియా

సియోల్: ఉత్తరకొరియా రెచ్చగొట్టే ఆయుధ పరీక్షల పరంపరను కొనసాగిస్తోంది. గురువారం ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించింది. ఇది మరింత శక్తివంతం, గుర్తించడానికి కష్టతరమైనదని పొరుగుదేశాలు అనుమానిస్తున్నాయి. క్షిపణి ప్రయోగం నేపథ్యంలో పొరుగు దేశం జపాన్ తమ హొక్కైడో దీవి వాసులను షెల్టర్లలోకి వెళ్లిపోవాలంటూ అప్రమత్తం చేసింది. రాజధాని ప్యాంగ్‌యాంగ్ నుంచి ప్రయోగించిన ఈ క్షిపణి వెయ్యి కిలోమీటర్ల దూరం ప్రయాణించి కొరియా ద్వీపకల్పం, జపాన్ మధ్య సముద్రజలాల్లో పడిపోయినట్లు జపాన్ సైన్యం ప్రకటించింది. ఇది దీర్ఘశ్రేణి క్షిపణి అయి ఉంటుందని తెలిపింది. ఘన ఇంధనం కలిగిన ఈ క్షిపణి కొత్తరకానిది అయి ఉంటుందని దక్షిణకొరియా సైన్యం అంటోంది.

కర్ణాటక బీజేపీలో కొనసాగుతున్న అసమ్మతి

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విడుదల చేసిన రెండో జాబితాలో ఏకంగా ఏడుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు నిరాకరించింది. అవినీతి ఆరోపణల్లో ఇటీవల అరెస్టయిన విరూపాక్ష సహా ఏడుగురు సిట్టింగ్‌లకు టికెట్లు ఇవ్వకుండా కొత్త వారికి అవకాశం కల్పిస్తూ 23 మందితో రెండో జాబితాను విడుదల చేసింది. దీంతో మొత్తంగా 212 స్థానాలకు అభ్యర్థుల్ని ప్రకటించింది. రెండో జాబితాలో కూడా సిట్టింగ్‌లకు చోటు కల్పించకపోవడంతో పార్టీలో అసమ్మతి ఇంకా కొనసాగుతోంది. ముదిగెరె ఎమ్మెల్యే ఎం.పి. కుమారస్వామి, హావేరి ఎమ్మెల్యే నెహ్రూ ఒలేకర్ పార్టీకి గుడ్ బై కొట్టారు.

సరికొత్తగా భారత్: మోదీ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న కొత్త విధానాలు, కొత్త వ్యూహాలతో కొత్త భారత్ ఆవిష్కృతం దిశగా పరుగులు తీస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మౌలిక సదుపాయాలు, సాంకేతిక రంగాలలో తమ ప్రభుత్వం క్రియాశీలంగా వ్యవహరిస్తోందని అన్నారు. గత ప్రభుత్వాలు ఈ రంగాల్ని విస్మరిస్తే తాము వాటి సహకారంతో కొత్త భారత్ నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. గురువారం జరిగిన రోజ్‌గార్ మేళానుద్దేశించి ప్రధాని వీడియో ద్వారా ప్రసంగించారు. తమ ప్రభుత్వ విధానాలతో దేశంలో యువతకు కొత్త అవకాశాలు కలిసొస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా 71, 506 మందికి అపాయింట్‌మెంట్ లెటర్స్ అందజేశారు. దేశంలో స్టార్టప్ సెక్టార్‌ని ప్రధాని మోదీ కొనియాడారు. మన దేశంలో స్టార్టప్‌ల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 40 లక్షలకుపైగా ఉద్యోగాల కల్పన జరిగిందన్నారు. రూ.23 లక్షల కోట్ల బ్యాంక్ గ్యారంటీ రుణాలతో ప్రధానమంత్రి ముద్ర యోజన కింద ఎనిమిది కోట్ల మందికి పైగా కొత్త వ్యాపారాలను ప్రారంభించారని చెప్పారు. సాధారణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికే తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని చెప్పారు. ప్రజలందరికీ దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించినప్పుడే 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్వల్ప రుణాలతో దేశం ఆర్థికంగా క్షేత్ర స్థాయి నుంచి బలోపేతమవుతుందని ప్రధాని చెప్పారు. కాగా, రైల్వే శాఖలో మూడు లక్షలకు పైగా ఖాళీలు ఉంటే మోదీ 50 వేల అపాయింట్‌మెంట్ లెటర్స్‌ని పంచి పెట్టి చేతులు దులుపుకుంటూ తమాషా చూస్తోందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే విమర్శించారు.

కశ్మీర్‌లో పాక్ డ్రోన్ కూల్చివేత

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని రాజౌరి జిల్లాలో నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ)కు సమీపంలో పాకిస్తాన్‌కు చెందిన డ్రోన్‌ను భద్రతా దళాలు కూల్చివేశాయి. ఈ నెల 12వ తేదీ అర్ధరాత్రి దాటాక సుందర్‌బని సెక్టార్‌లోని భారత భూభాగంలో ఈ ఘటన చోటుచేసుకుంది. డ్రోన్‌కున్న ప్యాకేజీలోని మందుగుండుసామగ్రి, రూ.2 లక్షల నగదు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఆర్మీ తెలిపింది. మరికొన్ని డ్రోన్లు కూడా ఇటువంటి మందుగుండు సామగ్రిని, ఇతర ఆయుధాలను జారవిడిచి వెళ్లి ఉంటాయనే అనుమానంతో ఆ ప్రాంతంలో సైన్యం తనిఖీలు ముమ్మరం చేసింది. అంతర్జాతీయ సరిహద్దులు, నియంత్రణ రేఖ వెంబడి పాక్ వైపు నుంచి డ్రోన్ల ద్వారా ఆయుధాలు, డ్రగ్స్, పేలుడు సామగ్రిని దొంగచాటుగా చేరవేస్తున్న ఘటనలు భారత బలగాలకు పెనుసవాల్‌గా మారాయి.

సాక్షి
కరీంనగర్
శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023



క్వింటాల్ పత్తి రూ.7,900

జమ్మికుంట(హుజూరాబాద్): పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర గరిష్టంగా రూ.7,900 పలికింది. గురువారం మార్కెట్‌కు 1,574 క్వింటాళ్ల పత్తి విక్రయానికి తీసుకువచ్చారు.



పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్‌క్రైం: ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించనున్నారు. సంబంధిత పోస్టర్, కరపత్రాలను సీపీ సుబ్బారాయుడు గురువారం ఆవిష్కరించారు.

గరిష్టం/కనిష్టం
41.0/27.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి పూట ఉక్కపోతగా ఉండి, వేడి తీవ్రత పెరుగుతుంది.

మానవులందరూ ఒక్కటే కలిసి మెలిసి జీవించండి. పరస్పరం శత్రువులుగా మారకండి.
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
శుక్ర 6:35	శని 4:33

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

15న గాంధీ విగ్రహావిష్కరణ

• మేయర్ సునీల్‌రావు



కరీంనగర్‌సిటీ: జాతిపిత మహాత్మాగాంధీ అతిపెద్ద విగ్రహాన్ని 15వ తేదీన ఆవిష్కరిస్తున్నట్లు నగర మేయర్ యాదగిరి సునీల్ రావు తెలిపారు. నగర అభివృద్ధిలో భాగంగా గురువారం కమిషనర్ సేవా ఇస్లావత్‌తో కలిసి మేయర్ గాంధీ ఐలాండ్ జంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కిసాన్‌నగర్ చౌరస్తాలోని గాంధీ విగ్రహాన్ని మంత్రి గంగుల కమలాకర్, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ వినోద్ కుమార్ ఆవిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నక్క పద్మ, డీఈ మసూద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం ఆసుపత్రి ఉద్యోగుల నిరసన



కరీంనగర్‌టౌన్: వేతనాల కోసం జిల్లా ఆసుపత్రి ఉద్యోగులు గురువారం ఆసుపత్రి ముందు నిరసన చేపట్టారు. మార్చి నెలకు సంబంధించిన వేతనాలు ఏప్రిల్ 13వ తేదీ వచ్చినా రాకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి నెలలో ఐటీ కటింగ్‌ల కారణంగా పూర్తి వేతనాలు పొందలేదని పేర్కొన్నారు. అదే విధంగా ఆసుపత్రిలో స్టేషనరీ కొరత కారణంగా విధులు సక్రమంగా నిర్వహించలేకపోతున్నామని అన్నారు. వేతనాలు, స్టేషనరీ సరఫరాపై అధికారులు స్పందించాలని కోరారు. ఆందోళనలో ఆసుపత్రి నర్సింగ్, ల్యాబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తపాలా శాఖలో మహిళలకు కొత్త సేవింగ్ స్కీమ్

విద్యానగర్(కరీంనగర్): తపాలా శాఖలో మహిళల కోసం మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్–2023 పేరిట కొత్త స్కీమ్ తీసుకువచ్చినట్లు కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వై.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. మహిళల ఆర్థిక పరిపుష్టి కోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. మహిళలు, బాలికల ఇందులో చేరవచ్చని, రూ.1,000 నుండి రూ.2 లక్షల వరకు డిపాజిట్ చేసుకోవచ్చన్నారు. డిపాజిట్లపై 7.5 శాతం వడ్డీ ఉంటుందని, పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రైతులపై 'హమాలీ' భారం

• కొనుగోలు కేంద్రాల్లో తడిసి మోపెడవుతున్న హమాలీ ఖర్చు
• 40 కిలోల బస్తాకు రూ.20 చెల్లిస్తున్న రైతులు
• రైతులపై అదనపుభారం, ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్
• జిల్లాలో వారం రోజుల్లో ప్రారంభం కానున్న కేంద్రాలు

ప్రభుత్వమే చెల్లించాలి



వీణవంక మండలం హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన మారం తిరుపతిరెడ్డి గత వానాకాలంలో దొడ్డురకం వరి నాలుగు ఎకరాలలో సాగు చేశాడు. 150 బస్తాల దిగుబడి వచ్చింది. గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించాడు. ధాన్యం తూకం పెట్టినందుకు క్వింటాల్‌కు రూ.42 హమాలీలకు చెల్లించాడు. ధాన్యం సంచుల్లో నింపేందుకు కూలీలకు బస్తాకు రూ.8 అదనంగా చెల్లించాడు. మొత్తంగా రూ.9 వేలకు పైగా ఖర్చు అయ్యిందని తెలిపాడు. ప్రభుత్వ మద్దతు ధర గత వానాకాలంలో రూ.1,960 ఉండగా ఇందులో రూ.50 తూకం ధాన్యం ఎత్తడం, తూకం వేయడానికే సదరు రైతు చెల్లించాడు. ప్రభుత్వమే హమాలీలకు చెల్లిస్తే రైతులపై అదనపు భారం పడదని సదరు ఆవేదన వ్యక్తం చేశాడు.

వీణవంక(హుజూరాబాద్): ఆరుగాలం శ్రమించి పండించిన ఉత్పత్తులను కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే హమాలీ ఖర్చు రైతులకు తడిసి మోపెడవుతోంది. ప్రభుత్వ మద్దతు కలిసొస్తుందని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలిస్తే ఒక్కోబస్తాకు (40కిలోల) రూ.20 వరకు హమాలీలు వసూళ్లు చేస్తున్నారు. గతంలో హమాలీలకు ప్రభుత్వమే చెల్లించేది. 2017 రబీ సీజన్ నుంచి తమతో కాదని ప్రభుత్వం చేతులెత్తేసింది. దీంతో రైతులపై అదనపు భారం పడుతోంది. మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,060 ఉండగా ఇందులో హమాలీలకు రూ.50 రైతులు చెల్లిస్తున్నారు. ప్రభుత్వం హమాలీలకు చెల్లిస్తే రైతులకు ఊరట లభించే అవకాశం ఉందని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ఊపందుకున్న కోతలు

కరీంనగర్ జిల్లావ్యాప్తంగా వరికోతలు ఊపందుకున్నాయి. ఈ యాసంగిలో నాట్లు వేసిన వారం నుంచి మొగిపురుగు ఆశించి రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. పంటను కాపాడుకోవడానికి ఖరీదైన రసాయన మందులు పిచికారీ చేశారు. ఎకరాకు రూ.30వేల పెట్టుబడి పెట్టగా దిగుబడి అంతంతే వస్తుందని రైతులు వాపోతున్నారు. జిల్లావ్యాప్తంగా 40వేల ఎకరాల్లో రైతులు వరిపంటను చెడగొట్టి మళ్లీనాట్లు వేశారు. యాసంగిలో 2.40లక్షల ఎకరాలలో వరిసాగులోకి వచ్చింది. మరో వారంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గతేడాది 354కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా 351 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇప్పటికే హమాలీలు సమావేశాలు నిర్వహించుకొని ధరలు నిర్ణయించుకున్నారు.



ధాన్యం కొనుగోళ్లు (ఫైల్)

చేతులెత్తేసిన ప్రభుత్వం

గతంలో క్వింటాల్‌కు రూ.5.30ల చొప్పున ప్రభుత్వం హమాలీలకు చెల్లించేది. దీంతో రైతులకు కొంత ఊరట లభించేది. మిగిలిన డబ్బులు రైతులు కలుపుకొని హమాలీలకు చెల్లించేవారు. 2017 రబీ నుంచి హమాలీలకు చెల్లించలేమంటూ ప్రభుత్వం చేతులెత్తేసింది. అప్పటి నుంచి రైతులపై అదనపు భారం పడుతోంది. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు గ్రేడ్‌ఏ రకం రూ.2,060, కామన్‌రకం రూ.2,040గా నిర్ణయించారు. ఇందులో క్వింటాల్‌కు రూ.50 హమాలీలకు రైతులు చెల్లిస్తున్నారు. ధాన్యం ఎత్తడం, తూకం వేయడం హమాలీలు చేయాలి. కానీ కొన్ని గ్రామాలలో కేవలం తూకం మాత్రమే హమాలీలు వేస్తున్నారు. దీంతో ధాన్యం ఎత్తడం రైతులకు అదనపు భారంగా మారింది. ధాన్యం ఎత్తడం కోసం అదనంగా బస్తాకు రూ.8 కూలీలకు ఇవ్వాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు.

ప్రభుత్వమే చెల్లించాలి

పెరిగిన పెట్టుబడులకు మద్దతు ధర సరిపోతలేదని, హమాలీలకు పూర్తిగా ప్రభుత్వమే చెల్లించాలని కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మడుగూరి సమ్మిరెడ్డి డిమాండ్ చేస్తున్నారు. ఈసారి వాతావరణ పరిస్థితుల వల్ల అంతంత మాత్రమే దిగుబడి వచ్చింది. ఎకరాకు పెట్టుబడి రూ.25వేల పైనే పెట్టారు. కౌలురైతుల పరిస్థితి దయనీయంగా మారింది. కౌలు ధరలు చెల్లించలేక ఈ యాసంగిలో వ్యవసాయానికి కొందరు రైతులు దూరమయ్యారు. ఇప్పటికైనా పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ చొరవ తీసుకొని హమాలీ చార్జీలు పూర్తిగా ప్రభుత్వమే భరించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

సాగైన వరి 95,382 హెక్టార్లు
పంట దిగుబడి అంచనా 5,12,314 మెట్రిక్ టన్నులు
విత్తనం, స్థానిక వినియోగం 1,04,145 మె.ట
కేంద్రాలకు రానున్న దిగుబడి 4,08,169 మె.ట
హమాలీ ఖర్చులు(అంచనా): రూ.20,40,84,500

మొత్తం కొనుగోలు కేంద్రాలు	351
ఐకేపీ	62
పీఏసీఎస్	231
డీసీఎంఎస్	50
మార్కెట్ యార్డులు	8

రైతులే చెల్లించాలి

హమాలీ చార్జీలు రైతులే చెల్లించుకోవాలి. కొనుగోలు కేంద్రాలకు ఎలాంటి సంబంధం లేదు. అన్నీ గ్రామాల్లో ఇప్పటి వరకు రైతులే చెల్లిస్తున్నారు. ఒక్కో గ్రామంలో ఒక్కో విధంగా హమాలీలు వసూళ్లు చేస్తున్నారు. 2017యాసంగి నుంచి హమాలీ చార్జీలను ప్రభుత్వం నిలిపివేసింది. కొనుగోలు కేంద్రాలలో 40కిలోల బస్తాల చొప్పున లోడింగ్ చేస్తారు. వారం రోజుల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి.
– ప్రకాశ్‌రెడ్డి, సీఈవో, పీఏసీఎస్, వీణవంక

స్పాట్ కేంద్రం ఎదుట టీపీటీఎఫ్ నిరసన



కరీంనగర్: ఎస్ఎస్‌సీ మూల్యాంకనం రేట్లు పెంచాలని, పాత బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం స్పాట్ కేంద్రం ఎదుట టీపీటీఎఫ్ కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లా ప్రతినిధులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీన వైఖరితో ఉందన్నారు. గతేడాది స్పాట్ మూల్యాంకనం డబ్బులు ఇప్పటికీ అందలేదని పేర్కొన్నారు. గతంలో ప్రతీ సబ్జెక్టుకు రెండు పేపర్లు ఉంటే ఈసారి ఒకే పేపర్ ఉందని.. తద్వారా ఉపాధ్యాయులపై పనిభారం ఎక్కువైందని.. మూల్యాంకనం రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి దామోదర్ రెడ్డి, కార్యదర్శి జంకె రామచంద్రారెడ్డి, శిథర్, తిరుపతి, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొర్నాల భూపాల్ రెడ్డి, దుమాల రమానాథ్ రెడ్డి, నాయకులు జంకె రామచంద్రారెడ్డి, కృష్ణ చైతన్య, కనకయ్య రాంబాబు, సమ్మయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

16న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

కరీంనగర్: జిల్లాలోని పదకొండు ఆదర్శ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి ఈనెల 16న 6,7,8,9,10వ తరగతులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈవో సీహెచ్ జనార్దన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి ప్రవేశాలకు 14 కేంద్రాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్లకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లు పొందాలని, ఏవైనా తప్పులున్నట్లయితే ఆధారాలతో పరీక్షా కేంద్రాలలో తెలియజేయాలని సూచించారు.

రైతు ఆత్మహత్యాయత్నం

• కొత్తపల్లి తహసీల్ ఆఫీసు ఆవరణలో ఘటన
• ఇంటి స్థలం సమస్య విషయంలో ఆత్మహత్యకు ప్రయత్నం
• రైతు పరిస్థితి విషమం.. ఆసుపత్రిలో చికిత్స



అపస్మారక స్థితిలో రైతు మల్లేశ్

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఖాజీపూర్ హామ్లేట్ ఐలవేనిపల్లెకు చెందిన రైతు అనుగుల మల్లేశ్ (55) గురువారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం కలకలం రేపింది. కార్యాలయ ఆవరణలోని బెంచీపై కూర్చొని అపస్మారక స్థితిలోకి వెళ్లిన విషయాన్ని గమనించిన తహసీల్దార్ నల్ల వెంకటరెడ్డి ఆ రైతును హుటాహుటిన కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రభుత్వ వైద్యుల సూచన మేరకు అపోలోకు తీసుకెళ్లారు. వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. కాగా.. ఇంటి స్థలం సమస్య పరిష్కరించాలని రెండేళ్లుగా తిరుగుతున్నా స్పందించడం లేదన్న ఆవేదనతో రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మల్లేశ్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నాడు. ఈ విషయమై కొత్తపల్లి తహసీల్దార్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. తాను ఇటీవలే బాధ్యతలు స్వీకరించానని, ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు. బాధితుని లేఖ ఆధారంగా ఆరా తీయగా ఐలవేనిపల్లెలోని 273 సర్వేనెంబర్ 5 గుంటల స్థలం ఉండగా డిజిటల్ సంతకం అయిందని. దాంతోనే 17 ఏప్రిల్ 2021లో ఇతర వ్యవసాయ సంబంధిత సర్వేనెంబర్లతో పాస్‌పుస్తకం జారీ అయిందని చెప్పారు. 298 సర్వేనెంబర్‌లోని 20 గుంటలు ఇంటి స్థలంగా పడటంతో నివేదిక పెండింగ్‌లో ఉందన్నారు. పీడీసీ (పాసు బుక్ డేటా కరెక్షన్)లో రిక్వెస్ట్‌లో భాగంగా క్లాసిఫికేషన్ చేంజ్, ఎక్స్‌టెండ్ కరెక్షన్ కింద ఆన్‌లైన్ దరఖాస్తు చేసినట్లు తెలిపారు. అయితే హౌజ్‌సైట్‌ను పట్టాగా మార్చాలంటే సెమీ అర్బన్ కింద లేదంటే నోషనల్ ఖాతా కింద దరఖాస్తు చేసుకోవాల్సి ఉందని వివరించారు. ఒకే దరఖాస్తు కింద రెండు రిక్వెస్టులు పెట్టడంతో ఆన్‌లైన్ సవరణకు ఆటంకం ఏర్పడిందని స్పష్టం చేశారు.

ప్రభుత్వ పాఠశాలలకు ట్యాబ్‌లు

• స్కూళ్ల సమగ్ర సమాచారం పొందుపర్చడమే లక్ష్యం
• జిల్లాకు చేరిన 443 ట్యాబ్‌లు
• వేసవిలో ఉపాధ్యాయులకు శిక్షణ
• ఇక అన్ని వివరాల నమోదు సులభతరం



ట్యాబ్‌లను పరిశీలిస్తున్న డీఈవో జనార్దన్‌రావు

కరీంనగర్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ట్యాబ్‌లు పంపిణీ చేసేందుకు విద్యాశాఖ సిద్ధమైంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇవి కీలకంగా మారనున్నాయి. పాఠశాలల సమగ్ర సమాచారాన్ని ఒకేచోట ఆన్‌లైన్ చేసేందుకు రాష్ట్రం ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. పాఠశాలల సమాచారాన్ని మొబైల్ ద్వారా యూడైస్ యాప్‌ద్వారా సమాచారాన్ని పొందుపర్చడంలో ఉన్న ఇబ్బందులను గమనించిన ప్రభుత్వం జిల్లాలోని 10 మంది విద్యార్థుల కంటే ఎక్కువగా ఉన్న ప్రతీ పాఠశాలకు ట్యాబ్‌లను అందించనుంది. ఈ క్రమంలో జిల్లాలోని 367 ప్రాథమిక పాఠశాలలకు, 76 ప్రాథమికోన్నత పాఠశాలలకు 443 ట్యాబ్‌లను తొలివిడతలో త్వరలోనే అందించనున్నారు. మరో విడతలో పూర్తిస్థాయిలో రానున్నాయి. ఉపాధ్యాయులకు శిక్షణ అనంతరం వీటిని అందించనున్నారు. ప్రభుత్వం ఒక్క ట్యాబ్‌కు రూ.14,300 ఖర్చు చేయనుంది.


వేసవి సెలవుల్లో శిక్షణ

సాంకేతికంగా పాఠశాల సమాచారాన్ని ఆన్‌లైన్ చేసేందుకు టీచర్లకు అధికారులు శిక్షణ ఇవ్వనున్నారు. వేసవి సెలవుల్లో ట్యాబ్‌లు పొందిన పాఠశాలల నుంచి ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇచ్చి ట్యాబ్‌లను అందించనున్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, మధ్యాహ్న భోజన వివరాలు, మన ఊరు–మన బడి సమాచారం, బాలబాలికల వివరాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఐఎస్ఎంఎస్ పోర్టల్, చైల్డ్ ఇన్ ఫో ఎంట్రీ చేయనున్నారు. రానున్న రోజుల్లో పాఠశాలల పూర్తి సమాచారాన్ని డిజిటలైజేషన్ చేయనున్నారు.

జిల్లాకు చేరిన ట్యాబ్‌లు

జిల్లాకు మంజూరైన ట్యాబ్‌లు ఇప్పటికే విద్యాశాఖ కార్యాలయానికి చేరుకున్నాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి అందిస్తాం. పాఠశాలలకు సంబంధించిన ప్రతీ సమాచారాన్ని ట్యాబ్‌ల్లో సమగ్రంగా పొందుపర్చాలి.
– సీహెచ్ జనార్దన్‌రావు, డీఈవో

తిమ్మాపూర్‌లో ఆర్టీసీ బలగాలు



బస్టాండ్ వద్ద భారీగా మోహరించిన ఆర్టీసీ సిబ్బంది

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఆర్టీసీ అధికారులు గురువారం సాయంత్రం భారీగా బలగాలను దింపారు. బస్టాండ్ ఆవరణలో గతేడాది అనుమతి లేకుండా అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం ఉండడంతో భారీగా ఆర్టీసీ గార్డులను మోహరించారు. పక్కనే పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికీ ఈనెల 5న జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఉన్న ముసుగు తొలగించి పూలమాల వేశారు. పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో అంబేడ్కర్ విగ్రహాన్ని కూడా శుక్రవారం ఆవిష్కరిస్తారన్న సమాచారంతో సుమారు 200 మంది ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది వచ్చారు. వారికి ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.


తాగునీటి కోసం ఆందోళన



బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

తిమ్మాపూర్: తాగునీటి కోసం పచ్చునూర్ గ్రామస్తులు గురువారం ఆందోళనకు దిగారు. గ్రామంలో తాగునీటి సరఫరాకు రెండు బావులు, నాలుగు బోర్లు ఉన్నా నీటిసరఫరా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యదర్శి, సర్పంచ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ సిబ్బందికి వేతనం ఇవ్వకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని ఆరోపించారు. సర్పంచ్ ఉమారాణి వివరణ కోరగా వారం రోజులుగా సెలవులు ఉండడంతో ఈనెల జీవితం ఇవ్వడం ఆలస్యం అయిందని తెలిపారు. గ్రామానికి పర్మినెంట్ కార్యదర్శి లేకపోవడంతో ఇబ్బంది ఎదురైందని వివరించారు. డీఎల్పీవో హరికిషన్ గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు.

రాజ్యాంగ పరిరక్షణకు సీఐటీయూ పాదయాత్ర



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

కరీంనగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కళాభారతి నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ, కుల వివక్ష నిర్మూలన, కనీస వేతనాలు అమలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీ పోస్టుల భర్తీ, రిజర్వేషన్ల సాధన కోసం పాదయాత్ర నిర్వహించినట్లు తెలిపారు. చట్టాలు పాలకుల వరకే పరిమితం కాకుండా ప్రజలందరికీ ఉపయోగపడాలని అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారని తెలిపారు. కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబించిందని, 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని మండిపడ్డారు. దళితులు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాలకు చెందిన వారిని రాజ్యాంగానికి దూరం చేసి, ఆర్ఎస్ఎస్ భావజాలంలోకి తీసుకెళ్లడానికి నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. అణచివేత, కుల వివక్ష, అంటరానితన నిర్మూలన, సమానత్వం కోసం సీఐటీయూ పోరాటాలు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుంద రెడ్డి, ఉపాధ్యక్షులు గుడికందుల సత్యం, యు.శ్రీనివాస్, రాజమల్లు, సహాయ కార్యదర్శి పున్నం రవి, కోశాధికారి జి.రాజేశం, నాయకులు పాల్గొన్నారు.





చెట్టుకొకరు.. పుట్టకొకరు..

• ఉద్యోగార్థుల కష్టాలు మళ్లీ మొదలు



టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కారణంగా పరీక్షల రద్దుతో నిరుద్యోగులు మరోమారు గ్రంథాలయం, స్టడీ సర్కిల్ బాట పట్టారు. మరోవైపు ప్రభుత్వం నిరుద్యోగుల కోసం అన్ని వసతులు కల్పిస్తామని ఇచ్చిన హామీలు గాలిలో కలిశాయి. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో చెట్టుకొకరు.. పుట్టకొకరు.. అన్నట్లు మండుతున్న ఎండలో చెమటలు కక్కుతూ ఆరుబయట చెట్లకింద కూర్చొని పుస్తకాలతో కుస్తీపడుతున్నారు. మరికొన్ని స్టడీ సర్కిళ్ల వద్ద ఉదయం 5 గంటల నుంచే కుర్చీలు వేస్తున్నారు. స్టడీ మెటీరియల్ కోసం లైన్‌లో చెప్పులు, బ్యాగులు పెట్టి నిరీక్షిస్తున్నారు.
– సాక్షిఫొటోగ్రాఫర్, కరీంనగర్



క్లుప్తంగా

కరీంనగర్‌వాసికి డాక్టరేట్


వైష్ణవి

శాతవాహన యూనివర్సిటీ(కరీంనగర్): శాతవాహన యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో నగరానికి చెందిన కనుకుంట్ల వైష్ణవికి డాక్టరేట్ ప్రకటించినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ భరత్ ఆధ్వర్యంలో ‘పర్ఫార్మెన్స్ ఆఫ్ ప్రైమరీ అగ్రికల్చర్ కో–ఆపరేటివ్ సొసైటీస్ ఆఫ్టర్ రీకాపిటలైజేషన్ అసిస్టెన్స్’ అనే అంశంపై పరిశోధన చేసినందుకు శాతవాహన యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైష్ణవికి వీసీ ప్రొఫెసర్ ఎస్.మల్లేశ్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హరికాంత్, హెచ్‌వోడీ మనోహర్‌లు గురువారం శుభాకాంక్షలు తెలిపారు.

ఒకరి అదృశ్యం.. కెనాల్‌లో గాలింపు

హుజూరాబాద్: పట్టణంలోని మామిళ్ల వాడకు చెందిన లారీ డ్రైవర్ ఎండీ.షాహిన్ బుధవారం అర్ధరాత్రి అదృశ్యమయ్యాడు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం ఎస్సారెస్పీ కెనాల్ వద్ద వారికి అతని బైక్ కనిపించింది. కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకొని ఉంటాడని, అనుమానిస్తున్నారు. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో ఎస్సారెస్పీ అధికారులను కలిశారు. దీంతో వారు నీటి విడుదల తగ్గించారు. ఇంకా షాహిన్ ఆచూకీ లభించలేదు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


కుమారస్వామి (ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామానికి చెందిన జనగామ కుమారస్వామి(51) నాయీబ్రాహ్మణుడు. వృత్తి రీత్యా గురువారం తన ద్విచక్ర వాహనంపై నర్సయ్యపల్లి వెళ్లాడు. తిరిగి గర్రెపల్లికి వస్తూ నర్సయ్యపల్లి స్టేజీ వద్ద రాజీవ్ రహదారి దాటుతుండగా కరీంనగర్ నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన కుమారస్వామి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

ప్రజలందరూ ఆత్మగౌరవంతో బతకాలి

- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్
- గౌడ, రజక, మున్నూరుకాపు సంఘ భవనాల పనులకు భూమిపూజ


మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: రాష్ట్రంలోని ప్రజలందరూ ఆత్మగౌరవంతో బతకాలని సీఎం కేసీఆర్ ప్రతీ కులానికి ప్రభుత్వ భూమితోపాటు భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. 14వ డివిజన్ సప్తగిరి కాలనీలో గౌడ, రజక, మున్నూరుకాపు సంఘ భవనాల నిర్మాణ పనులకు మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల హయాంలో మున్సిపల్‌లో నిధుల్లేక కరీంనగర్ అభివృద్ధి కుంటుపడిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కరీంనగర్ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ రూ.100 కోట్లు కేటాయించారని అన్నారు. తనను మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల రుణం తీర్చుకునేందుకు నిరంతరం పని చేస్తానని చెప్పారు. మానేరు రివర్ ఫ్రంట్ పనులను ఆగస్టు 15 వరకు పూర్తి చేస్తామన్నారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు దిండిగాల మహేశ్, బోనాల శ్రీకాంత్, తోట రాములు, గుగ్గిళ్ల జయశ్రీ, గందె మాధవి, ఐలేందర్ యాదవ్, బండారు వేణు, భూమాగౌడ్, మాజీ మేయర్ డి.శంకర్ పాల్గొన్నారు.

పల్లె ప్రగతితో గ్రామాల అభివృద్ధి

కరీంనగర్‌రూరల్: పల్లె ప్రగతితో గ్రామాలు అభివృద్ధి సాధిస్తున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. గురువారం రూ.3.68 కోట్లతో బహదూర్‌ఖాన్‌పేట నుంచి తాహెర్‌కొండాపూర్ వరకు బీటీరోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ, రూ.10 లక్షలతో రెడ్డి సంక్షేమ సంఘం ఫంక్షన్‌హాల్, రూ.5 లక్షలతో గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఇటీవల విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిన కిరాణం దుకాణాన్ని పరిశీలించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.లక్ష రుణం మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. తక్షణ సాయంగా రూ.20 వేలు అందించారు. నగునూరులో రూ.40 లక్షలతో చేపట్టనున్న ఉపాధిహామీ రోడ్ల పనులు ప్రారంభించారు. రూ.2.44 కోట్లతో పోచమ్మకుంట నుంచి ఆర్అండ్‌బీ రోడ్డు వరకు చేపట్టనున్న బీటీరోడ్డు పనులకు భూమిపూజ చేశారు. పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. ఎంపీపీ లక్ష్మయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు లలిత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మధు, కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్ పి.శ్యాంసుందర్ రెడ్డి, సర్పంచులు టి.భూమయ్య, మమత, శ్రీధర్, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

వారెంట్ల అమలు వేగవంతం చేయాలి

- అడిషనల్ డీసీపీ చంద్రమోహన్



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ చంద్రమోహన్

కరీంనగర్ క్రైం: వివిధ కేసుల్లో పరారీలో ఉన్న నిందితులపై వారెంట్లను వేగవంతంగా అమలు చేయడం ద్వారా పెండింగ్ కేసుల సంఖ్య తగ్గుతుందని అడిషనల్ డీసీపీ(పరిపాలన) జి.చంద్రమోహన్ అన్నారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో సమన్లు, వారెంట్ల అమలు, మెడికల్ సర్టిఫికెట్ల విభాగాలకు చెందిన పోలీసు అధికారులకు గురువారం కమిషనరేట్ కేంద్రంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమన్లు, వారెంట్లను వేగవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లో ఉంటున్న నిందితులపై వారెంట్లు అమలు చేసేందుకు అవసరమైతే అక్కడికి కూడా వెళ్లాలన్నారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన కేసుల్లో మెడికల్ సర్టిఫికెట్లను సాధ్యమైనంత తొందరగా తీసుకురావాలన్నారు. ప్రజలకు సేవలందించేందుకు లభించే ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. న్యాయస్థానాలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు చెందిన వైద్యాధికారులతో సత్సంబంధాలను కొనసాగించాలని పేర్కొన్నారు. వారెంట్లు, సమన్లు వేగవంతంగా అమలు కావడం, వివిధ రకాల ప్రమాదాల్లో మెడికల్ సర్టిఫికెట్లు నిర్ణీత వ్యవధిలోపు అందజేస్తే నిందితులు శిక్షింపబడటంతోపాటు బాధితులకు న్యాయం చేసినవారవుతారని చెప్పారు. ఇందులో కీలకపాత్ర పోషించే అన్ని స్థాయిలకు చెందిన అధికారులకు రివార్డులు అందిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఏసీపీలు పి.కాశయ్య, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కోర్టుకు హాజరై వివరణ ఇవ్వండి

- కరీంనగర్–2 సీఐకి హైకోర్టు ఆదేశం
- కోర్టు ధిక్కరణ కేసులో వాదనలు

సాక్షి, హైదరాబాద్: కోర్టు ధిక్కరణ కేసులో ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలంటూ కరీంనగర్ సీఐ(కరీంనగర్–2) లక్ష్మీబాబుకు హైకోర్టు గురువారం నోటీసులు జారీ చేసింది. ఈ నెల 21వ తేదీన కోర్టుకు వ్యక్తిగతంగా హాజరై, వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. ఈ కేసులో ప్రతీ వాయిదాకు గైర్హాజరు కాకుండా.. విధిగా హాజరు కావాల్సిందేనని ఆదేశించింది. 2022, ఆగస్టు 10న ఉదయం 11 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 9 గంటల వరకు తనను చట్టవిరుద్ధంగా కరీంనగర్ సీఐ స్టేషన్‌లో ఉంచారని, అసభ్యకరంగా మాట్లాడటంతోపాటు చేయిచేసుకున్నారని నూగూరి వంశీకృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇదంతా స్టేషన్ సీసీ కెమెరాల్లో రికార్డయిందని చెప్పారు. అలాగే ఎలాంటి వారెంట్ ఇవ్వకుండా పోలీసులు తన ఇంటిపై దాడి చేసి, ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు తీసుకున్నారన్నారు. దీనికి సంబంధించి ఎలాంటి పంచనామా, సీజ్ ప్రక్రియను పాటించలేదని పేర్కొన్నారు. డాక్యుమెంట్లను కాల్చేస్తానని బెదిరించినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. ఆయా తేదీలకు సంబంధించి సీసీటీవీ ఫుటేజీని సమర్పించాలని ఆదేశించింది. అయినా సీఐ సమర్పించకపోవడంతో పిటిషనర్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ టి.వినోద్ కుమార్ విచారణ చేపట్టారు. కరీంనగర్–2 పోలీస్ స్టేషన్‌లో సీసీటీవీలను నవంబర్‌లో ఏర్పాటు చేశారని జీపీ వాదించారు. అయితే 2018లో సీసీటీవీలు ఉన్న స్టేషన్‌గా కరీంనగర్–2ను పేర్కొంటూ మోడల్ స్టేషన్ ప్రకటించారన్న విషయాన్ని పిటిషనర్ న్యాయవాది గుర్తు చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. సీఐని వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశిస్తూ.. విచారణను వాయిదా వేశారు.

నిండు నూరేళ్లు సల్లగుండు బిడ్డా!

- భూమికి సంబంధించిన డబ్బుల విషయంలో చొరవపై బాధితుల హర్షం
- సీపీ సుబ్బారాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం


సీపీ చిత్రపటం వద్ద శ్యామలాదేవి

కరీంనగర్ క్రైం: ఏ తల్లి కన్నబిడ్డవో దేవుడి రూపంలో వచ్చి నా బాధ తీర్చినావు.. నువ్వు నిండు నూరేళ్లు సల్లగుండు బిడ్డా అంటూ నగరంలోని ఓ వృద్ధురాలు, ఆమె కుటుంబసభ్యులు సీపీ ఎల్.సుబ్బారాయుడు చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం అనంతసాగర్‌కు చెందిన ఎన్.శ్యామలాదేవి పేరిట 56 ఎకరాల భూమి ఉండేది. ఇందులో 46 ఎకరాలను 2016లో హైదరాబాద్‌కు చెందిన తిరుపతయ్య ఎకరాకు రూ.2.7 లక్షల చొప్పున విక్రయించగా అడ్వాన్స్‌గా రూ.30 లక్షలు చెల్లించాడు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రోజు మొత్తం డబ్బులు ఇస్తానని చెప్పాడు. అయితే తన వద్దకు డబ్బులు తీసుకువస్తున్న తన బంధువుల వాహనం పాడైపోయిందని శ్యామలాదేవిని నమ్మించాడు. తనకు తెలిసిన వ్యక్తి వేణుగోపాల్ పేరు మీద ఉన్న రెండు చెక్కులు, డీడీలను ఆమెకు ఇచ్చాడు. మరుసటిరోజు వచ్చి, నగదు చెల్లించి వాటిని తీసుకుంటానని చెప్పడంతో అంగీకరించింది.

ఫోన్ చేసినా స్పందించలేదు..

కానీ తర్వాత డబ్బులు చెల్లించకుండా దాటవేస్తూ వచ్చాడు. పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. చివరకు చెక్కులను బ్యాంకులో వేయగా సదరు ఖాతా పని చేయడం లేదని అధికారులు తెలిపారు. కొన్ని రోజులకు తిరుపతయ్యను వెతుక్కుంటూ హైదరాబాద్‌కు వెళ్లి, డబ్బులు అడగగా ఇస్తానంటూ నమ్మించాడు. చివరకు తన వద్దకు వస్తే చంపేస్తానని బెదిరించాడు. 15 రోజుల క్రితం శ్యామలాదేవి తన కుటుంబసభ్యులతో కలిసి కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు వద్దకు వచ్చి, జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసింది. స్పందించిన ఆయన టాస్క్‌ఫోర్స్ పోలీసులతో విచారణ జరిపించారు. వృద్ధురాలికి అన్యాయం జరిగిందని తేలడంతో తిరుపతయ్యను పిలిపించారు. క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించడంతో అతను శ్యామలాదేవికి ఇవ్వాల్సిన డబ్బులు ఇస్తానన్నాడు. దీంతో ఏడేళ్లుగా తమకు రావాల్సిన డబ్బుల కోసం ఎందరినో కలిశామని ఆమె తెలిపింది. సీపీ చొరవతో న్యాయం జరిగిందని సంతోషం వ్యక్తం చేసింది. ఆయన ఎక్కడున్నా చల్లగా ఉండాలంటూ తన ఇంట్లో సీపీ సుబ్బారాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసింది.

భార్యతో గొడవపడి వ్యక్తి బలవన్మరణం

కొత్తపల్లి(కరీంనగర్): రేకుర్తిలోని ఇందిరమ్మ కాలనీలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు కొత్తపల్లి ఎస్సై బి.ఎల్లయ్యగౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గన్నేరువరం మండలంలోని చీమలకుంటపల్లికి చెందిన గాదె రాము(38) రేకుర్తిలోని ఇందిరమ్మ కాలనీలో భార్యాపిల్లలతో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో తాగుడు బానిసైన రాము పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్న భార్యతో తరచూ గొడవ పడేవాడు. బుధవారం రాత్రి కూడా గొడవ పడగా ఆమె పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. గురువారం ఉదయం 6.30 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూడగా రాము ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. మృతుడి భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జరిమానా

కొత్తపల్లి(కరీంనగర్): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని కోనాపూర్‌కు చెందిన జాడ ఓజాలుకు విద్యుత్ చౌర్యం కేసులో జిల్లా కోర్టు జరిమానా విధించినట్లు విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఓజాలు తన ఇంటికి ఎలాంటి అనుమతి లేకుండా విద్యుత్‌ను వాడుతూ అధికారులకు పట్టుబడ్డాడు. వారు మొదటి నేరంగా పరిగణించి, రూ.1,000 జరిమానా విధించి, వదిలేశారు. కానీ అతను మళ్లీ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ పట్టుబడగా కేసు నమోదు చేసి, గురువారం కోర్టులో హాజరుపరిచారు. జగిత్యాల జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి కె.వీరయ్య ఎదుట ఓజాలు నేరం అంగీకరించాడు. దీంతో అతనికి రూ.47,544 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు. విజిలెన్స్ ఎస్సైలు నిరంజన్‌రెడ్డి, నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- ఇద్దరికి గాయాలు

కరీంనగర్‌క్రైం: బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌కు చెందిన జేడీ సాయికిరణ్(22) పేయింటింగ్ వర్క్ చేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం రాత్రి 11 గంటలకు అతని స్నేహితుడు కార్తీక్ తన బర్త్ డే ఉందని, కేక్ కట్ చేద్దామని బైక్‌పై సాయికిరణ్‌తోపాటు అతని అన్న సాయికుమార్‌ను తీసుకొని, మానేరు డ్యాం వైపు వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున తిరిగి వస్తుండగా ఎన్టీఆర్ చౌరస్తా వద్ద కరీంనగర్ వైపు వస్తున్న లారీ వెనక నుంచి వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సాయికిరణ్ అక్కడికక్కడే మృతిచెందగా సాయికుమార్, కార్తీక్‌లకు గాయాలయ్యాయి. మృతుడి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

నాడు కుమారుడు.. నేడు తండ్రి

- చింతచెట్టు పైనుంచి పడి మృతి
- ముత్తారంలో ఘటన

శంకరపట్నం(మానకొండూర్): ముత్తారంలో కొమిరె రవి గతంలో చింతచెట్టు పైనుంచి పడి మృతిచెందగా ప్రస్తుతం అతని తండ్రి కూడా అలాగే చనిపోయాడు. వివరాల్లోకి వెళ్తే.. ముత్తారం గ్రామానికి చెందిన కొమిరె వెంకటి ఈ నెల 9న చింతకాయ దులిపేందుకు చింతచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కాగా వెంకటి కుమారుడు రవి సైతం 2008లో చింతచెట్టు పైనుంచి పడి, మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. తండ్రీకుమారుడు ఒకేలా చనిపోవడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

పశువులకు సత్వర వైద్య సేవలందించాలి

- తెలంగాణ రాష్ట్ర 1962 ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ బాగిష్


రికార్డులు పరిశీలిస్తున్న మేనేజర్ బాగిష్

మానకొండూర్: పశువులకు అనారోగ్య సమస్యలున్నాయని సమాచారం అందిన వెంటనే సిబ్బంది పశువైద్యశాల వాహనంలో వెళ్లి, సత్వర వైద్య సేవలందించాలని తెలంగాణ రాష్ట్ర 1962 ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ బాగిష్ అన్నారు. మానకొండూర్ మండల కేంద్రంలో సంచార పశు వైద్యశాల వాహనాన్ని, రికార్డులను గురువారం ఆయన పరిశీలించారు. ప్రతినెలా ఎన్ని కేసులు వస్తున్నాయని, సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

హత్య కేసులో నేరస్తుడికి ఐదేళ్ల జైలు

కరీంనగర్‌క్రైం: పాత గొడవలు దృష్టిలో పెట్టుకొని, చిన్న విషయంలో గొడవపడి, కర్రతో ఓ వ్యక్తి తలపై బాది, హత్య చేసిన కేసులో గొర్రెంకల రాజయ్యకు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ జిల్లా జడ్జి బి.ప్రతిమ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. మానకొండూరు మండలంలోని గట్టుదుద్దెనపల్లికి చెందిన గొర్రెంకల శ్రీనివాస్(34), రాజయ్య అన్నదమ్ముల కొడుకులు. వీరి ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. ఇద్దరి మధ్య పాత ఇల్లు కొనుగోలు, విక్రయం విషయంలో గొడవ జరిగింది. దీంతో శ్రీనివాస్‌పై రాజయ్య కక్ష పెంచుకున్నాడు. 2017 జూన్ 6న శ్రీనివాస్ భార్య పుష్పలత ఇంట్లోని చెత్తను ఊడ్చి, రోడ్డుపై వేయగా అది గాలికి రాజయ్య ఇంటివైపు వెళ్లింది. దాంతో రాజయ్య, అతని కుటుంబ సభ్యులు శ్రీనివాస్ ఇంటి ముందుకువచ్చి తిడుతుండగా శ్రీనివాస్ అడ్డు వెళ్లాడు. కోపోద్రిక్తుడైన రాజయ్య కర్రతో అతని తలపై బాది, తీవ్రంగా గాయపరిచాడు. బాధితుడిని కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతిచెందాడు. మృతుడి భార్య మానకొండూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా రాజయ్యతోపాటు అతని అన్న కొడుకు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశారు. సీఐ కరుణాకర్ దర్యాప్తు జరిపారు. ఈ కేసులో సాక్షులను సీఎంఎస్ ఏఎస్సై తిరుపతి కోర్టులో ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ పక్షాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ వింజమూరి వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి రాజయ్యను దోషిగా తేల్చి, జైలుశిక్ష, జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించారు. మరో నిందితుడు శ్రీనివాస్‌పై నేర నిరూపణ జరగకపోవడంతో అతనిపై కేసు కొట్టివేశారు.

శిక్షణలో మరిన్ని మెలకువలు నేర్చుకోవాలి


సిమ్యులేటర్ నడుపుతున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): శిక్షణలో మరిన్ని మెలకువలను నేర్చుకుని, రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పని చేయాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ సూచించారు. శిక్షణ పొందిన అసిస్టెంట్ మెకానికల్ ఫోర్‌మెన్‌లను ఆయన అభినందించారు. 12 రోజులపాటు కొనసాగిన శిక్షణ గురువారం ముగిసింది. సూపర్‌వైజర్లు బాధ్యతతో ముందుకు సాగాలని జీఎం అన్నారు. పనిస్థలాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఆర్‌డీ జీఎం వెంకటేశ్వర్‌రావు, ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్‌రావు, ఇంజినీర్ రామ్మూర్తి, టీటీసీ మేనేజర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వంతెన సమీపంలో అంబేడ్కర్ విగ్రహం

- గతంలో అల్గునూర్ చౌరస్తాలో ఏర్పాటు చేస్తామన్న ఎమ్మెల్యే రసమయి
- సమాధానం చెప్పాలని దళిత సంఘాల నాయకుల డిమాండ్


వంతెన వద్ద అంబేడ్కర్ కాంస్య విగ్రహం

తిమ్మాపూర్(మానకొండూర్): అల్గునూర్ చౌరస్తాలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని రాజీవ్ రహదారి విస్తరణలో భాగంగా తొలగించారు. అక్కడే మూలన పెట్టారు. తర్వాత దళిత సంఘాల ఒత్తిడితో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని చౌరస్తాలో ఏర్పాటు చేస్తామని, దానికి అంబేడ్కర్ సర్కిల్‌గా నామకరణం చేస్తామని ప్రకటించారు. ఈ మేరకు మూడేళ్ల క్రితం శంకుస్థాపన కూడా చేశారు. కాంస్య విగ్రహం వచ్చింది.. కానీ దాన్ని సర్కిల్‌లో కాకుండా వంతెన సమీపంలో ఏర్పాటు చేస్తున్నారు. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకు మూలన ఏర్పాటు చేస్తున్నారో చెప్పాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అంబేడ్కర్ దళితుడు అయినందునే విగ్రహాన్ని వంతెన వద్ద ఏర్పాటు చేస్తున్నారన్న చర్చ జరుగుతోంది. దీనికి ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ


వివరాలు సేకరిస్తున్న సీఐ శ్రీధర్, ఎస్సై ప్రమోద్ రెడ్డి

జమ్మికుంట(హుజూరాబాద్): తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి, 50 గ్రాముల బంగారు, వెండి ఆభరణాలతోపాటు రూ.15 వేలు చోరీ చేసిన ఘటన జమ్మికుంటలో చోటుచేసుకుంది. పట్టణ సీఐ బార్పటి రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గుడివాడ సుధాకర్ 40 ఏళ్ల క్రితం జమ్మికుంట పట్టణానికి వచ్చి, కుటుంబంతో కలిసి ఇక్కడే స్థిరపడ్డాడు. స్థానికంగా టిఫిన్ సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఐదు రోజుల క్రితం స్వగ్రామమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా తెనాలికి వెళ్లాడు. గురువారం జమ్మికుంటలోని ఇంటికి రాగా ఇంటి తాళం పగులగొట్టి, తలుపులు తీసి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూసి, దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకున్నారు. పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ రమేశ్, క్లూస్ టీం సంఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

రామకృష్ణకాలనీలో 15 తులాల ఆభరణాలు..

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని రామకృష్ణకాలనీకి చెందిన సిరికొండ రామారావు ఇంట్లో దొంగలు పడి, 15 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. రామారావు మూడు రోజుల క్రితం తన కుటుంబసభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లగా బీరువా తెరిచి ఉంది. అందులోని ఆభరణాలు కనిపించకపోవడంతో చోరీ జరిగిందని గుర్తించి, ఎల్ఎండీ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్సై ప్రమోద్ రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం సీఐ ముద్దసాని శ్రీధర్, సభ్యులతో కలిసి వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని సీఐ వర్ష రమేశ్ తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- ఎల్ఎండీలోని వ్యవసాయ బావిలో మునిగి విద్యార్థి మృతి
- మృతుడి స్వస్థలం పెద్దపల్లి


బాలరాజు మృతదేహం

తిమ్మాపూర్(మానకొండూర్): లోయర్ మానేరు డ్యాంలోని బావిలో ఈతకు వెళ్లి, పాలిటెక్నిక్ విద్యార్థి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలోని సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద ఎల్ఎండీలో ఉన్న వ్యవసాయ బావిలో సరదాగా ఈత కొట్టేందుకు గురువారం 20 మంది విద్యార్థులు వెళ్లారు. వీరు మండల కేంద్రంలోని ఎస్ఆర్ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ పాలిటెక్నిక్ సెకండ్ ఇయర్ చదువుతున్నారు. నీలపు బాలరాజు(18) బావిలో దిగగా ఈత రాకపోవడంతో గల్లంతయ్యాడు. వెంటనే అతని స్నేహితులు బావిలో దిగి, వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భయపడి, వెంటనే 100కు కాల్ చేశారు. సమాచారం అందుకున్న ఎల్ఎండీ పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలం వద్దకు చేరుకొని, గాలింపు చర్యలు చేపట్టారు. బాలరాజు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు పెద్దపల్లివాసిగా గుర్తించారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రమోద్ రెడ్డి తెలిపారు.

భార్యను కత్తెరతో పొడిచిన భర్త

- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు

కరీంనగర్‌క్రైం: ఓ వ్యక్తి తన భార్యను కత్తెరతో పొడిచాడు. వన్‌టౌన్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని లక్ష్మీనగర్‌కు చెందిన జిల్లా సంతోష్‌కు సిద్దిపేటకు చెందిన హారతితో 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ దంపతులు టవర్ సర్కిల్‌లో ఫ్యాబ్రిక్ షాపు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చి, ఏడాదిగా వేర్వేరుగా ఉంటున్నారు. పిల్లలు మాత్రం సంతోష్ వద్ద ఉంటున్నారు. అదనపు వరకట్నం కావాలని గతేడాది అక్టోబర్‌లో అతను తన భార్యను కొట్టి, ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. తర్వాత హారతి సంతోష్‌పై పెట్టిన అదనపు వరకట్న వేధింపులతోపాటు వివిధ కేసులు కోర్టులో నడుస్తున్నాయి. గురువారం మధ్యాహ్నం ఆమె టవర్ సర్కిల్‌లోని ఫ్యాబ్రిక్ షాపునకు వెళ్లి, తన పిల్లలను చూపించాలని భర్తను అడిగింది. దీంతో అతను ఆవేశంతో అక్కడే ఉన్న కత్తెర తీసుకొని, హారతిని పొడవగా ఆమెకు గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబసభ్యులు బాధితురాలిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. ఈ విషయమై హారతి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నూతనంగా నిర్మించిన రాష్ట్ర సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడం, 125 అడుగుల అంబేడ్కర్ మహా విగ్రహాన్ని ఆవిష్కరించడాన్ని పురస్కరించుకొని సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు అయాచితం శ్రీధర్ ప్రకటన మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కవి సమ్మేళనాలు, వ్యాసరచన పోటీల నిర్వహణలో భాగంగా వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అనిల్ పుస్తకాలు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ సిబ్బంది, కవులు, రచయితలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): జ్యోతిష్మతి అటానమస్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం ప్లాస్టిక్ వాడకంతో వచ్చే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సుమారు 100 మంది విద్యార్థులు నగరంలోని కోర్టు చౌరస్తా నుంచి ప్రారంభించి 10 డివిజన్లలో వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బండ సుమ, జంగిలి సాగర్, భూమాగౌడ్, అధ్యాపకులు విశ్వప్రకాశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కరీంనగర్‌రూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ గురువారం బహదూర్‌ఖాన్‌పేటలో రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను కరీంనగర్ మండలానికి చెందిన కార్యదర్శులు కలిసి వినతిపత్రం అందజేశారు. నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలాన్ని పూర్తి చేసుకున్న దృష్ట్యా వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు.

ముగిసిన క్రీడా పోటీలు



బహుమతులు అందజేస్తున్న రవీందర్‌రావు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న కిమ్స్ కళాశాల విద్యార్థుల క్రీడాపోటీలు గురువారం ముగిశాయి. సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా కిమ్స్ కళాశాల చైర్మన్ పేర్యాల రవీందర్‌రావు, వైస్ చైర్మన్ సాకేత్‌రావులు హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. విద్యార్థుల మానసిక, శారీరక ఉల్లాసానికి క్రీడలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ అర్జున్‌రావు, అనూష్‌రెడ్డి, రవీంద్రాచారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణంలో జాప్యంపై నిరసన



విద్యానగర్(కరీంనగర్): స్మార్ట్‌సిటీ పనుల్లో భాగంగా నగరంలోని 30వ డివిజన్ హనుమాన్ ఆలయం వద్ద నిర్మిస్తున్న డ్రెయినేజీ పనుల్లో జాప్యాన్ని నిరసిస్తూ గురువారం టీడీపీ నాయకులు నిరసన ప్రదర్శన చేశారు. తెలుగుదేశం పార్టీ కరీంనగర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కళ్యాడపు ఆగయ్య, పార్టీ నాయకులు ఎర్రవెల్లి రవీందర్, మల్లేశం, సాయిల్ల రాజమల్లయ్య, ఎర్రవెల్లి వినీత్, నార్ల శ్రీనివాస్, తిరుపతయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కమలాకర్

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం బద్దిపల్లిలోని స్వయంభూ శ్రీ అలివేలు మంగా లక్ష్మి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను గురువారం కరీంనగర్‌లోని మీసేవా కార్యాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఆవిష్కరించారు. శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఈనెల 24 నుంచి 27 తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పు తిరుపతి, సర్పంచ్ రాచమల్ల మధు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 26న సాయంత్రం 6.35 గంటలకు శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ వైస్‌చైర్మన్ ఉప్పు రాజశేఖర్, ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు తాండ్ర శ్రీనివాస్, కూన నాగరాజు, కోశాధికారి గోలి రాజు, పెరుగ శ్రీకాంత్, రాచమల్ల కరుణాకర్, పి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మహనీయుల జయంతి



మహనీయుల ఫొటోలతో విద్యార్థులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లోని మూడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో గురువారం మహనీయులు బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహనీయుల జీవిత చరిత్రను స్ఫూర్తిగా తీసుకోవాలని తాండ్ర అంజన్న చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తాండ్ర మధుకర్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం జరిగే అంబేడ్కర్ జయంతి వేడుకలకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డుసభ్యులు పోతర్ల క్రాంతికుమార్, మీసాల మహేశ్వరి, సురేశ్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొలువు చూపిన ఖాకీలు!

- కరీంనగర్ పోలీసుల ఆధ్వర్యంలో మెగాజాబ్ మేళా
- భారీగా తరలివచ్చిన నిరుద్యోగులు
- వెయ్యి మంది ఉద్యోగాలకు ఎంపిక
- ట్రాన్స్‌జెండర్లకూ చాన్స్



ఇంటర్వ్యూలకు హాజరైన యువత

కరీంనగర్‌క్రైం: నిరుద్యోగ యువతకు చేయూత నివ్వడానికి కరీంనగర్ పోలీసులు శ్రీకారం చుట్టారు. పోలీసుల ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాలు నిర్వహించి ఉద్యోగ సాధనకు బాటలు వేస్తున్నారు. పదోతరగతి నుంచి మొదలు కొని పీజీ వరకు కోర్సులు చేసిన నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సుమారు 120 కంపెనీలను ఆహ్వానించి ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించగా ఇందులో 4 వేల మంది హాజరయ్యారు.

వెయ్యి మందికి ఉద్యోగాలు

కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణమండపం వేదికగా మంగళవారం పోలీసులు నిర్వహించిన మెగాజాబ్ మేళాకు కరీంనగర్ జిల్లాతో పాటు వివిధ జిల్లాల నుంచి సైతం నిరుద్యోగులు హాజరయ్యారు. నాలుగు వేల మంది హాజరు కాగా వెయ్యి మంది ఉద్యోగాలు పొందారు. బైజూస్, విప్రో, జెన్‌పాక్, హెచ్‌సీఎల్, క్లస్టర్, ఎయిర్ ఇండియా, ఇండియన్ ఎయిర్ లైన్స్, ఇండిగో, హెటిరో, అరబిందో, అపోలో, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, ఎస్‌బీఐ, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌తో పాటు సుమారుగా 120 కంపెనీలు పాల్గొన్నాయి. ఇదిలా ఉండగా ఈసారి కొత్తగా ట్రాన్స్‌జెండర్లు హాజరై 10 మంది ఉద్యోగాలు సాధించారు. మెగాజాబ్ మేళాలో ఉద్యోగాలు సాధించిన వారికి రూ.20 వేల నుంచి రూ 50 వేల వరకు జీతాలున్నాయని పోలీసు అధికారులు తెలిపారు



ఉద్యోగాలు సాధించిన ట్రాన్స్‌జెండర్లు


ఫర్టిలైజర్ కంపెనీలో ఉద్యోగం



పోలీసులు నిర్వహించిన మెగా జాబ్ మేళాలో నాకు ఫర్టిలైజర్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. సేల్స్ రిప్రజెంటేటివ్ విభాగంలో ఉద్యోగం సాధించా. చాలా మంది నిరుద్యోగులకు మేళాలో ఉద్యోగాలు వచ్చాయి. థ్యాంకు కరీంనగర్ పోలీస్.

– సుప్రియ, కరీంనగర్

నాతో పాటు పది మంది ట్రాన్స్‌జెండర్లకు..



పోలీసులు నిర్వహించిన మెగా జాబ్ మేళాలో చాలా మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చాయి. నాకు అమెజాన్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. నాతో పాటు పది మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు వచ్చాయి. – గోల్డి, ట్రాన్స్‌జెండర్


ఉద్యోగాలు ఇప్పించడం సంతోషకరం



కరీంనగర్ పోలీసులు మెగా జాబ్ మేళాతో వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు చూపిస్తూ అండగా నిలుస్తున్నారు. పోలీసుల ఆధ్వర్యంలో వివిధ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు ఇప్పించడం సంతోషకరం.

– మహేశ్, మానకొండూర్

నిరుద్యోగులకు చేయూత



పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు 120 కంపెనీలకు పైగా ఆహ్వానించి పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించి 1,000 మంది వరకు ఉద్యోగాలు కల్పించాం. యువత ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. దురలవాట్లకు దూరంగా ఉండాలి.

– ఎల్.సుబ్బారాయుడు, కరీంనగర్ సీపీ

చిత్ర కథ: బెడ్ షీట్లు కరువాయె..



కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని పిల్లల వార్డులో బెడ్‌షీట్లు లేక చినిగిన రెగ్జిన్ పరుపులపైనే రోగులను పడుకోబెట్టి వైద్యం చేస్తున్నారు. వేసవి కాలంలో ఒక పక్క వేడి, మరో పక్క కొబ్బరి పీచుపై పడుకోవడంతో పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బెడ్‌షీట్లు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

యువత భవితకు పునాది వేసేందుకు కృషి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్: యువతీ యువకుల బంగారు భవిష్యత్‌కు పునాది వేసేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిరుద్యోగ యువతకు వివిధ పోటీ పరీక్షల కోసం ఏడేళ్లుగా నిర్వహిస్తున్న రీడింగ్ సెంటర్‌ను గురువారం సందర్శించారు. చదువు ఎలా కొనసాగిస్తున్నారో తెలుసుకొని అభ్యర్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అభ్యర్థుల జీకే పరిజ్ఞానాన్ని పరీక్షించారు. సెంటర్‌లో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాగా చదువుకొని తల్లిదండ్రులకు, రాష్ట్రానికి, దేశానికి మంచిపేరు తీసుకరావాలని అన్నారు. సెంటర్‌కు అవసరమైన మరిన్ని పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్‌ను సమకూర్చుతున్నట్లు తెలిపారు. వేసవిలో అందరికీ ఉచితంగా లస్సీని అందజేయనున్నట్లు వెల్లడించారు. వినోద్‌కుమార్ వెంట బీఆర్‌ఎస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు జక్కుల నాగరాజుయాదవ్, మేయర్ సునీల్‌రావు, విద్యార్థి జిల్లా కోఆర్డినేటర్ మధుసూదన్‌రెడ్డి, కార్పొరేటర్ ఫిరోజ్‌ఖాన్, సంపత్‌గౌడ్, సాయికృష్ణ, ప్రభాకర్, ఓంకార్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాల శుద్ధి



అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధి చేస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా పిలుపు మేరకు, అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని కరీంనగర్‌లో గురువారం ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సోమిడి వేణుప్రసాద్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలను శుద్ధి చేసి బైక్ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని కోర్టు చౌరస్తా, మంచిర్యాల రోడ్ ఆదర్శనగర్, రేకుర్తి చౌరస్తాల్లోని అంబేడ్కర్ విగ్రహాలను శుద్ధి చేసి నివాళులర్పించారు. అతిథులుగా బీజేపీ కరీంనగర్ పార్లమెంటు కన్వీనర్ ప్రవీణ్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డిలు హాజరై మాట్లాడారు. కేసీఆర్ దళితులను ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారని ఆరోపించారు. దళితుల మీద ఎలాంటి ప్రేమ లేదని, మళ్లీ మోసం చేసేందుకు సిద్ధమయ్యాడని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. బీఆర్‌ఎస్‌ను గద్దె దించేవరకు దళితులంతా ఐక్యమత్యంతో పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

శంకరపట్నం: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బాల్యవివాహాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. వివాహ వయస్సు రాకుండా పెళ్లిళ్లు చేయొద్దని పూజారులు, పాస్టర్‌లకు సూచించారు. ఎంపీడీవో బషీరొద్దీన్, డీపీవో శాంత, పీవో తిరుపతి, రమేశ్, కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న మాలమహానాడు నాయకురాళ్లు

కరీంనగర్: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని మాలమహానాడు ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. దళితబంధు పథకంతో పాటు అంబేడ్కర్ ఆశించిన లక్ష్య సాధన కోసం దళితుల జీవితాల్లో వెలుగుల నింపుతున్న ప్రభుత్వానికి దళితులు రుణపడి ఉంటారని అన్నారు. కార్యక్రమంలో మాల గంటల రేణుక, బొగ్గుల మల్లేశం, విజయ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన డివిజన్‌ల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

- మేయర్ సునీల్‌రావు



పనులు ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌సిటీ: వెనుకబాటుకు గురైన డివిజన్ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని మేయర్ సునీల్‌రావు అన్నారు. గురువారం 18, 26, 35వ డివిజన్‌లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. 35వ డివిజన్ సప్తగిరికాలనీలో రూ.20 లక్షలతో చేపట్టిన ఎస్‌డబ్ల్యూజీ డ్రెయినేజీ పైపులైన్ పనులకు భూమిపూజ చేశారు. 18వ డివిజన్ రేకుర్తి సాలేనగర్‌లో రూ.26 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, ఎస్‌డబ్ల్యూజీ డ్రెయినేజీ పనులను ప్రారంభించారు. 26వ డివిజన్‌లో రూ.12 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, ఎస్‌డబ్ల్యూజీ డ్రెయినేజీ పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. నగరంలో రూ.1200 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. డివిజన్ల వారీగా నిధులు కేటాయిస్తూ నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. నూతనంగా మరో రూ.120 కోట్లతో 330 అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచామని తెలిపారు. చేపట్టిన అభివృద్ధి పనులన్నీ జూన్‌లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో కమిషనర్ సేవా ఇస్లావత్, కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, మాధవి, నక్క పద్మకృష్ణ, ఈఈ మహేందర్, డీఈ మసూద్ అలీ, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ స్పీకర్ శ్రీపాదరావు వర్ధంతి



అన్నదానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌టౌన్: మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు వర్ధంతి వేడుకలను గురువారం కరీంనగర్‌లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శ్రీపాదరావు చిత్రపటానికి, బస్టాండ్ చౌరస్తా వద్ద గల శ్రీపాదరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీపాదరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు స్పీకర్‌గా అందరి మన్ననలు పొందడమే కాకుండా మారుమూల మంథని నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోని నలుమూలల అభివృద్ధికి కృషి చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. అనంతరం బస్టాండ్ వద్ద అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నగారిగారి ప్రీతమ్, నాయకులు మడుపు మోహన్, ఎండీ తాజ్, శ్రావణ్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం విలాస్‌రెడ్డి, కుర్ర పోచయ్య, సయ్యద్ అఖిల్, షబానా మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీపాల్‌రెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఒలింపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో కరీంనగర్‌లోని సిద్దార్థ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు విద్యాసంస్థల డైరెక్టర్ దాసరి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందిన మానిష్‌రెడ్డి, అర్జున్, సాన్వీ, వైష్ణవిరెడ్డి, ప్రహాస్, సాయిచరణ్‌లు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని అన్నారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు.

'యువిక' క్విజ్ పోటీల్లో ప్రతిభ



దేవఆశిష్‌ను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి


కొత్తపల్లి: భారత అంతరిక్ష సంస్థ ఇస్రో నిర్వహించిన 'యువిక' ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్ విద్యార్థి దేవ ఆశిష్ ప్రతిభ కనబరిచి శ్రీహరికోటలోని సతీశ్‌ధావన్ అంతరిక్ష కేంద్రం జరిగే రెండు వారాల శిక్షణ సదస్సు నుంచి ఆహ్వానం అందుకున్నట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం దేవఆశిష్‌ను అభినందించి మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా నుంచి ఒక్క విద్యార్థి మాత్రమే ఆహ్వానం అందుకోవడం గర్వంగా ఉందన్నారు. కాగా విద్యార్థి శిక్షణ సదస్సుకు ఎంపికవ్వడంపై డీఈవో జనార్దన్‌రావు, జిల్లా సైన్స్ అధికారి జయపాల్‌రెడ్డి తదితర అధికారులు అభినందించారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



కరీంనగర్‌రూరల్: పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని గురువారం ఎస్ఎస్ గార్డెన్‌లో ముస్లింలకు బొమ్మకల్ సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సుడా డైరెక్టర్ యూసుఫ్, ఆజ్మత్‌తో పాటు పలువురు ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు





బొమ్మకల్ ఆటోనగర్‌లో వేలాడుతున్న విద్యుత్ తీగలపై గురువారం సాక్షిలో 'ప్రమాదకరంగా విద్యుత్ తీగలు' శీర్షికన ప్రచురితమైన చిత్రకథకు బొమ్మకల్ ఏఈ తిరుపతి స్పందించారు. ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేసేందుకు లైన్‌మెన్ ప్రకాశ్ ఆధ్వర్యంలో సిబ్బంది విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. విద్యుత్ సమస్యలు గుర్తించి పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఏఈ తెలిపారు.

– కరీంనగర్‌రూరల్

మార్గదర్శి కేసులో పారదర్శకంగా దర్యాప్తు

- చందాదారులు, డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యం
- సీఐడీ అదనపు డీజీ సంజయ్



సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో చట్ట ప్రకారమే వ్యవహరిస్తున్నట్లు సీఐడీ అదనపు డీజీ సంజయ్ స్పష్టం చేశారు. పారదర్శకంగా దర్యాప్తు నిర్వహించి వాస్తవాలు వెలికి తీయడమే తమ లక్ష్యమని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చందాదారులు, డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడటమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ప్రజల సంక్షేమం, ప్రయోజనాల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం మౌన ప్రేక్షకులుగా ఉండరాదని 2011లో ఓ కేసులో సుప్రీంకోర్టు ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. మార్గదర్శి చిట్ ఫండ్స్‌లో భారీగా ఆర్థిక అక్రమాలు జరిగాయని గుర్తిస్తూ చట్టబద్ధ సంస్థలు ఇచ్చిన ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యం, ఉద్యోగులు నిబంధనల రికార్డులు, డాక్యుమెంట్లు సీఐడీకి అందచేసి దర్యాప్తునకు సహకరించాలని సూచించారు. గతంలో శ్రీరామ్ చిట్స్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కూడా తమకు ప్రామాణికమన్నారు.

విచారణకు సహకరించాల్సిందే

మార్గదర్శి ఉద్యోగులకు తెలంగాణ హైకోర్టు ఆదేశం

- తనిఖీలు ఆపేలా ఉత్తర్వులివ్వలేం
- మీడియాకు వివరాల వెల్లడిపైనా జోక్యం చేసుకోలేం
- విచారణ రెండు వారాలకు వాయిదా



సాక్షి, హైదరాబాద్: సీఐడీ అధికారుల విచారణకు మార్గదర్శి ఉద్యోగులు సహకరించాల్సిందేనని తెలంగాణ హైకోర్టు తేల్చి చెప్పింది. మార్గదర్శి చిట్ ఫండ్స్ కేంద్ర కార్యాలయ ఉద్యోగులు దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం విచారించిన న్యాయస్థానం.. తనిఖీలు, విచారణను అడ్డుకునేలా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది మీడియాకు అధికారులు వివరాలు వెల్లడించకుండా కూడా జోక్యం చేసుకోలేమని పేర్కొంది. అయితే తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు మార్గదర్శి కేంద్ర కార్యాలయ ఉద్యోగులపై ఎలాంటి కఠినచర్యలు తీసుకోవద్దని ఏపీ సర్కార్‌ను ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

తనిఖీలు ముగిశాక పిటిషనా?

మార్గదర్శి ఉద్యోగులు గురువారం లంచ్‌మోషన్ రూపంలో దాఖలు చేసిన పిటిషన్‌పై మధ్యాహ్నం 2.30 గంటలకు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోకుండా నిరోధించాలని, తనిఖీలు నిలిపివేసేలా ఏపీ సర్కార్‌ను ఆదేశించాలని పిటిషనర్ తరఫు న్యాయవాది విన్నవించారు. అయితే బుధవారం ప్రారంభమైన తనిఖీలు గురువారం ఉదయం 9 గంటలకే ముగిశాయని, అలాంటప్పుడు తనిఖీలు ఆపాలని పిటిషన్ దాఖలు చేయడంలో అర్థం లేదని ఏపీ స్పెషల్ జీపీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. 'సీఐడీ అధికారుల తనిఖీలు ముగిశాయి. ఏ ఉద్యోగిపైనా చర్యలు తీసుకోలేదు. ఎవరినీ బలవంతపెట్టలేదు.. భయపెట్టలేదు. అరెస్టులు చేయలేదు. చట్టప్రకారమే తనిఖీలు జరిగాయి. ఎక్కడా నిబంధనల ఉల్లంఘన జరగలేదు. పలువురు బ్రాంచ్ మేనేజర్లకు, బ్రాంచ్ ఉద్యోగులకు నోటీసులిచ్చాం. కేంద్ర కార్యాలయ ఉద్యోగులకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు' అని హైకోర్టుకు నివేదించారు.

విచారణలో జోక్యం వద్దన్న 'సుప్రీం'..

'ఏ–1 రామోజీరావు, ఏ–2 శైలజ సహా పలువురు మేనేజర్లు ముందస్తు బెయిల్ పొందారు. వారిని కనీసం కస్టడీకి తీసుకునే అవకాశం కూడా ఇవ్వలేదు. చట్టబద్ధమైన సంస్థలు కేసును విచారించే సమయంలో పూర్తి వివరాలను పరిశీలించకుండా కోర్టులు ఎలాంటి ఆదేశాలు ఇవ్వరాదని సుప్రీం కోర్టు పలుమార్లు ఆదేశాలిచ్చింది. నిహారికా ఇన్‌ఫ్రా. వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసుపై విచారణ జరిపిన ముగ్గురు సభ్యుల సుప్రీంకోర్టు బెంచ్ హైకోర్టులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. సెక్షన్ 438 సీఆర్‌పీసీ కింద ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నా ఆ మేరకు ఉత్తర్వులు ఇవ్వకూడదని పేర్కొంది. పిటిషనర్‌కు అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసి 'వెకేట్ పిటిషన్ దాఖలు చేసుకోవాలని ప్రతివాదులను ఆదేశించడం సమర్థనీయం కాదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌లో ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసే వరకు ఎలాంటి రిలీఫ్ ఉత్తర్వులు ఇవ్వవద్దు' అని గోవిందరెడ్డి అభ్యర్థించారు.

ప్రైవేటీకరణపై ముందుకు వెళ్లం

- 'విశాఖ ఉక్కు'పై కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగన్ సింగ్ కులస్తే



కేంద్ర సహాయ మంత్రితో సమావేశమైన ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు

దొండపర్తి (విశాఖ దక్షిణ)/బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై ప్రస్తుతానికి ముందుకు వెళ్లడం లేదని కేంద్ర ఉక్కు, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి ఫగన్‌సింగ్ కులస్తే స్పష్టం చేశారు. గురువారం విశాఖ పోర్టు కళావాణి ఆడిటోరియంలో జరిగిన రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రైవేటీకరణ కంటే ముందు ఆర్‌ఐఎన్‌ఎల్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్)ను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పూర్తి సామర్థ్యం మేరకు ప్లాంట్ పనిచేసే ప్రక్రియపై దృష్టి సారించామని తెలిపారు. గనుల సమస్యను కూడా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఈ విషయాలన్నింటిపై ఆర్‌ఐఎన్‌ఎల్ యాజమాన్యం, కార్మిక సంఘాలతో చర్చిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో సాయంత్రం ఆయన నోవోటెల్‌లో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, కార్మిక సంఘాల నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉదయం చేసిన ప్రకటనపై మరింత క్లారిటీ ఇవ్వాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. ప్లాంట్‌ను మరింత బలోపేతం చేస్తామని మాత్రమే మీడియాకు చెప్పానన్నారు. స్టీల్ ప్లాంట్ లాభాల్లోకి వచ్చేలా సహకరిస్తామన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకొనే అంశం తన చేతుల్లో లేదని, కేంద్ర పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

సింగరేణిలో ఆంధ్ర వాటా తేల్చండి

బీఆర్‌ఎస్ స్టీల్ ప్లాంట్ అంశాన్ని రాజకీయంగా వినియోగించుకుంటోందని ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవ్ అన్నారు. సింగరేణి గనుల్లో ఆంధ్ర రాష్ట్రానికి వాటా ఉందని, ముందు ఆ వాటా తేల్చాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌పై బీఆర్‌ఎస్‌కు అంత చిత్తశుద్ధి ఉంటే పోలవరానికి సహకరించాలన్నారు. అలాగే స్టీల్ ప్లాంట్‌కు రూ.5 వేల కోట్లు నిధులు ఇవ్వాలన్నారు.

రుషికొండలో ఉల్లంఘనల్లేవ్

హైకోర్టుకు నివేదించిన కేంద్ర సంయుక్త కమిటీ

సాక్షి, అమరావతి: రిసార్ట్ ప్రాజెక్టు పునరుద్ధరణలో భాగంగా విశాఖలోని రుషికొండపై చేపడుతున్న నిర్మాణాల్లో ఎలాంటి ఉల్లంఘనలు లేవని హైకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం నియమించిన సంయుక్త కమిటీ స్పష్టం చేసింది. క్షేత్రస్థాయి పర్యటన అనంతరం నివేదికను కమిటీ బుధవారం హైకోర్టుకు సమర్పించింది. కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) అనుమతించిన మేరకు 9.88 ఎకరాల ప్రాంతంలోనే ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ అథారిటీ రుషికొండ రిసార్ట్ ప్రాజెక్టు భవనాలను చేపట్టిందని తెలిపింది. వ్యక్తిగత భవనాల ప్రదేశాల్లో స్వల్ప మార్పులు మినహా ఎలాంటి ఉల్లంఘనలు లేవని కమిటీ తేల్చింది. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ అథారిటీ హైకోర్టుకు సమర్పించిన కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొన్న ప్రకారం దాదాపుగా సరిపోతున్నట్లు పేర్కొంది. మట్టిడంప్ ప్రాంతమే అథారిటీ పేర్కొన్న దానికన్నా కొంచెం ఎక్కువగా ఉందని, అయితే నిర్మాణం పూర్తయిన తరువాత డంప్ చేసిన మట్టిని తొలగిస్తారని కమిటీ తెలిపింది.

ఇంకా ఎన్నాళ్లీ విచారణ?

- సీబీఐ న్యాయవాదిని ప్రశ్నించిన తెలంగాణ హైకోర్టు
- వివేకా హత్య కేసులో తదుపరి విచారణ 17కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తు ప్రారంభించి ఇప్పటికే రెండేళ్లు అయ్యిందని.. ఇంకా ఎన్నాళ్లు విచారిస్తారని సీబీఐని తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. హత్య కేసును కూడా ఇన్నాళ్లు సాగదీస్తే ఎలా అంటూ అసహనం వ్యక్తం చేసింది. దర్యాప్తును త్వరగా పూర్తి చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది. 'వివేకా హత్య కేసు దర్యాప్తులో సీబీఐ చెప్పినట్లు ఏ–4 దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడు. దాని ఆధారంగా నన్ను, మరికొందరిని నిందితులుగా చేర్చే అవకాశం ఉంది. దస్తగిరిని అప్రూవర్‌గా ప్రకటించడాన్ని, బెయిల్ ఇస్తూ కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలి. నన్ను, మరికొందరిని నిందితులుగా చేర్చవద్దని ఆదేశాలు ఇవ్వాలి' అని కోరుతూ వైఎస్ భాస్కర్ రెడ్డి పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ సురేందర్ గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి, సీబీఐ తరఫున నాగేందర్ వాదనలు వినిపించారు.

కొందరిని టార్గెట్ చేసుకునే విచారణ..

'గూగుల్ టేక్ అవుట్, దస్తగిరి వాంగ్మూలం తప్ప కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డిల పేర్ల ప్రస్తావన ఎక్కడా లేదు. వీరికి వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేవు. నేను ఇక్కడే ఉండి.. నా ఫోన్‌ను మరో చోటకు తీసుకుపోతే నేను అక్కడ ఉన్నట్లు కాదు. కాబట్టి గూగుల్ టేక్ అవుట్‌ను పరిగణనలోకి తీసుకోలేం. ఇలాంటి పరిస్థితిలో వారిని వేధింపులకు గురి చేయడం సమర్థనీయం కాదు. ఇప్పటికే సీబీఐ వారిని పలుమార్లు విచారణకు పిలిచింది. వారు కూడా పూర్తిగా విచారణకు సహకరించారు. ఎర్ర గంగిరెడ్డి వాంగ్మూలాన్ని సీబీఐ ఇప్పటివరకు రికార్డు చేయలేదు. సీబీఐ.. దర్యాప్తును ఇంకా సాగదీస్తోంది. కారణం ఏంటో తెలియడం లేదు. కోర్టుల్లో పిటిషన్లు దాఖలైనా దర్యాప్తు ఆపాలని ఏ ధర్మాసనం చెప్పలేదు. దర్యాప్తు అధికారి కేసును తప్పుదారి పట్టిస్తుంటే ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు. ఒక కిరాయి హంతకుడిని అరెస్టు చేయకుండా బెయిల్‌కు సహకరించిన విచారణను ఏమనాలి? కేవలం కొందరిని టార్గెట్ చేసుకునే విచారణ సాగుతోంది తప్ప.. సాక్ష్యాలు సేకరించే పని చేయడం లేదు. వైఎస్ భాస్కర్‌రెడ్డిని నిందితుడిగా చేర్చవద్దని సీబీఐని ఆదేశించాలి' అని నిరంజన్‌రెడ్డి కోర్టుకు నివేదించారు. వైఎస్ భాస్కర్ రెడ్డి, ఇతరులు (నిందితులుగా లేని వారు) పరారీలో ఉన్నారా అని న్యాయమూర్తి ప్రశ్నించారు. లేదు.. విచారణకు పూర్తిగా సహకరిస్తున్నారు అని సీబీఐ తరఫు న్యాయవాది నాగేందర్ తెలిపారు. కోర్టులో పిటిషన్ల కారణంగా కేసు దర్యాప్తు ఆలస్యం అవుతోందన్నారు. దర్యాప్తు అధికారికి.. కోర్టు పిటిషన్లతో ఏం సంబంధం.. ఆయన విచారణ కొనసాగించవచ్చు కదా అని న్యాయమూర్తి ప్రశ్నించారు. సుప్రీంకోర్టు.. దర్యాప్తు పూర్తి చేయడానికి ఈ నెల 30 వరకు అవకాశం ఇచ్చిందని నాగేందర్ తెలిపారు. ఇది హత్య మాత్రమే కాదని.. హత్య ద్వారా లబ్ధి పొందేందుకు కుట్ర జరిగిందని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేశారు.

విహరించే వనంపై మోహరించిన అవినీతి

- కేబీఆర్ పార్క్‌ను కనుమరుగు చేసే కుట్ర
- మంత్రి డెవలపర్స్‌కు 15 అంతస్తుల నిర్మాణాలకు అనుమతి
- కేటీఆర్ మిత్రుల కోసం నిబంధనలు గాలికి
- రాజయ్యను బర్తరఫ్ చేసినట్లు కేటీఆర్‌నూ చేయాలి
- టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ కుటుంబం ధన దాహంతో దశాబ్దాల చరిత్ర కలిగిన కేబీఆర్ పార్కును కనుమరుగు చేసే కుట్రకు తెరతీసిందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆరోపించారు. జూబ్లీహిల్స్ కేబీఆర్ పార్క్ దగ్గర నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా 15 అంతస్తుల నిర్మాణాలకు అనుమతులివ్వడమంటే హైదరాబాద్ నగరంలో విధ్వంసం సృష్టించడమేనని ఆయన వ్యాఖ్యానించారు గాంధీ భవన్‌లో రేవంత్‌రెడ్డి గురువారం మీడియాతో మాట్లాడారు. 16 మంది సీఎంలు కఠిన నిబంధనలు పెట్టి కాపాడిన చరిత్రాత్మక వారసత్వ సంపద కలిగిన పార్కును ఈ ప్రభుత్వ పెద్దలు ధ్వంసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మంత్రి కేటీఆర్ స్నేహితుల కోసం చేస్తున్న ఈ ఆగడాలను కేసీఆర్ వెంటనే అడ్డుకోవాలని రేవంత్ డిమాండ్ చేశారు మంత్రి రాజయ్యను బర్తరఫ్ చేసినట్టు కేటీఆర్‌ను కూడా వెంటనే బర్తరఫ్ చేయాలని, అప్పుడే కేసీఆర్‌కు పాప ప్రక్షాళన జరుగుతుందన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు

"2012లోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జీహెచ్ఎంసీ అక్కడ మూడు అంతస్తుల నిర్మాణానికే అనుమతి ఇచ్చింది. కానీ 2016లోని టీఆర్‌ఎస్ సర్కారు మంత్రి డెవలపర్స్‌కి జీ ప్లస్ 7 ఫ్లోర్లకు అనుమతిచ్చేసింది. ఇక మంత్రి డెవలపర్స్‌లో ఆర్ఎస్ఆర్ డెవలపర్స్ భాగస్వాములు అయ్యాక 12 అంతస్తులకు దరఖాస్తు చేసుకుంటే దానికి కూడా అనుమతిచ్చేశారు. ఇప్పుడు ఏకంగా 15 అంతస్తులకు కూడా అనుమతిచ్చేశారు "అని రేవంత్ వివరించారు

భూమి లోపల ఐదంతస్తులకు అనుమతి ఎక్కడైనా ఉందా?

భూమి లోపల ఐదంతస్తులకు అనుమతిచ్చారని.. ప్రపంచంలో ఎక్కడైనా ఉందా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మీరు తవ్విన గోతుల్లోనే మిమ్మల్ని పాతిపెడతామంటూ రేవంత్ ఘాటు విమర్శలు చేశారు. బీఆర్ఎస్ వాళ్లకు ఆంధ్రానే దిక్కని.. అప్పై బంగారుబాతమేనని వ్యాఖ్యానించారు. కేబీఆర్ పార్క్ దగ్గరకు వచ్చే వాకర్స్ అసోసియేషన్ ప్రజాప్రయోజన వ్యాజ్యం వేయాలని కోరారు. రెండు మూడు రోజులు తర్వాత మరిన్ని వివరాలతో మీడియా ముందుకు వస్తానని రేవంత్ చెప్పారు.

అడవి శిలాజాన్ని ఆదరించరూ !

- అరుదైన వృక్ష శిలాజాలపై పట్టింపు కరువు
- ప్రాణహిత తీరంలో గుర్తించిన డైనోసర్ జాడలు
- వేల ఏళ్ల నాటి తాబేళ్లు, నత్తగూళ్లు, చేపల అవశేషాలు
- ప్రతిపాదనలకే పరిమితమైన ఫాజిల్ పార్కు



మంచిర్యాల జిల్లా ప్రాణహిత తీరంలో రాజారంలో లభ్యమైన వృక్ష శిలాజాలు



బిర్లా మ్యూజియంలో భద్రపర్చిన డైనోసర్ ఎముక అవశేషం



ప్రాణహిత తీరంలో వేల ఏళ్ల నాటి తాబేళ్ల శిలాజాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వేల ఏళ్ల నాటి వృక్ష శిలాజాలకు ఆదరణ కరువైంది. కుమురంభీం, మంచిర్యాల జిల్లాల్లో ప్రాణహిత తీరంలో డైనోసర్‌లు ఉన్న జాడలు శాస్త్రవేత్తలు గుర్తించారు. వాటి అవశేషాలూ లభ్యమయ్యాయి. ఎంతో ప్రాధాన్యమున్న ఈ వృక్ష శిలాజాలపై ఏళ్లు గడుస్తున్నా పట్టింపు కరువైంది. అరుదైన(కోట సారస్ డైనోసర్స్) రాకాసి బల్లులు, ఫైసా అనే నత్తగుళ్ల, తాబేళ్లు, చేపలు, వృక్షాల ఆనవాళ్లు నేటికీ కనిపిస్తున్నాయి. శాస్త్రవేత్తలు, జియాలాజిస్టులు అధ్యయనం చేశారు. సంరక్షించాలని అటవీ, పురావస్తు శాస్త్రవేత్తలు, ఔత్సాహికులు ప్రభుత్వ అధికారులకు విన్నవించారు. కానీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో అరుదైన చారిత్రక సంపద భవిష్యత్ తరాలకు అందకుండా పోయే ప్రమాదం ఉంది.

నిజాం కాలంలోనే గుర్తింపు

ప్రాణహిత తీరంలో వేల ఏళ్ల నాటి శిలాజాలు ఉన్నట్లు నిజాం హయాంలోనే గుర్తించారు. తొలిసారిగా 1925లో జర్మనీకి చెందిన శాస్త్రవేత్త మలాన్ అధ్యయనం చేశారు. ఆ తర్వాత జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలోనూ పరిశోధనలు చేయగా, అరుదైన డైనోసర్ అవశేషాలు లభ్యమయ్యాయి. రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణ పరిశోధక బృందాలు అధ్యయనం చేశాయి. గుర్తించాక సంరక్షణ లేకపోవడంతో ఆ అవశేషాలు కనుమరుగవుతున్నాయి. వర్షాకాలంలో వాగులు, ఒర్రెల్లోకి కలిసిపోతున్నాయి.

బిర్లా మ్యూజియంలో డైనోసర్ అవశేషాలు

మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం రాజారాం అటవీ ప్రాంతంలో గుర్తించిన డైనోసర్ అవశేషాలను హైదరాబాద్‌లోని బిర్లా మ్యూజియంకు తరలించారు. తాబేళ్లు, చేప, వృక్ష శిలాజాలు సైతం అటవీ శాఖ మంచిర్యాల జిల్లా గాంధారి వనంలో సందర్శకుల వీక్షణ కోసం ఉంచారు. అనేక శిలాజాలు ఎకరాల కొద్దీ అటవీ ప్రాంతంలో గుర్తులు కనిపిస్తున్నాయి. ప్రాణహిత తీరంలో థీమ్ పార్కులు ఏర్పాటు చేసి, పర్యాటక ప్రదేశంగా గుర్తించాలని స్థానికులు కోరుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. సిరోంచ తాలూకాలో ఫాజిల్ పార్కు ఏర్పాటు చేయడంతో సందర్శకులు వెళ్తున్నారు.

ప్రతిపాదనలోనే ఫాజిల్ పార్క్

వేమనపల్లి మండలం రాజారం, మంగెనపల్లి, దస్నాపూర్, సుంపుటం పరిసర అటవీ ప్రాంతాలు, కుమురంభీం జిల్లా పెంచికల్‌పేట మండలం కొండపల్లితోపాటు ప్రాణహిత తీరంలోని శిలాజాలను అందరూ తెలుసుకునేందుకు ఫాజిల్ పార్కు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. ఇప్పటికీ ఎటువంటి ఆదరణ నోచుకోలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక చరిత్రకారులు, కొత్తగా జిల్లాల ఆవిర్భావం తర్వాత జిల్లా ఉన్నతాధికారులు ఆసక్తి చూపారు. వాటి సంరక్షణకు పూనుకున్నారు. ఆ తర్వాత ఎటువంటి పురోగతి లేకపోవడంతో ఎక్కడి గొంగళి అక్కడే ఉన్నట్లు ఉంది.

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి



అరుదైన వృక్ష శిలాజాలు ప్రాణహిత తీరంలో ఉన్నాయి. గతంలో చాలామంది ఉన్నతాధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించి, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని హామీలు ఇచ్చారు. నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఈ ప్రాంతాన్ని పరిరక్షించడానికి ప్రత్యేక నిధులు కేటాయించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి.

– ఉపాసి సంజీవ్, సర్పంచ్ కొండపల్లి, మం: పెంచికల్‌పేట, కుమురంభీం జిల్లా

భూగర్భ గనుల్లోకి మహిళా కార్మికులు!?

- ప్రస్తుతం 200మందికి పైగా ఉన్నట్లు గుర్తింపు
- సంస్థలో మహిళల సంఖ్య పెరగడంతో నిర్ణయం



వర్క్‌షాప్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళలు

గోదావరిఖని: భూగర్భ గనుల్లోకి మహిళ కార్మికులు వెళ్లాల్సిందేనా..? గనిలోకి వెళితే పురుషులతో సమానంగా ఎలాంటి పనిచేయాల్సి ఉంటుంది..? సింగరేణిలో మహిళా కార్మికులకు ఇక భూగర్భ గనిలోకి వెళ్లడం తప్పదనే సంకేతాలు వస్తున్న నేపథ్యంలో ప్రతిఒక్కరిలో ఈ విషయమై చర్చ సాగుతోంది. మొదట్లో భూగర్భగనుల్లో పురుషులతో సమానంగా మహిళలు కూడా భూగర్భ గనుల్లోకి వెళ్లి పనులు చేసినట్లు చరిత్ర చెబుతోంది. ఇదే క్రమంలో మహిళా కార్మికుల సంఖ్య పెరగడం, దానికి తగినట్లు సర్ఫేస్‌లో ఖాళీలు లేకపోవడంతో రాబోయే మహిళా ఉద్యోగులను భూగర్భ గనుల్లోకి దింపడం తప్పనిసరి చేసే ఆలోచనలో యాజమాన్యం ఉంది. పురుషులకు మాత్రమే పరిమితమైన సింగరేణి సంస్థ నేడు మహిళా కార్మికులకు కూడా సంస్థలో ఉద్యోగావకాశాలను కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇటీవల కారుణ్య నియామకాలు భారీగా పెరిగాయి. ఇద్దరు పిల్లలు అమ్మాయిలు ఉంటే వారిలో ఒకరికి సింగరేణి ఉద్యోగం అప్పగిస్తున్నారు. అంతేకాకుండా అబ్బాయి, అమ్మాయి ఉంటే.. అబ్బాయి సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో ఉంటే.. అమ్మాయికి సింగరేణి ఉద్యోగాన్ని వారసత్వంగా ఇస్తున్నారు. ఈక్రమంలో సంస్థ వ్యాప్తంగా మహిళా కార్మికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రతిబ్యాచ్‌లో మహిళా కార్మికులు ఉంటుండం, డిపార్ట్‌మెంట్లు, జీఎం కార్యాలయాలు, ఏరియా ఆసుపత్రులు, వర్క్ షాప్‌లు, స్టోర్స్‌లలో రిక్రూట్ చేశారు. ఇంకా మహిళా కార్మికుల సంఖ్య పెరుగుతుండంతో భూగర్భగనుల్లోకి పంపాలని నిర్ణయించినట్లు సమాచారం. దీనిపై యాజమాన్యం స్పష్టమైన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సంస్థలో చేరిన మహిళా కార్మికులందరినీ యాజమాన్యం సర్ఫేస్ (ఉపరితలంపై) విధులకు కేటాయిస్తోంది. సంస్థవ్యాప్తంగా సర్ఫేస్‌లో పనిచేస్తున్న మహిళా కార్మికుల సంఖ్య రెండు వేలకు పైగా ఉన్నట్లు చెబుతున్నారు. వీరిలో ఇప్పటికే 200 మందికిపైగా అదనంగా సర్ఫేస్‌లో ఉన్నట్లు యజమాన్యం గుర్తించింది. ఇక సర్ఫేస్ విధుల్లోకి తీసుకుని జీతాలు చెల్లించే బదులు, భూగర్భగనుల్లో ఉండే పనులు కూడా మహిళా కార్మికులకు కేటాయించాలని నిర్ణయించారు.

భవిష్యత్‌లో ఆపరేటర్లుగా అవకాశం

సింగరేణిలో రాబోయే రోజుల్లో డంపర్, షావల్ ఆపరేటర్లుగా మహిళలకు అవకాశం ఇవ్వనున్నారు. ప్రస్తుతం విదేశాల్లో ఉన్న కోల్‌మైన్స్‌లో మగవారికన్నా, మహిళా కార్మికులే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ఈ క్రమంలో సింగరేణిలో కూడా రాబోయే రోజుల్లో మహిళా కార్మికులు హెవీ లైసెన్స్ తీసుకుంటే ఆపరేటర్లు రాణించే అవకాశం ఉంటుందని సంస్థ ఉన్నతాధికారులు అంటున్నారు. భూగర్భగనుల్లో కూడా ఆపరేటర్లుగా కొనసాగే అవకాశం ఉంటుందని అంటున్నారు. ఎస్‌డీఎల్, ఎల్‌హెచ్‌డీ, కంటిన్యూస్ మైనర్ ఆపరేటర్లుగా కూడా మహిళలకు చాన్స్ ఉంటుందని చెబుతున్నారు.

ఫైన్‌లో సాయిశ్రీవల్లికి ప్రశంసపత్రం



ప్రశంసపత్రాలు అందుకుంటున్న సాయిశ్రీవల్లి, మధుబాబు

మంచిర్యాల అర్బన్: ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నాలుగు రోజులపాటు నిర్వహించిన ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఇంటర్నేషనల్ షిప్(ఫైన్) ముగింపు వేడుకల్లో మంచిర్యాలకు చెందిన సాయి శ్రీవల్లికి ఇన్నోవేషన్ ఫౌండేషన్ డైరెక్టర్ విపిన్‌కుమార్ ప్రశంసపత్రం అందజేశారు మహిళలకు ఉపయోగపడే రుతుమిత్ర కిట్ ప్రదర్శనకుగాను అభినందించారు. జిల్లా సైన్స్ అధికారి మధుబాబుకు ప్రశంసపత్రం అందజేశారు.


పెండింగ్ ప్రాజెక్టులు నిర్మించాలి


- సీఎల్పీ నేత మల్లుభట్టి విక్రమార్క
- 'సాక్షి' ప్రచురించిన కథనానికి స్పందన



సాక్షి, ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తి చేయాలని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. పాదయాత్ర సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుల కష్టాలను దగ్గరి నుంచి చూశానని పేర్కొన్నారు. 'మరోసారి తెరపైకి కుప్టి' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. మంచిర్యాల జిల్లాలో పాదయాత్రలో ఉన్న ఆయన ఫోన్‌లో 'సాక్షి'తో మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి పాదయాత్ర ప్రారంభించినప్పుడు కుప్టి ప్రాజెక్ట్ విషయం తాను ప్రస్తావించానని గుర్తుచేశారు. వీటితో పాటు చిక్‌మన్ ప్రాజెక్ట్‌ను కూడా చేపట్టాలని కోరారు కుప్టి బహుళార్థక సాధక ప్రాజెక్ట్ అని, దీంతో అనేక ఉపయోగాలున్నందున ప్రభుత్వం వెంటనే నిర్మాణం చేపట్టాలని విక్రమార్క డిమాండ్ చేశారు

ఆస్తిపన్నుల వసూళ్లలో ఆదర్శం





సిరిసిల్ల మున్సిపల్ సిబ్బందిని సత్కరిస్తున్న కలెక్టర్ అనురాగ్‌జయంతి, చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి

- రాష్ట్రంలోనే మొదటి స్థానం
- ట్విట్టర్‌లో అభినందించిన మంత్రి కేటీఆర్
- ఉత్తమ సిబ్బందికి సత్కారం

సిరిసిల్ల: రాష్ట్రంలోనే ఆస్తి పన్నుల వసూళ్లలో సిరిసిల్ల మున్సిపాలిటీ ఆదర్శంగా నిలిచింది. సిరిసిల్ల మున్సిపల్ అధికారులు, సిబ్బంది పట్టణంలోని ఆస్తి పన్నులను, వాణిజ్య పన్నులను వంద శాతం వసూలు చేసి రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచారు. రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిన సిరిసిల్ల మున్సిపల్ పాలకవర్గాన్ని, అధికారులను, సిబ్బందిని రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారక రామారావు గురువారం ట్విట్టర్‌లో అభినందించారు. సిరిసిల్ల ఎమ్మెల్యేగా, మున్సిపల్ మంత్రిగా గర్వపడుతున్నానని పేర్కొన్నారు. వందశాతం వసూళ్లకు సహకరించిన మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణిని, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యను, కౌన్సిలర్లను కలెక్టర్ అనురాగ్ జయంతి అభినందించారు. క్షేత్రస్థాయిలో ఉత్తమంగా పనిచేసిన సిబ్బందిని కలెక్టరేట్‌లో సత్కరించారు. గత ఆర్థిక సంవత్సరంలోనూ వంద శాతం వసూలు చేశారని, అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా లక్ష్యం సాధించడం అభినందనీయమని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సమర్థవంతంగా పనిచేస్తున్నారని అభినందించారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, మున్సిపల్ బిల్ కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు

నేడు హుజూరాబాద్‌కు అంబేడ్కర్ మనవడు

- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: దళితబంధు యూనిట్లను పరిశీలించి లబ్ధిదారులతో ఇంట్రాక్ట్ అయ్యేందుకు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మనవడు ప్రకాశ్ యశ్వంత్ హుజూరాబాద్ నియోజకవర్గంలో శుక్రవారం పర్యటిస్తారని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రకాశ్ యశ్వంత్ పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. శుక్రవారం హైదరాబాద్ నుంచి రావడ్ ద్వారా ఉదయం 7.30 గంటలకు హుజూరాబాద్ చేరుకుంటారని తెలిపారు కార్యక్రమంలో కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, సీపీ సుబ్బారాయుడు, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

బీజేపీ పాలిత సీఎంలు గాడిద పళ్లు తోముతుండ్రా?

మంత్రి మల్లారెడ్డి



నాగర్‌కర్నూల్: తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయకుండా అక్కడి ముఖ్యమంత్రులు గాడిద పళ్లు తోముతుండ్రా అని మల్లారెడ్డి విమర్శించారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం ఇంద్రకల్‌లో కార్యకర్తల కుటుంబాలతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా మంత్రి మల్లారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియా తో మాట్లాడుతూ అభివృద్ధిని చూసి తట్టుకోలేక బీజేపీ ప్రభుత్వం ఐటీ, ఈడీ దాడులు చేస్తూ కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్ర పేరుతో ఊరూరు తిరిగే కాంగ్రెసోళ్ల పాచి ముఖాలు చూడలేకపోతున్నామని మల్లారెడ్డి ఎద్దేవా చేశారు.

ఏ విధానాలు నచ్చి బీజేపీలోకి వెళ్లారు?

ఏలేటిని ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే అనిల్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఏ ఏ విధానాలు నచ్చి బీజేపీలో చేరారో చెప్పాలని మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ డిమాండ్ చేశారు. గురువారం ఇక్కడి గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏలేటి పూటకో మాట మాట్లాడతారని ధ్వజమెత్తారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై బహిరంగంగా విమర్శలు చేసినందుకే మహేశ్వర్‌రెడ్డికి షోకాజ్ నోటీసులు ఇచ్చినట్టు పేర్కొన్నారు. బీజేపీ పెట్టుబడిదారుల పార్టీ అని, అది ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముతోందని విమర్శించారు. బీసీ జనగణన చేయకుండా బీసీలను మోసం చేస్తోందని అనిల్ ఆరోపించారు.

కవితమ్మా.. బురద చల్లడం అంటే జర చెప్పమ్మా!

ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై షర్మిల ట్వీట్



సాక్షి, హైదరాబాద్: 'అమ్మా కవితమ్మ.. బురద చల్లడం అంటే ఏంటో జర చెప్పమ్మా' అని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల నిలదీశారు. పాత్రికేయులకు, మీడియా సంస్థలకు విలువలు లేవని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడటాన్ని ఆమె ఆక్షేపించారు. 'నీ బండారం బట్టబయలైతే, దానిని మీడియా ప్రసారం చేస్తే.. రోజుకో ఎపిసోడ్ బయటపడుతుంటే, నిజాలు రాయకుండా లిక్కర్ స్కాంలో ఘనకార్యం చేశావని నెత్తిన పెట్టుకోవాలా', ఆహా! ఓహో అని వార్తలు రాయాలా.. లేక లిక్కర్ డాన్, లిక్కర్ క్వీన్ అంటూ బిరుదులు ఇవ్వమంటావా' అని దుయ్యబట్టారు. ఎవరో ఆరోపణలు చేస్తే కేసీఆర్.. ఈటల రాజేందర్‌ను పార్టీలోంచి సస్పెండ్ చేశారని, లిక్కర్ స్కాం కేసులో ఉన్న కవితను సస్పెండ్ చేయకుండా రాచమర్యాదలతో ప్రగతిభవన్‌లో స్వాగతం పలుకుతున్నారని షర్మిల ధ్వజమెత్తారు.

15న వరంగల్‌లో బీజేపీ నిరుద్యోగ మార్చ్

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టేందుకు పది ఉమ్మడి జిల్లాల్లో 'నిరుద్యోగ మార్చ్'లు నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెల 15న వరంగల్‌లో, 18న మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ మార్చ్‌లను నిర్వహించనుంది. పది ఉమ్మడి జిల్లాల్లో నిరుద్యోగ మార్చ్‌లు నిర్వహించాక, మే నెలలో హైదరాబాద్‌లో మిలియన్ మార్చ్ జరపాలని బీజేపీ నాయకత్వం ఆలోచిస్తున్నట్లు తెలిసింది.

కొమ్మకొమ్మకో సన్నాయి!

- రాష్ట్రంలోని అటవీ ప్రాంతాల్లో జోరుగా పక్షుల సందడి
- స్థానిక పక్షులతో పాటు విదేశీ విహంగాల ఆగమనం కూడా..
- నల్లమలలో తోట పిగిలిపిట్ట, నల్లదేగల అలికిడి
- మరోవైపు పట్టణ ప్రాంతాలు, చెరువుల వద్ద కానరాని పక్షులు
- అంతరించే పరిస్థితిలో బుల్‌బుల్, పోలంకి పిట్టలు
- పలు ప్రాంతాల్లో కోతుల గుంపులతో పక్షులకు సమస్య
- 'స్టేట్ ఆఫ్ ఇండియన్ బర్డ్స్' తాజా నివేదికలో వెల్లడి


సాక్షి ప్రత్యేక ప్రతినిధి

పోలంకి పిట్ట, పిగిలిపిట్ట, తేనె పిట్ట, నల్ల కొంగ, ఎర్ర గుడ్లగూబ, పెద్ద చిలుక, వనువు పావురం.. ఈ పక్షులను ఎప్పుడూ చూడలేదు కదూ! చూడటం కాదు, కనీసం పేర్లు కూడా విననివారూ ఎక్కువే. వివిధ కారణాలతో పక్షుల సంఖ్య తగ్గిపోవడమే దీనికి కారణం. కానీ ఇప్పుడు రాష్ట్రంలోని రిజర్వ్ ఫారెస్టులు, చెరువుల వద్ద ఏకంగా 446 రకాల పక్షులు సందడి చేస్తున్నాయి. మన దేశంలో ప్రస్తుతమున్న 1,300 పక్షి జాతుల్లో మూడో వంతుకుపైగా తెలంగాణలో స్థిరనివాసం ఉండటంగానీ, వలస వచ్చిపోవడం గానీ జరుగుతోందని 'స్టేట్ ఆఫ్ ఇండియన్ బర్డ్స్' తాజా నివేదిక వెల్లడించింది. నల్లమల, అనంతగిరి, గుబ్బల మంగమ్మ (అశ్వారావుపేట), పోచారం, కవ్వాల్, ఏటూరునాగారం, నర్సాపూర్ అటవీ ప్రాంతాల్లో చాలా జాతుల పక్షులు ఆవాసాలు ఏర్పర్చుకున్నట్టు తెలిపింది.




నల్లదేగ..

కొత్త పక్షులకూ ఆవాసం..



హార్ట్ స్పాటెడ్ వడ్రంగి పిట్ట

మన రాష్ట్రంలో పలుచోట్ల కొత్తగా తలపై పింఛంతో ఠీవిగా కనిపించే బ్లాక్ బాజా (నల్లదేగ), మూరెడు తోక కలిగిన బ్లిత్స్ పారడైజ్ ఫ్లైక్యాచర్ (తోట పిగిలిపిట్ట)లను గుర్తించారు. వీటికితోడు అనంతగిరిలో బ్లూఅండ్ వైట్ ఫ్లైక్యాచర్ (నీలి- తెల్ల పిగిలిపిట్టలు), అశ్వారావుపేట గుబ్బల మంగమ్మ ఫారెస్ట్‌లో రూఫస్ వుడ్‌పెకర్ (ఒక రకం వడ్రంగి పిట్ట), కవ్వాల్‌లో మార్ష్ హారియర్, ఇండియా కోర్సర్, బ్లాక్ బెల్లిట్, లాఫింగ్ డవ్, హార్ట్ స్పాటెడ్ వడ్రంగి పిట్ట తదితర వలస పక్షులను కొత్తగా గుర్తించారు. కొన్నేళ్లుగా మంచి వర్షాలు, వేసవిలో దాహార్తిని తీర్చేందుకు రిజర్వు ఫారెస్టుల్లో ఏర్పాట్లు చేయటంతో.. పక్షుల సంతతి, రాక పెరిగినట్టు నిపుణులు చెప్తున్నారు.



తోట పిగిలిపిట్ట



రూఫస్ వుడ్‌పెకర్

అడవుల్లో పక్షుల జోరు పెరిగింది



తెలంగాణ అటవీ ప్రాంతంలో అన్నిరకాల స్థానిక పక్షుల సంతతితోపాటు కొత్త పక్షుల వలస పెరిగింది. దేశీజాతి పక్షులు ఈ ప్రాంతానికి హిమాలయాలు మొదలుకుని ఈశాన్య భారత రాష్ట్రాల నుంచి కూడా వస్తున్నాయి. అయితే అటవీ ప్రాంతాల్లో జన సందడిని మరింత తగ్గించే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉంది. - మదన్‌రెడ్డి, వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్

చెరువుల వద్ద తగిన ఏర్పాట్లు చేయాలి



చాలా చోట్ల చెరువులకు మరమ్మతులు చేస్తూ వాటికి ఒడ్డు లేకుండా చేస్తున్నారు. కొన్నిచోట్ల అయితే చెరువుల నిర్వహణ ప్రైవేటు చేతుల్లోకి తీసుకుని వాకింగ్ ట్రాక్‌లు, విద్యుత్ లైట్లు వేస్తున్నారు. చుట్టుపక్కల చెట్లు కూడా లేకుండా పోతున్నాయి. వీటి ప్రభావం పక్షులపై తీవ్రంగా పడింది. విదేశీ వలస పక్షుల రాక తగ్గిపోయేందుకు కారణమైంది.

- హరికృష్ణ అడపా, హైదరాబాద్ బర్డ్ పాల్స్ సంస్థ ప్రతినిధి

నగరాలు, చెరువుల వద్ద.. ఆందోళనకరం

జీవావరణ సమతుల్యతలో కీలకపాత్ర పోషించే పక్షుల మనుగడ పెద్దగా మనుషుల అలికిడి లేని అటవీ ప్రాంతాల్లో క్షేమంగా ఉండగా.. నగరాలు, చెరువుల వద్ద ఆందోళనకరంగా ఉందని తేలింది. రిజర్వ్ ఫారెస్టులలో స్థానికంగా ఉన్నవాటికి తోడు కొత్త రకాల పక్షులు వచ్చి చేరుతున్నాయి. అదే పట్టణ ప్రాంతాల్లో, ముఖ్యంగా హైదరాబాద్ నగరం, శివారు ప్రాంతాల్లో పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉందని నిపుణులు చెప్తున్నారు. పక్షుల మనుగడకు తోడ్పడే పండ్లు, పూలచెట్ల స్థానంలో ఎలాంటి ప్రయోజనంలేని మొక్కల పెంపకం, భారీ నిర్మాణాలతో చెట్లు తగ్గిపోవడం, సెల్ టవర్లు, కర్బన ఇంధనాల కాలుష్యం వంటి కారణాలతో పావురాలు తప్ప మిగతా పక్షులేవీ పెద్దగా మనగలిగే పరిస్థితి లేదని 'హైదరాబాద్ బర్డ్ పాల్స్' సంస్థ ప్రతినిధి గోపాలకృష్ణ అయ్యర్ తెలిపారు. ఇక కొన్నేళ్లుగా చెరువుల సరిహద్దులు, కట్టల నిర్మాణాలు, వాటిపై వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం, ప్రకాశవంతమైన విద్యుత్ లైట్లు అమర్చడం వంటివాటితో.. వలస పక్షులతోపాటు ఇక్కడి నీటి పక్షులు గుడ్లు పెట్టి, సంతానోత్పత్తి చేయలేని పరిస్థితి ఏర్పడిందని అయ్యర్ వివరించారు. మనుషుల అలికిడి పెరగడం, వేట (పురుగులు, చిన్నచేపలు) దొరకడం కష్టమవడంతో ఆయా పక్షుల మనుగడకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. ఈ కారణాలతో.. అక్టోబర్ నుంచి మార్చి వరకు యూరప్, సైబీరియా, ఆస్ట్రేలియాల నుండి వలసవచ్చే పక్షుల సంఖ్య భారీగా తగ్గిందన్నారు. చెరువుల పునర్నిర్మాణంలో పక్షుల మనుగడ అంశాన్ని మర్చిపోయి డిజైన్ చేయడమూ ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు.



బ్లూ బెయిర్డెడ్ బీ ఈటర్



చెస్ట్‌నట్ టెయిల్డ్ స్టార్లింగ్

నల్లమల.. కిలకిల

కోకిల కిలకిలారావాలు, చిలుకల పలుకులు, పిచ్చుకల కిచకిచలతోపాటు ఏకంగా 304 రకాల పక్షుల సందడితో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ప్రత్యేక జీవావరణ కేంద్రంగా మారింది. ఇక్కడ నల్ల గద్ద, పోలంకి పిట్ట, తేనెపిట్ట, నల్లకొంగ, తోక పిగిలిపిట్ట, పెద్ద చిలుక, ఎర్ర గుడ్లగూబ తదితర పక్షులు ఆవాసం ఏర్పరచుకున్నాయి.




బ్లూ అండ్ వైట్ ఫ్లై క్యాచర్



బండెడ్ బే కుకూ

అనంతగిరుల్లో..

వికారాబాద్ జిల్లా అనంతగిరిలో ప్రతి మొక్క ఆయుర్వేద గుణాలున్నదేనన్న పేరు పొందింది. ఈ అడవుల్లో 250 రకాల పక్షులు ఉన్నాయి. బండెడ్ బే కుకూ, బ్లూ బెయిర్డెడ్‌బీ ఈటర్, చెస్ట్‌నట్ టెయిల్డ్ స్టార్లింగ్, పొన్నంగి పిట్ట (ఇండియన్ పిట్ట) లతో పాటు చెవులపిల్లిని అవలీలగా తీసుకునే కుందేటిసలవ గద్దలు వంటి పక్షులు అనంతగిరి నుంచి ఉస్మాన్‌సాగర్ రిజర్వాయర్ వరకు సందడి చేస్తున్నాయి.



లాఫింగ్ డవ్

డేంజర్ జోన్‌లో బుల్‌బుల్ పిట్ట..

- చూసేందుకు ముద్దుగా, పలికితే వినసొంపుగా ఉండే బుల్‌బుల్ పిట్ట (ఎల్లో త్రోటెడ్ బర్డ్) అంతరించే స్థితికి చేరింది. దేశంలోపాటు మన రాష్ట్రంలోనూ వీటి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. వీటి నివాసం రాళ్లు, కొండ గుహలే.
- కుమురంభీం జిల్లా పెంచికల్‌పేట, బెజ్జూరులలో రాబందు (వల్చర్) సంరక్షణ కేంద్రం ఏర్పాటు కూడా ప్రయోజనం ఇవ్వలేదు. ప్రాణహిత తీరంలో రాబందుల పర్యవేక్షణ కోసం బయాలజిస్ట్, వాచర్‌ను నియమించి రోజూ ఒక ఆవును ఆహారంగా వదిలినా ఫలితం లేకపోవటంతో ఆ ప్రయత్నాలు ఇటీవలే ఉపసంహరించారు.
- జనగాం జిల్లా చిన్నమడూరు, పెద్ద మడూరు గ్రామాలకు ఏటా వచ్చే విదేశీ పక్షులకు అక్కడి కోతుల గుంపులు ప్రతిబంధకంగా మారాయి. ఈ ఏడాది వలస పక్షుల సంఖ్య భారీగా తగ్గింది.



బుల్‌బుల్ పిట్ట

షోకాజ్ అందుకున్న మర్నాడే

బీజేపీలోకి ఏలేటి

- కాంగ్రెస్ పార్టీకి రాజీనామా.. ఆపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమక్షంలో చేరిక
- హాజరైన తరుణ్ ఛుగ్, బండి, ఈటల, కోమటిరెడ్డి
- అవమానాలు భరించలేకే కాంగ్రెస్‌ను వీడినట్లు వ్యాఖ్య
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కలిసి అడుగులేసే దిశగా నడుస్తున్నాయని ఆరోపణ

సాక్షి, న్యూఢిల్లీ/నిర్మల్: 'నేనేమైనా ఉగ్రవాదినా? ఏమైనా తప్పు చేశానా? కారణం ఏమిటో చెప్పకుండా నాకు షోకాజ్ నోటీసు ఇవ్వడం.. గంటలోగా వివరణ కోరడం ఏమిటి? 15 ఏళ్లుగా అవినీతి మచ్చ లేకుండా పనిచేస్తున్న నన్ను ఎలాంటి ఆధారాల్లేకుండా, అభాండాలు వేసి బయటకు వెళ్లేలా చేశారు. కాంగ్రెస్ పార్టీలో అవమానాల నుంచి విముక్తి కోసమే బీజేపీలో చేరా' అని తెలంగాణ సీనియర్ నేత, నిర్మల్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వెల్లడించారు. ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్‌గా ఉన్న మహేశ్వర్‌రెడ్డి గురువారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి ఢిల్లీలో బీజేపీలో చేరారు. గురువారం ఉదయమే ఢిల్లీ చేరుకున్న ఆయన తొలుత బీజేపీ చేరికల కమిటీ కన్వీనర్ ఈటల రాజేందర్‌తో భేటీ అయ్యారు. అనంతరం వారిద్దరూ కలసి బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్ నివాసంలో ఛుగ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆ తరువాత ఆయన్ను తరుణ్ ఛుగ్, బండి సంజయ్, ఈటల, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సంగప్ప బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసానికి తీసుకెళ్లారు. అక్కడ మహేశ్వర్‌రెడ్డికి జేపీ నడ్డా పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. అనంతరం జేపీ నడ్డా నివాసం వద్ద తెలంగాణ బీజేపీ నేతలు మీడియాతో మాట్లాడారు.

బీజేపీ, మోదీతోనే అరాచక పాలనకు తెర

రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనను అంతమొందించడం కేవలం బీజేపీ, ప్రధాని మోదీ వల్లే సాధ్యమవుతుందని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. అందువల్లే తాను బీజేపీలో చేరానని స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు కలసి అడుగులేసే దిశగా నడుస్తున్నాయని ఆరోపించారు. బీఆర్‌ఎస్ అవినీతిపై పోరాడాల్సిన కాంగ్రెస్ పార్టీ ఏమీ పట్టనట్లుగా పార్లమెంటులో వారితో కలసి తిరుగుతోందని విమర్శించారు. బీఆర్‌ఎస్‌తో పొత్తు విషయంలో కాంగ్రెస్ నాయకులు రోజుకో విధంగా మాట్లాడుతూ కార్యకర్తలను అయోమయానికి గురిచేస్తున్నారని... దీంతో రాష్ట్రంలో పార్టీ దయనీయమైన పరిస్థితికి చేరుకుందని, ఎటుచూసినా అయోమయం నెలకొందని మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.



ఢిల్లీలో ఏలేటిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా. చిత్రంలో తరుణ్ ఛుగ్, బండి సంజయ్, ఈటల రాజేందర్

బీఆర్‌ఎస్‌కు కోవర్టులుగా ఉన్నారనే నిందలను పలువురు కాంగ్రెస్ నేతలపై మోపుతున్నారని... అసలు ఎవరు ఎవరి కోవర్టులో తెలుసుకోలేనటువంటి దుస్థితిలో కాంగ్రెస్ ఉందన్నారు. 15 ఏళ్లుగా కాంగ్రెస్‌లో ఎలాంటి వివాదాలు లేకుండా పనిచేస్తున్న తనపై కావాలనే కొందరు సోషల్ మీడియాలో నిందలు మోపుతున్నారని ధ్వజమెత్తారు. కొంతకాలంగా కాంగ్రెస్‌లో ఒక నాయకుడు పథకం ప్రకారమే సీనియర్లను బయటకు పంపే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.

అందరం కలసికట్టుగా...: సంజయ్

రాష్ట్రంలో అహంకారపూరిత నియంత పాలనను అంతమొందించడానికి ప్రతి ఒక్కరం కలసికట్టుగా పనిచేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తెలిపారు. మహేశ్వర్‌రెడ్డి లాంటి సీనియర్ నాయకుడు బీజేపీలో చేరడం సంతోషకరమన్నారు. కేవలం నిర్మల్ జిల్లానే కాకుండా చుట్టుపక్కల జిల్లాల్లో బీజేపీ బలపడేందుకు మహేశ్వర్‌రెడ్డి లాంటి నాయకులు ఉపయోగపడతారని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీని గెలిపించాలన్న ఏకైక లక్ష్యంతో కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో మహేశ్వర్‌రెడ్డి చేరడం సంతోషకరమని బీజేపీ చేరికల కమిటీ కన్వీనర్ ఈటల రాజేందర్ తెలిపారు. రానున్న రోజుల్లో నిర్మల్ నుంచి పెద్ద ఎత్తున చేరికలుంటాయన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం తెచ్చుకున్న తెలంగాణను అందరికీ అందించేలా బీజేపీనే చర్యలు చేపడుతుందని మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.

విభేదాలు.. స్థానిక రాజకీయాలు

బీజేపీలో మహేశ్వర్‌రెడ్డి చేరికకు కారణాలివే

సాక్షి, హైదరాబాద్: సొంత పార్టీలో విభేదాలు... నియోజకవర్గంలో మారుతున్న రాజకీయ పరిణామాలు... వెరసి నిర్మల్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బీజేపీ కండువా కప్పుకోవడానికి కారణమయ్యాయి. కొంతకాలంగా మహేశ్వర్‌రెడ్డి పార్టీ మార్పు ప్రచారం జరుగుతున్నప్పటికీ నిర్మల్‌లో నెలకొన్న ప్రత్యేక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కాంగ్రెస్‌లోనే ఆయన కొనసాగుతారని భావించారు. అయితే టీపీసీసీ చీఫ్ రేవంత్‌తో ముదిరిన విభేదాలు, తాజాగా ఇచ్చిన షోకాజ్ నోటీసుతో ఏలేటి అహం దెబ్బతింది. అదే సమయంలో నియోజకవర్గంలో అధికార పార్టీ అసంతృప్త నేతలు బీజేపీలో చేరడానికి చేస్తున్న ప్రయత్నాల నేపథ్యంలో ఏలేటి తన రాజకీయ వ్యూహాన్ని మార్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తో కలసి ఢిల్లీ వెళ్లి ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా సమక్షంలో కమలదళంలో చేరారు. మైనారిటీల ప్రభావం అధికంగా ఉండే నిర్మల్‌లో ఆయన నిర్ణయం ఏ మేరకు సత్ఫలితాలు ఇస్తుందోననే అంశాలపై రాజకీయ పరిశీలకులు వేచి చూస్తున్నారు.

నేటి నుంచి సీపీఐ 'బీజేపీ కో హటావో..' యాత్ర

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, అదానీలాంటి కార్పొరేట్‌శక్తుల అనుకూల విధానాలను నిరసిస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి రోజు నుంచి మే 15 వరకు 'బీజేపీ కో హటావో.. దేశ్ కో బచావో' నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా యాత్ర నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. అక్కడక్కడా గ్రామ కార్యదర్శి నుంచి రాష్ట్ర స్థాయి నాయకులతోపాటు యాత్ర ముగిసే నరికి మొత్తంగా సుమారు ఐదు లక్షలమంది జనం పాల్గొంటారని, దీనికి సంబంధించిన కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. గురువారం మఖ్దూంభవన్‌లో కూనంనేని మాట్లాడుతూ హైదరాబాద్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి పాదయాత్రగా ఇందిరాపార్క్ వద్దకు చేరుకుంటామని, అక్కడ లాంఛనంగా యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు.

బీజేపీ, బీఆర్‌ఎస్.. రెండూ ఒక్కటే!

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే

శ్రీరాంపూర్: బీజేపీ, బీఆర్‌ఎస్.. ఈ రెండు పార్టీలు ఒక్కటేనని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే ఆరోపించారు. మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో శుక్రవారం నిర్వహించనున్న సత్యాగ్రహసభలో పాల్గొనడానికి ఠాక్రే గురువారం ఇక్కడికి వచ్చారు. అదేవిధంగా హాథ్ సే హాథ్ జోడోయాత్రలో భాగంగా పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర నిర్వహిస్తున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క శ్రీరాంపూర్ ప్రగతిమైదానం శిబిరంలో కలిశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ, బీఆర్‌ఎస్ ఇక్కడ కలహించుకుంటున్నా, ఢిల్లీలో మాత్రం కలిసిమెలిసి ఉంటున్నాయని ఎద్దేవా చేశారు. బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతీ బిల్లుకు ఓటింగ్‌లో బీఆర్‌ఎస్ ఎంపీలు మద్దతు ఇచ్చారని తెలిపారు. కేసీఆర్ తెచ్చిన ధరణి వల్ల ధనికులకు మరిన్ని భూములు వచ్చాయని, పేదలకు ఉన్న భూములు పోయాయని అన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణలో రూ.5 వేల కోట్ల అప్పులు చేసి అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా జై భారత్ సత్యాగ్రహసభలు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం నస్పూర్‌లో సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఎల్పీనేత భట్టి, ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్‌చౌదరి, సంపత్‌కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమంపై | శ్వేతపత్రం విడుదల చేయాలి

సీఎంకు సీఎల్పీ నేత భట్టి బహిరంగ లేఖ

శ్రీరాంపూర్: దళితుల సంక్షేమంపై సీఎం కేసీఆర్ శ్వేతపత్రం విడుదల చేయాలని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లోని పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర శిబిరంలో గురువారం ఆయన సీఎంకు రాసిన బహిరంగ లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల కోసమే కేసీఆర్ అంబేడ్కర్‌వాదాన్ని వాడుకుంటున్నారని, ఇప్పుడు హైదరాబాద్‌లో ఆవిష్కరిస్తున్న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం కూడా గిరిజన, దళితుల ఓట్ల కోసమేనని విమర్శించారు. కేసీఆర్ గత తొమ్మిదిన్నరేళ్ల పాలనలో ఏనాడైనా ట్యాంక్‌బండ్‌పై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారా అని ప్రశ్నించారు. ప్రతీ అంబేడ్కర్ జయంతి, వర్ధంతి రోజున దళిత, గిరిజనులను కేసీఆర్ అవమానించారని విమర్శించారు. సమాజోద్ధరణకు అంబేడ్కర్ ఆలోచన విధానాలను వాడాల్సిన పాలకులు ఓట్లు పొందడానికి వాడటం దుర్మార్గమని అన్నారు. దళిత, గిరిజనుల అభివృద్ధికి కేసీఆర్ దయాదాక్షిణ్యాలు అవసరం లేదని, ఎంతో దూరదృష్టితో కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దారిమళ్లించకుండా ఖర్చు చేస్తే చాలని అన్నారు. ఫార్మా సిటీ హబ్ కోసం దళిత, గిరిజనులకు చెందిన ఏడు వేల ఎకరాల భూమిని బలవంతంగా సేకరించింది నిజంకాదా అని ప్రశ్నించారు. దళితులకు మూడెకరాల భూమి హామీ ఏమైందని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఏవీ అని లేఖలో ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరు చేస్తున్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌కు మద్దతుగా అంబేడ్కర్ జయంతి రోజున నస్పూర్‌లో నిర్వహించే సత్యాగ్రహ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



లేఖ విడుదల చేస్తున్న భట్టి విక్రమార్క

'సత్యాగ్రహ సభ'కు సర్వం సిద్ధం

నేడు మంచిర్యాలలో కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభ

- రాహుల్‌గాంధీకి మద్దతుగా పార్టీ శ్రేణుల నిర్వహణ
- ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎంపీ సభ్యత్వం అనర్హత వేటును నిరసిస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మంచిర్యాలలో తలపెట్టిన 'సత్యాగ్రహ సభ'కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సాయంత్రం 4 గంటలకు నస్పూర్ పట్టణం కొత్త కలెక్టరేట్ సమీపంలోని 22ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు స్థలంలో సభ నిర్వహించనున్నారు. అంబేడ్కర్ జయంతి రోజు, ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో జరుగుతున్న నేపథ్యంలో సభా ప్రాంగణానికి 'బాబాసాహెబ్ అంబేడ్కర్ ప్రాంగణం'గా నామకరణం చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడిగా మల్లిఖార్జున ఖర్గే ఎన్నికయ్యాక రాష్ట్రంలో జరుగుతున్న తొలి బహిరంగ సభ కావడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని లక్ష మందిని తరలించేలా ప్రణాళిక వేశారు. 30వేల వరకు మహిళలు రావొచ్చని అంచనా వేస్తున్నారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క గత నెల 16 నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చేపట్టిన 'హాథ్ సే హాథ్ జోడో' యాత్ర బోథ్ నియోజకవర్గంలో మొదలై మంచిర్యాలకు చేరింది. ఈ నేపథ్యంలో ఈ సభతోనే ఎన్నికల శంఖారావాన్ని మంచిర్యాల నుంచే పూరించాలని భారీగా జనాన్ని సమీకరిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం నుంచి అధిక సంఖ్యలో వచ్చేలా చూస్తున్నారు.



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాణిక్‌రావ్ ఠాక్రే, సంపత్ కుమార్ తదితరులు

గద్దర్ నేతృత్వంలో సాంస్కృతిక కార్యక్రమాలు

గద్దర్ నేతృత్వంలో సభలో సాంస్కృతిక కార్యక్రమాలు సాగనున్నాయి. ఇప్పటికే మంచిర్యాల పట్టణంలో కాంగ్రెస్ పార్టీ జెండాలు, రోడ్ల వెంట భారీ హోర్డింగ్స్, ఫ్లెక్సీలు వెలిశాయి. మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు నేతృత్వంలో నిర్వహిస్తున్న ఈ భారీ బహిరంగ సభ విజయవంతం చేసేందుకు గత రెండు రోజులుగా పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు, డీసీసీ అధ్యక్షులు, విద్యార్థి, యువజన, మహిళా విభాగం నేతలు భాగస్వాములు అయ్యారు. గురువారం రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేతోపాటు సీనియర్ నాయకులు సభాస్థలిని పరిశీలించారు.

హెలికాప్టర్‌లో మంచిర్యాలకు ఖర్గే

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే శుక్రవారం మధ్యాహ్నం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 3 గంటలకు హెలికాప్టర్‌లో మంచిర్యాల డిగ్రీ కాలేజీ మైదానం వద్ద ఉన్న హెలిప్యాడ్‌కు వస్తారు. అక్కడి నుంచి సభాస్థలికి చేరుకుంటారు. సభలో పాల్గొన్నాక, రాత్రి మంచిర్యాలలోనే బస చేస్తారు. శనివారం హైదరాబాద్‌కు వెళ్తారు.

మంచిర్యాల సభకు తరలిరండి!

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు



సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మంచిర్యాలలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కలసి రావాలని గురువారం ఆయన ఒక ప్రకటనలో కోరారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా అక్రమ కేసులు నమోదు చేసి, రెండేళ్ల జైలు శిక్ష పడేలా చేసిందని పేర్కొన్నారు. శిక్షను సాకుగా చూపి ఎంపీగా అనర్హత వేటు వేసిందని, ఒక్క రోజులోనే ఇంటిని సైతం ఖాళీ చేయించి కక్షసాధిస్తోందని ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వ అవినీతిని నిలదీయడం, అదానీ అక్రమ సంపాదన, హిండెన్‌బర్గ్ నివేదికల ఆధారంగా జాయింట్ పార్లమెంట్ కమిటీ వేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేయడంతోనే ఇలాంటి కుట్రకు పాల్పడ్డారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేస్తున్న పాదయాత్రలో భాగంగా మంచిర్యాలలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేలతో పాటు సీనియర్ నాయకులు సభలో పాల్గొంటారని రేవంత్ పేర్కొన్నారు.

● మ్యూజిక్ వరల్డ్

మెరుపులాంటి పాట



స్కూల్ రోజుల్లో పాట పాడటానికి వెళుతున్నప్పుడు చిన్నారి ఆశకు వెనక నుంచి కొన్ని మాటలు వినిపించాయి...'ఈ అమ్మాయి చక్కగా పాడుతుంది'

ఆ మాట తన మనసులో బలంగా ముద్రించుకుపోయి సంగీత సాధనను సీరియస్‌గా తీసుకునేలా చేసింది.

చెన్నైకి చెందిన ఆశా శ్రీరామ్ సింగర్, రైటర్. 'జాజ్ నుంచి బ్లూస్ వరకు రకరకాల ధోరణుల సమ్మేళనం నా సంగీతం' అంటోంది ఆశ. చిన్న వయసులోనే సంగీతంపై ఆశలో ఆసక్తి మొదలైంది. ఎన్నో ప్రసిద్ధ మ్యూజిక్ బ్యాండ్‌ల నుంచి స్ఫూర్తి పొందిన ఆశ మ్యూజిక్‌లో తనదైన స్టైయిల్ క్రియేట్ చేసుకుంది.

'పాట పాడుతున్నప్పుడు వేరే ప్రపంచంలోకి వెళుతున్నట్లుగా, నాతో పాటు ప్రేక్షకులను తీసుకువెళుతున్నట్లుగా అనిపిస్తుంది' అంటుంది 25 సంవత్సరాల ఆశ. తన సంగీత ప్రయాణంలో ఢిల్లీ నుంచి ముంబై వరకు ఎన్నో పట్టణాలకు వెళ్లి పాడిన ఆశకు పాట కొత్త కాదు. అయితే ఎప్పుడు పాడినా, ఎక్కడ పాడినా ఇప్పటికీ కొత్తగానే ఫీలవుతుంది. తన గొంతులోని తాజాదనానికి అదే కారణమేమో!

● ఆర్ట్ అండ్ కల్చర్

రాబోయే కాలంలో..



చేసే సహాయం కూడా 'మనీ'తో ముడిపడే రోజులు రానున్నాయని సరదాగా చెప్పే కార్టూన్ ఇది! ఈ కార్టూన్‌ను బ్రెజిల్ కార్టూనిస్ట్ జోటా ఏ కోస్టా గీశాడు. జోటా రైటర్, ఆర్ట్ ఎడిటర్ కూడా. బ్రెజిల్‌లో ఎక్కువ సంఖ్యలో రివార్డ్‌లు గెలుచుకున్న కార్టూనిస్ట్‌లలో జోటా ఒకరు. 'హర్మ్యామర్ ఆల్ డే' పేరుతో తీసుకువచ్చిన కార్టూన్ పుస్తకానికి మంచి స్పందన లభించింది. ప్రస్తుతం 'గార్డియన్' పత్రికలో పనిచేస్తున్నాడు జోటా.

● ఇంగ్లిష్ ఇడియమ్స్



ఏ స్టిచ్ ఇన్ టైమ్ సేవ్స్ నైన్స్

ఇది పోల్డ్ ఇంగ్లిష్ ఇడియమ్. నష్టం వాటిల్లకుండా ఉండాలంటే వెంటనే, సరియైన టైమ్‌లో నష్ట నివారణ చర్యలు చేపట్టాలి అనే చెప్పే సందర్భంలో ఉపయోగించే మాట ఇది.
ఉదా: డీల్ విత్ ది ప్రాబ్లమ్ నౌ. రిమెంబర్ ఏ స్టిచ్ ఇన్ టైమ్ సేవ్స్ నైన్

ఫస్ట్ అండ్ ఫోర్‌మోస్ట్

ఒక విషయం లేదా ఒక వ్యక్తికి సంబంధించిన ప్రధాన క్వాల్టీ, ప్రధాన విషయాన్ని ప్రస్తావించే సందర్భంలో వాడే ఇడియమ్ ఇది. ఉదా: హీ వాజ్ ఏ సింగర్. బట్ ఫస్ట్ అండ్ ఫోర్‌మోస్ట్ ఏ స్కాలర్

● ఇన్నోవేషన్



ఎకో ఫ్రెండ్

నలుగురి మంచి కోసం ఆలోచించేవారు అందరికీ మంచి మిత్రులవుతారు. ఎకోఫ్రెండ్లీ ఫ్రెండ్ ధారియ ఈ కోవకు చెందిన యువకుడు. కొండంత సమస్యకు కొండంత పరిష్కారం దొరకకపోవచ్చు. అయితే గోరంత పరిష్కారం దొరికినా చాలు కదా! 'ప్యాడ్‌కేర్ ల్యాబ్' ద్వారా కొండంత సమస్యకు తనవంతు పరిష్కారం చూపి భేష్ అనిపించుకుంటున్నాడు పుణెకు చెందిన అజింక్య ధారియ....

మన దేశంలో వాడి పడేసిన శానిటరీ న్యాప్‌కిన్స్ ప్రతి సంవత్సరం కోట్లలో ఉంటున్నాయి. అవి డీకంపోజ్ కావడానికి వందల సంవత్సరాలు పడుతుందనేది కఠిన వాస్తవం.

కొన్ని సంవత్సరాల క్రితం పుణె(మహారాష్ట్ర)కు సమీపంలోని ఒక డంప్‌యార్డ్ దగ్గరికి వెళ్లాడు అజింక్య ధారియ. అక్కడ చూసిన ఒక దృశ్యం ధారియను షాక్‌కు గురి చేసింది.

చెత్త ఏరుకునేవాళ్లలో కొందరు న్యాప్‌కిన్స్, డైపర్స్‌ను భుజాన ఉన్న సంచిలో వేసుకుంటున్నారు!

ఈ దృశ్యం తన మనసులో సుడులు తిరుగుతూనే ఉంది.

'ఈ సమస్యకు ఎలాగైనా పరిష్కారం కనుక్కోవాలి' అని గట్టిగా అనుకున్నాడు ధారియ.

సామాజిక సేవారంగంలో పనిచేసే తల్లితో మాట్లాడి శానిటరీ న్యాప్‌కిన్‌లకు సంబంధించి ఎన్నో విషయాలు తెలుసుకున్నాడు.

'ట్యాక్సిక్ లింక్స్' అనే పర్యావరణ స్వచ్ఛంద సంస్థ ద్వారా గణాంకాలను సేకరించాడు. చరిత్ర మూలాల్లోకి వెళ్లి 1888 నాటి డిస్పోజబుల్ ప్యాడ్ గురించి తెలుసుకున్నాడు.

రకరకాల పరిశోధనలు, ప్రయత్నాల తరువాత ఎట్టకేలకు 'ప్యాడ్‌కేర్ ల్యాబ్' అనే కంపెనీకి శ్రీకారం చుట్టి తన కలను సాకారం చేసుకున్నాడు ధారియ.

> దేశీయంగా, అంతర్జాతీయంగా సంస్థను విస్తరించడానికి అవసరమైన నిర్మాణాత్మకమైన ప్రణాళికకు రూపకల్పన చేశాడు ధారియ. కంపెనీ విస్తరించాలంటే ఆఫీసులో కూర్చుంటే కుదరదు అనే విషయం అతడికి తెలియనిదేమీ కాదు. అందుకే రెసిడెన్షియల్ కమ్యూనిటీలతో కలిసి పనిచేస్తున్నాడు.

క్లయింట్స్‌కు 'ప్యాడ్‌కేర్ బిన్'లను ఉచితంగా ఇస్తుంది కంపెనీ. వాడేసిన శానిటరీ న్యాప్‌కిన్‌లను ఈ ప్యాడ్‌కేర్ బిన్‌లో వేస్తే 30 రోజుల వరకు వాసన రావడం, బ్యాక్టీరియా వ్యాపించడంలాంటివి ఉండవు. వాడేసిన న్యాప్‌కిన్‌లు ప్యాడ్‌కేర్ బిన్‌లలో నుంచి మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ(ఎంఆర్‌ఎఫ్) కేంద్రాలకు చేరుతాయి.

ప్యాడ్‌కేర్ పేటెంట్ టెక్నాలజీ ఈ వ్యర్థాలను ఇరవై నిమిషాల వ్యవధిలో, తక్కువ ఖర్చుతో పల్ప్, ప్లాస్టిక్‌లుగా వేరు చేస్తుంది.

ఈ పల్ప్‌ను ప్యాకేజింగ్‌తో పాటు ఎన్నో రకాలుగా పరిశ్రమలు వినియోగించుకుంటున్నాయి. ఇక ప్లాస్టిక్‌తో ప్యాడ్‌కేర్ బిన్‌లు తయారుచేస్తున్నారు. ఈ మొత్తం ప్రక్రియకు 'మెన్‌స్ట్రుయెల్ హైజీన్ మేనేజ్‌మెంట్' అని పేరు పెట్టారు.

డైపర్‌లు, టెట్రా ప్యాక్‌లు, వస్త్ర వ్యర్థాలు...మొదలైన వాటికోసం ప్రస్తుతం ప్యాడ్‌కేర్ టెక్నాలజీతో రకరకాల ప్రయోగాలు చేస్తున్నారు.

'ప్యాడ్‌కేర్ ల్యాబ్'కు ఇన్ఫోసిస్ ఫౌండేషన్, టాటా ట్రస్ట్....మొదలైన సంస్థలు ఫండింగ్ చేశాయి. దేశీయంగా, అంతర్జాతీయంగా సంస్థను విస్తరించడానికి అవసరమైన నిర్మాణాత్మకమైన ప్రణాళికకు రూపకల్పన చేశాడు ధారియ.

కంపెనీ విస్తరించాలంటే ఆఫీసులో కూర్చుంటే కుదరదు అనే విషయం అతడికి తెలియనిదేమీ కాదు. అందుకే రెసిడెన్షియల్ కమ్యూనిటీలతో కలిసి పనిచేస్తున్నాడు. వారి సహాయం, సలహాలు తీసుకుంటున్నాడు.

నాందేడ్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ చేసిన ధారియకు చదువుకునే రోజుల నుంచే సామాజిక స్పృహ ఉంది.

'ఈ సమస్య ఇంతేలే అని ఆరోజు నేను నిట్టూర్చి ఉంటే కొత్త ఆవిష్కరణ జరిగేది కాదు' అంటున్న ధారియ మరిన్ని ఆవిష్కరణలతో విజయవంతం కావాలని ఆశిద్దాం.

● టెక్.. టాక్

నోకియా టీ21 ట్యాబ్



డిస్‌ప్లే: 10.36 అంగుళాలు బ్యాటరీ: 8200 ఎంఏహెచ్
రిఫ్రెష్ రేట్: 60 హెచ్‌జడ్ ● 4జీబి ర్యామ్ 8ఎంపీ ఫ్రంట్ కెమెరా స్క్రీన్ రిజల్యూషన్: 1200×2000 పిక్సెల్స్
బరువు: 471 గ్రా. ఇంటర్నల్ మెమోరీ: 64 జీబి ధర: ₹16,499

లావా బ్లేజ్ 2



సైజ్: 6.5 అంగుళాలు రిఫ్రెష్‌రేట్: 90 హెచ్‌జడ్
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్ స్టోరేజ్: 6జీబి ర్యామ్ 128 జీబి
● 13-మెగా పిక్సెల్ డ్యూయల్ కెమెరా ● 18 డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్ట్ ● మల్టిపుల్ ఫొటోగ్రఫీ మోడ్స్ ● స్పెషల్ లాంచ్ ప్రైస్: ● ₹8,999

రియల్ టైమ్ లిరిక్స్

YouTube Music

పాటల ప్రేమికులు యూట్యూబ్ మ్యూజిక్‌లోకి వెళితే బోలెడు పాటలు వినవచ్చు. అయితే ఇప్పుడు వినడం మాత్రమే కాదు పాడవచ్చు కూడా. యూట్యూబ్ మ్యూజిక్ 'రియల్ టైమ్-లిరిక్స్' ఫీచర్‌ను తీసుకువచ్చింది. రకరకాల థర్డ్-పార్టీ యాప్‌లలో అందుబాటులో ఉన్న ఈ ఫీచర్ ఇప్పుడు యూట్యూబ్ మ్యూజిక్‌లోకి వచ్చింది. ఈ రియల్ టైమ్ లిరిక్స్ ఫీచర్‌తో తమకు ఇష్టమైన పాట పాడవచ్చు. స్క్రీన్‌పై లిరిక్స్ డిస్‌ప్లే చేయవచ్చు. ప్రతి లైన్‌ను హైలైట్ చేయవచ్చు.

యూట్యూబ్ తన మ్యూజిక్ స్ట్రీమింగ్ సర్వీస్ యూట్యూబ్ మ్యూజిక్(ఆండ్రాయిడ్ అండ్ ఐవోఎస్)లో 'స్లీప్ టైమర్' అనే కొత్త ఫీచర్‌ని తీసుకువచ్చింది. కొందరికి సంగీతం వింటూ పడుకోవడం అలవాటు. అయితే నిద్రలోకి జారిపోయిన తరువాత కూడా పాటలు ప్లే అవుతూనే ఉంటాయి. 'స్లీప్ టైమర్' ఫీచర్‌తో నిర్దిష్టమైన టైమ్ తరువాత మ్యూజిక్ ప్లేయర్ ఆటోమేటిక్‌గా ఆగిపోతుంది. కొందరు యూజర్‌లకు మాత్రమే అందుబాటులో ఉన్న ఈ ఫీచర్ ఇప్పుడు అందరికీ అందుబాటులోకి వచ్చింది.

గూగుల్‌లో ఆటో-ఆర్కైవ్ ఫీచర్



ఆండ్రాయిడ్ యూజర్‌ల కోసం గూగుల్ 'ఆటో-ఆర్కైవ్' అనే కొత్త ఫీచర్‌ని తీసుకువచ్చింది. యాప్‌ను మాన్యువల్‌గా అన్‌ఇన్‌స్టాల్ చేయాల్సిన అవసరం లేకుండానే ఈ ఫీచర్‌తో యాప్ స్టోరేజ్ స్పేస్‌లో 60 శాతం వరకు ఖాళీ చేయవచ్చు. కొందరు రకరకాల యాప్స్ ఇన్‌స్టాల్ చేస్తుంటారు. అయితే వాటిలో ఎక్కువ కాలం పాటు ఉపయోగించేవి తక్కువే. స్టోరేజ్ స్పేస్ ఎక్కువలేని వాటికి 'ఆటో-ఆర్కైవ్' ఉపయోగపడుతుంది.

● గేమింగ్

ఎట్లయితే గట్లాయే...షూటౌట్!



కౌంటర్ స్ట్రైక్ ఫ్రాంచైజీలో భాగంగా వస్తున్న గేమ్...కౌంటర్ స్ట్రైక్-2. 2000 సంవత్సరంలో కౌంటర్ స్ట్రైక్ ఫస్ట్ వెర్షన్ విడుదల అయింది. ఈసారి ప్రత్యేకత రిఫ్లెక్స్ రెడ్యూసింగ్ టెక్నాలజీ. ఇది ప్లేయర్స్‌కు సరికొత్త ప్లేయింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది. రిఫ్లెక్స్ రెడ్యూసింగ్ టెక్నాలజీ గేమ్స్‌లో లేటెన్సీని తగ్గిస్తుంది.ఈ మల్టీప్లేయర్ ట్యాక్టికల్ ఫస్ట్-పర్సన్ షూటర్ వీడియోగేమ్ థీమ్...హత్యలు చేసి అరాచకాలు సృష్టించే టెర్రరిస్ట్‌లకు, కౌంటర్ టెర్రరిస్ట్‌లకు మధ్య జరిగే వార్. టెర్రరిస్ట్‌లు పెట్టిన బాంబు ఎక్కడ ఉంది? దాన్ని ఎలా నిర్వీర్యం చేయాలి... లాంటి టాస్క్‌లు ఈ గేమ్‌లో ఉంటాయి.
సిరీస్: కౌంటర్ స్ట్రైక్ జానర్: ట్యాక్టికల్ షూటర్ ఇంజిన్: సోర్స్2 ప్లాట్‌ఫామ్: మైక్రోసాఫ్ట్ విండోస్

సినిమా

కథ విన్నారా?


● చిరంజీవి

హీరో చిరంజీవి, 'బింబిసార' ఫేమ్ దర్శకుడు వశిష్ఠ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనుందా? చిరంజీవి కథ విన్నారా? అంటే ఫిల్మ్‌నగర్ అవుననంటోంది. చిరంజీవికి వశిష్ఠ ఇటీవల ఓ కథ చెప్పారట. ఆ స్టోరీ చిరంజీవిని ఇంప్రెస్ చేయడంతో ప్రస్తుతం స్క్రిప్ట్‌కు తుది మెరుగులు దిద్దే పనిలో ఉన్నారట వశిష్ఠ. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో ఈ సినిమా రూపొందనుందని సమాచారం. ఇక ప్రస్తుతం 'భోళా శంకర్' చిత్రంతో బిజీగా ఉన్నారు చిరంజీవి. మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 11న విడుదల కానుంది.

రామకృష్ణ గోవింద...


● అఖిల్

అక్కినేని అఖిల్ హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఏజెంట్'. ఇందులో సాక్షి వైద్య హీరోయిన్‌గా నటించగా, మమ్ముట్టి కీలక పాత్ర చేశారు. ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, సురేందర్ రెడ్డి 2 పతాకాలపై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ సినిమా ఈ నెల 28న విడుదల కానుంది. హిప్ హాప్ తమిళ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'రామకృష్ణ గోవింద.. గోవింద హరి గోవింద...' అంటూ సాగే పాటను విడుదల చేశారు మేకర్స్. 'రామ పోయి కృష్ణ వచ్చె, బాధే పోయి హ్యాపీ వచ్చిందా, నైటే పోయి లైటే వచ్చె, ప్రేమే పోతూ పోతూ ఏదో ఏదో నేర్పించిందా.. గోవిందా గోవిందా గర్ల్‌ఫ్రెండ్ గోవిందా.. అయ్యిందా అయ్యిందా బ్రేకప్ అయ్యిందా, పోయిందా పోయిందా ప్రేమే దూరం పోయిందా, వచ్చిందా వచ్చిందా ఫ్రీడమ్ వచ్చిందా..' అంటూ ఈ పాట సాగుతుంది. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటని రామ్ మిర్యాల పాడగా, శేఖర్ మాస్టర్ నృత్యరీతులు సమకూర్చారు.


● వెంకటేశ్

వైజాగ్‌లో సైంధవ్

వైజాగ్‌కు మకాం మార్చింది 'సైంధవ్' టీమ్. 'హిట్' ఫ్రాంచైజీ చిత్రాల ఫేమ్ శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా రూపొందుతున్న చిత్రం 'సైంధవ్'. వెంకట్ బోయనపల్లి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇటీవలే హైదరాబాద్‌లో ఓ షెడ్యూల్‌ను పూర్తి చేసింది చిత్ర యూనిట్. తాజా షూటింగ్ షెడ్యూల్ గురువారం వైజాగ్‌లో మొదలైంది. ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించడానికి ప్లాన్ చేశారు. వెంకటేశ్ కెరీర్‌లో 75వ చిత్రంగా రూపొందుతున్న ఈ సినిమా డిసెంబరు 22న విడుదల కానుంది.

ఆహ్లాదకరంగా.. ఉల్లాసంగా...


● కొరటాల శివ, ఎన్టీఆర్, జేమ్స్, రాజమౌళి

కొన్ని రోజులుగా 'ఆర్ఆర్ఆర్' టీమ్ సెలబ్రేషన్ మూడ్‌లో ఉంది. ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డు సాధించిన నేపథ్యంలో టాలీవుడ్‌లో వేడుకలు జరుగుతున్నాయి. రామ్‌చరణ్ పుట్టినరోజుని పురస్కరించుకుని ఇటీవల చిరంజీవి స్వయంగా పార్టీ ఇచ్చారు. తెలుగు చిత్రసీమకు ఆస్కార్ తెచ్చిన 'ఆర్ఆర్ఆర్' సంగీతదర్శకుడు ఎంఎం కీరవాణి, రచయిత చంద్రబోస్‌లను, టీమ్‌ని ఈ పార్టీలో చిరంజీవి సన్మానించారు.

గత ఆదివారం తెలుగు పరిశ్రమ 'ఆర్ఆర్ఆర్' టీమ్‌కి ప్రత్యేకంగా వేడుక నిర్వహించింది. 'ఆర్ఆర్ఆర్'లో ఓ హీరో అయిన ఎన్టీఆర్ బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని స్వగృహంలో గ్రాండ్ పార్టీ ఇచ్చారు. ఈ పార్టీలో దర్శకులు రాజమౌళి, త్రివిక్రమ్, కొరటాల శివ, నిర్మాతలు నవీన్ ఎర్నేని, నాగవంశీ, స్వప్నాదత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆమెజాన్ స్టూడియోస్ వైస్ ప్రెసిడెంట్ జేమ్స్ ఫరెల్ కూడా పాల్గొన్నారు. ''మిత్రులు, శ్రేయోభిలాషులతో ఈ సాయంత్రం ఎంతో ఆహ్లాదకరంగా, ఉల్లాసంగా గడిచింది. జేమ్స్ అండ్ ఎమిలీలు పాల్గొనడం గ్రేట్. ఈ డిన్నర్ సెలబ్రేషన్స్‌కు హాజరైన అందరికీ ధన్యవాదాలు'' అంటూ సెలబ్రేషన్స్‌లోని కొన్ని ఫొటోలను షేర్ చేశారు ఎన్టీఆర్. ఈ నేపథ్యంలో జేమ్స్ ఫరెల్, ఎన్టీఆర్‌ల మధ్య ఏదైనా ప్రాజెక్ట్ గురించిన చర్చలు జరిగాయా? అనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఇక ప్రస్తుతం ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఈ సినిమా తొలి షెడ్యూల్ పూర్తి కాగా, మలి షెడ్యూల్ త్వరలోనే ప్రారంభం కానుంది. ఈ సినిమాను ఏప్రిల్ 5న విడుదల చేయాలనుకుంటున్నారు.


● రాశీ ఖన్నా

హారర్ మోడ్

తమిళ హారర్ ఫ్రాంచైజీలో ఒకటైన 'అరణ్మనై' నాలుగో భాగంలో నటిస్తున్నారు రాశీ ఖన్నా. సుందర్. సి, తమన్నా, విజయ్‌సేతుపతి ప్రధాన పాత్రధారులుగా 'అరణ్మనై 4' రూపొందుతోంది. సుందర్. సి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా తొలి షెడ్యూల్ పూర్తయింది. మలి షెడ్యూల్ చిత్రీకరణ కొచ్చిలో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లోనే పాల్గొంటున్నారు రాశీఖన్నా. ప్రస్తుతం రాశీ ఖన్నాపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ''అరణ్మనై 3'లో నటించిన రాశీ ఖన్నా 'అరణ్మనై 4'లోనూ మంచి పాత్ర చేస్తున్నారని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాను ఈ ఏడాదే విడుదల చేయాలనుకుంటున్నారు.

యముడి డ్రామా


● సాయికుమార్

యువచంద్ర, శివకుమార్, కొటిల్స్, సుదర్శన్ రెడ్డి హీరోలుగా, ప్రియాంక శర్మ, నేహా దేశ్‌పాండే, హమీద హీరోయిన్లుగా సాయికుమార్ యముడి పాత్రలో నటించిన చిత్రం 'యమ డ్రామా'. టి. హర్షచౌదరి దర్శకత్వంలో తోటకూర శివరామ కృష్ణారావు నిర్మించారు. సునీల్ కశ్యప్ సంగీతం అందించిన ఈ సినిమాలోని 'నిను చూసినా కనే...' అనే తొలి వీడియో సాంగ్‌ని తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ కేఎల్ దామోదర ప్రసాద్ విడుదల చేశారు. ఈ పాటకి కరుణాకర్ సాహిత్యం అందించారు. టి. హర్షచౌదరి మాట్లాడుతూ– ''వినోదం, భావోద్వేగాలను రంగరించి ఆద్యంతం ఆకట్టుకునేలా రూపొందించిన ఈ సినిమాలో యువతకు ఓ మంచి సందేశం ఉంది'' అన్నారు. ''మా సినిమాని ఈ నెలలోనే రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. అన్ని వర్గాల వారినీ ఆకట్టుకునేలా ఉంటుంది'' అన్నారు శివరామకృష్ణారావు. ఈ చిత్రానికి కెమెరా: దాము నర్రావుల, సమర్పణ: సుకన్య.

అమ్మని ఇష్టపడేవాళ్లు రుద్రుడుని ఇష్టపడతారు

– రాఘవా లారెన్స్

''అటు సినిమాలు, ఇటు సేవా కార్యక్రమాలను బ్యాలెన్స్ చేయడం మొదట్లో కష్టంగా ఉండేది. తర్వాత అలవాటైంది. ఇప్పటివరకూ దాదాపు 150 మంది పిల్లలకు ఆపరేషన్లు చేయించాను. సినిమాల్లో హీరోగా ఉండటం కంటే రియల్ లైఫ్‌లో హీరోగా ఉండాలనేది నా కోరిక'' అన్నారు రాఘవా లారెన్స్. కతిరేశన్ దర్శకత్వంలో రాఘవా లారెన్స్, ప్రియా భవానీ శంకర్ జంటగా రూపొందిన చిత్రం 'రుద్రుడు'. ఈ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో నేడు విడుదలవుతోంది. నిర్మాత 'ఠాగూర్' మధు 'రుద్రుడు'ని తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా రాఘవా లారెన్స్ చెప్పిన విశేషాలు.



● 'రుద్రుడు' మదర్ సెంటిమెంట్ ఫిల్మ్. నా ప్రతి సినిమాలో ఏదో ఒక మంచి సందేశం ఉన్నట్టే ఇందులోనూ అమ్మానాన్నల గురించి ఓ చక్కని సందేశం ఉంది. ఈ చిత్రంలో ఐటీ ఉద్యోగం చేసే ఒక మధ్య తరగతి కుర్రాడిలా కనిపిస్తాను. అలాంటి మిడిల్ క్లాస్ అబ్బాయిని పరిస్థితులు ఎలా మాస్‌గా మార్చాయి? అనేది ఈ సినిమాలో ఆసక్తిగా ఉంటుంది. అమ్మని ఇష్టపడేవాళ్లంతా 'రుద్రుడు' మూవీని ఇష్టపడతారు. ● నన్ను కొత్తగా చూపించాలనే కతిరేశన్‌గారి తపన నాకు బాగా నచ్చింది. ఈ చిత్రంలోని భావోద్వేగాలు, థ్రిల్, వినోదం, మాస్ ఎపిసోడ్స్ ప్రేక్షకులకు వంద శాతం చేరువ అవుతాయి. ● 'ఠాగూర్' మధుగారు నాకు లక్కీ ప్రొడ్యూసర్. నాపై ఆయనకి చాలా నమ్మకం. మరోసారి ఆ నమ్మకాన్ని 'రుద్రుడు' నిలబెట్టుకుంటుంది. ఈ చిత్రంలో శరత్ కుమార్‌గారు విలన్‌గా చేశారు. నా పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో ఆయన పాత్ర కూడా అదే స్థాయిలో ఉంటుంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం, సామ్ సీఎస్ నేపథ్య సంగీతం అద్భుతంగా ఉంటాయి. 'అఖండ' సినిమా ఫైట్స్ నాకు నచ్చడంతో ఆ మూవీకి పని చేసిన శివ మాస్టర్‌ని తీసుకున్నాం. 'రుద్రుడు'లో కథకు తగ్గట్టు యాక్షన్‌ని డిజైన్ చేశారాయన. ప్రస్తుతం 'చంద్రముఖి 2, జిగర్తాండ 2' సినిమాల్లో నటిస్తున్నాను. అలాగే డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ కథ, స్క్రీన్ ప్లే అందించి, నిర్మిస్తున్న మరో చిత్రంలో నటిస్తున్నాను.

టైటిల్ బాగుంది

– విజయేంద్ర ప్రసాద్


● విజయేంద్ర ప్రసాద్, ఎల్ఎల్ బాబు

''నాతో నేను' మూవీ టైటిల్ బాగుంది. ఫీల్ గుడ్ లవ్‌స్టోరీతో ఈ చిత్రం రూపొందినట్లు తెలుస్తోంది. కొత్త నిర్మాతలు చేస్తున్న ఈ తొలి ప్రయత్నం విజయం సాధించాలి'' అని రచయిత, దర్శకుడు, ఎంపీ విజయేంద్ర ప్రసాద్ అన్నారు. సాయికుమార్, శ్రీనివాస్ సాయి, ఆదిత్య ఓం, దీపాలీ రాజ్‌పుత్, ఐశ్వర్య, రాజీవ్ కనకాల కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'నాతో నేను'. 'జబర్దస్త్' ఫేమ్ శాంతికుమార్ తుర్లపాటి దర్శకత్వంలో ఎల్ఎల్ బాబు సమర్పణలో ప్రశాంత్ టంగుటూరి నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను విజయేంద్ర ప్రసాద్ విడుదల చేశారు. ''శాంతికుమార్ మంచి కథతో ఈ సినిమా తీస్తున్నారు'' అన్నారు సాయికుమార్. ''ప్రేక్షకులకు ఒక మంచి సినిమా చూపించబోతున్నాం'' అన్నారు ప్రశాంత్ టంగుటూరి.

నువ్వు నాకే...

దర్శకుడు కె. దశరథ్ అందించిన కథతో రూపొందుతోన్న చిత్రం 'లవ్ యూ రామ్'. రోహిత్ బెహల్, అపర్ణ జనార్దనన్ జంటగా డీవై చౌదరి దర్శకత్వం వహిస్తున్నారు. డీవై చౌదరి, కె. దశరథ్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. కె. వేద సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'తూ మేరా..' (నువ్వు నాకే) అంటూ సాగే మెలోడీ పాటని విడుదల చేశారు. ''క్లాసిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం ఇది. 'తూ మేరా..' పాటని మంచి మెలోడీగా కంపోజ్ చేశారు వేద'' అని చిత్రయూనిట్ పేర్కొంది.


● రోహిత్, అపర్ణ

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	38	60,431
నిఫ్టీ ▲	16	17,828

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	12,126	▲	197
డోజోన్స్	33,925	▲	279
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,843	▲	19
డాక్స్	15,729	▲	26
షాంఘై	3,318	▽	9
నికాయ్	28,157	▲	74

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	60,880	▲	267
బంగారం (22 క్యారట్)	60,636	▲	264
వెండి (కేజీ)	75,869	▲	929

ఇన్ఫోసిస్.. ఓకే

- క్యూ4 నికర లాభం రూ. 6,128 కోట్లు
- ఈ ఏడాదికి 4-7 శాతం వృద్ధి అంచనా
- పూర్తి ఏడాది లాభం 24,095 కోట్లు

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దేశీ దిగ్గజం ఇన్ఫోసిస్ లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో అంచనాలకంటే దిగువన ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం వార్షికంగా 8 శాతం ఎగసింది. రూ. 6,128 కోట్లను తాకింది. త్రైమాసికవారీ(క్యూ3)గా చూస్తే ఇది 7 శాతం తక్కువకాగా.. అంతక్రితం ఏడాది(2021-22) ఇదే కాలంలో రూ. 5,686 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 16 శాతం వృద్ధితో రూ. 37,441 కోట్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24)లో ఆదాయం 4-7 శాతం స్థాయిలో పుంజుకోగలదని తాజా అంచనాలు(గైడెన్స్) ప్రకటించింది. వెరసి ఐటీ సేవలకు నంబర్ టూ ర్యాంకులో ఉన్న కంపెనీ 2019 తదుపరి మళ్లీ నెమ్మదించిన గైడెన్స్‌ను వెలువరించింది. ఈ ఏడాది 20-22 శాతం స్థాయిలో నిర్వహణ లాభ మార్జిన్లు సాధించే వీలున్నట్లు పేర్కొంది.

పూర్తి ఏడాదికి

మార్చితో ముగిసిన గతేడాదికి ఇన్ఫోసిస్ నికర లాభం 9 శాతం బలపడి రూ. 24,095 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం 21 శాతం జంప్‌చేసి రూ. 1,46,767 కోట్లకు చేరింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3) ఫలితాల విడుదల సందర్భంగా కంపెనీ గతేడాది ఆదాయంలో 16-16.5 శాతం వృద్ధిని అంచనా వేసింది. వెరసి అంతక్రితం ప్రకటించిన 15-16 శాతం గైడెన్స్‌ను మెరుగుపరచింది. క్యూ4లో ఉత్తర అమెరికా నుంచి 61 శాతం ఆదాయం లభించగా.. యూరోపియన్ ప్రాంతం నుంచి 27 శాతం సమకూరింది. కాగా.. క్యూ4లో ఆర్జించిన పటిష్ట ఫ్రీక్యాష్ ఫ్లో నేపథ్యంలో తుది డివిడెండును ప్రకటించినట్లు సీఎఫ్‌వో నీలాంజన్ రాయ్ వెల్లడించారు. పూర్తి ఏడాదికి అంతక్రితం డివిడెండుతో పోలిస్తే 10 శాతం అధికంగా చెల్లించినట్లు పేర్కొన్నారు. మూలధన కేటాయింపుల పాలసీకి అనుగుణంగా మరోసారి షేర్ల బైబ్యాక్‌ను విజయవంతంగా పూర్తిచేసినట్లు తెలియజేశారు.



ఫలితాల ప్రకటన సందర్భంగా ఇన్ఫీ సీఈఓ సలీల్ పరేఖ్ (ఎడమ వ్యక్తి), సీఎఫ్‌ఓ నీలాంజన్ రాయ్

ఫలితాల్లో హైలైట్స్...

- వాటాదారులకు షేరుకి రూ. 17.50 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. దీంతో గతేడాదికి మొత్తం రూ. 34 డివిడెండ్ చెల్లించినట్లయ్యింది.
- క్యూ4లో 2.1 బిలియన్ డాలర్ల విలువైన డీల్స్ కుదుర్చుకుంది. క్యూ3లో 3.3 బిలియన్ డాలర్లు, క్యూ2లో 2.7 బిలియన్ డాలర్ల చొప్పున పొందింది.
- గతేడాది మొత్తం 9.8 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులు సంపాదించింది.
- ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు క్యూ3తో పోలిస్తే 24.3% నుంచి 20.9 శాతానికి దిగివచ్చింది.
- మొత్తం సిబ్బంది సంఖ్య 3,43,234కు చేరింది. గత త్రైమాసికంతో పోలిస్తే నికరంగా 3,611 మంది ఉద్యోగులు తగ్గారు.

అక్షతకు రూ. 68 కోట్లు

ఇన్ఫోసిస్ తాజాగా షేరుకి రూ. 17.5 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. దీంతో కంపెనీలో 3.89 కోట్ల షేర్లుగల బ్రిటిష్ ప్రధాని రిషీ సునక్ భార్య అక్షత రూ. 68.17 కోట్లు అందుకోనున్నారు. ఇందుకు జూన్ 2 రికార్డ్ డేట్. కంపెనీ ఇప్పటికే రూ. 16.5 మధ్యంతర డివిడెండ్ చెల్లించింది. దీంతో అక్షత మొత్తం రూ. 132 కోట్లకుపైగా డివిడెండ్ అందుకోనున్నారు. గురువారం షేరు ధర రూ. 1,389(బీఎస్‌ఈ)తో చూస్తే ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు నారాయణ మూర్తి కుమార్తె అక్షతకు గల వాటా విలువ రూ. 5,400 కోట్లు. కాగా.. 2021-22 ఏడాదిలోనూ డివిడెండ్ రూపేణా అక్షత ఇన్ఫోసిస్ నుంచి దాదాపు రూ. 121 కోట్లు అందుకోవడం గమనార్హం!

క్లయింట్ల ఆసక్తి...

'డిజిటల్, క్లౌడ్, ఆటోమేషన్ సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టితో 2022-23లో పటిష్ట పనితీరును చూపాం. పరిస్థితులు మారినప్పటికీ కంపెనీ సామర్థ్యం, చౌక వ్యయాలు, సమీకృత అవకాశాలు వంటివి క్లయింట్లను ఆకట్టు కుంటున్నాయి. ఇది భారీ డీల్స్‌కు దారి చూపుతోంది' అని ఇన్ఫోసిస్ సీఈఓ, ఎండీ సలీల్ పరేఖ్ వ్యాఖ్యానించారు.

ఫలితాల నేపథ్యంలో ఇన్ఫోసిస్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 3 శాతంపైగా క్షీణించి రూ. 1,389 వద్ద ముగిసింది.

ఎగుమతులు @ 447 బిలియన్ డాలర్లు

- 2022-23లో 6 శాతం వృద్ధి
- దిగుమతులు 16.5 శాతం పెరిగి 714 బిలియన్ డాలర్లకు అప్
- వాణిజ్యలోటు 267 బిలియన్ డాలర్లు



రోమ్: భారత్ వస్తు ఎగుమతులు 2022-23 ఆర్థిక సంవత్సరంలో 2021-22తో పోల్చితే 6 శాతం పెరిగి 447 బిలియన్ డాలర్లకు చేరినట్లు వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఇదే సమయంలో దేశ దిగుమతులు 16.5 శాతం ఎగసి 714 బిలియన్ డాలర్లకు చేరినట్లు వెల్లడించారు. వెరసి ఎగుమతులు-దిగుమతుల మధ్య వాణిజ్యలోటు 267 బిలియన్ డాలర్లకు చేరింది. పెట్రోలియం, ఫార్మా, రసాయనాలు, సముద్ర ఉత్పత్తుల రంగాల నుంచి ఎగుమతుల్లో మంచి వృద్ధి నమోదయినట్లు ఆయన వెల్లడించారు. ఫ్రాన్స్, ఇటలీల్లో ఏప్రిల్ 11 నుంచి 13వ తేదీ వరకూ పర్యటించిన గోయల్ ఈ సందర్భంగా పలు కంపెనీల సీఈఓలతో భేటీ అయ్యారు. ఆయా దేశాలతో వాణిజ్య, పెట్టుబడుల సంబంధాలు మరింత పురోగమించడం లక్ష్యంగా ఈ పర్యటన సాగింది. ఈ సందర్భంగా ఆయన విలేకరులకు తెలిపిన అంశాల్లో ముఖ్యమైనవి...

- వస్తు, సేవలు కలిపి ఎగుమతులు కొత్త రికార్డులో 14 శాతం వృద్ధి నమోదయ్యింది. విలువలో 770 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఒక్క సేవల ఎగుమతులు చూస్తే, 27.16 శాతం పెరిగి 323 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇక విభాగాల దిగుమతులు 892 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పటికీ భారత్ ఎకానమీ క్రియాశీలత, పురోగమనానికి సూచికలుగా ఎగుమతి-దిగుమతి గణాంకాలు ఉన్నాయి.
- అన్ని దేశాలతో పటిష్ట వాణిజ్య సంబంధాలు నెరపడానికి భారత్ కృషి సల్పుతోంది.
- ఇన్వెస్టర్ల పెట్టుబడులకు భారత్ అత్యంత ఆకర్షణ ప్రదేశంగా ఉంది. ఎకానమీ పరంగా చూస్తే, భారత్ ఎంతో పటిష్టంగా ఉంది. వస్తు, సేవల పన్ను వసూళ్లు భారీగా నమోదవుతున్నాయి. ఎగుమతులు బాగున్నాయి. ద్రవ్యోల్బణం దిగివస్తోంది. విదేశీ మారకద్రవ్య నిల్వలు పటిష్టంగా 600 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. విదేశాల నుంచి భారతీకు పంపుతున్న రెమిటెన్సులు 100 బిలియన్ డాలర్లపైగానే ఉంటున్నాయి. పెట్టుబడుల ప్రవాహం బాగుంది.
- ఎగుమతుల భారీ వృద్ధి లక్ష్యంగా సమర్థవంతమైన విదేశీ వాణిజ్య పాలసీ (ఎఫ్‌టీపీ)ని భారత్ ఇప్పటికే ఆవిష్కరించింది. 2030 నాటికి దేశ ఎగుమతులను ఏకంగా 2 ట్రిలియన్ డాలర్లకు చేర్చడంతో పాటు రూపాయిని గ్లోబల్ కరెన్సీగా చేయాలని పాలసీలో నిర్దేశించడం జరిగింది.

జోయాలుక్కాస్‌లో అక్షయ తృతీయ ఆఫర్లు



హైదరాబాద్: ఆభరణాల సంస్థ జోయాలుక్కాస్ అక్షయ తృతీయ సందర్భంగా జ్యుయలరీ కొనుగోళ్లపై ప్రత్యేకమైన క్యాష్‌బ్యాక్ ఆఫర్లను ప్రకటించింది. రూ.50,000 అంతకుపైబడిన వజ్రాలు, అన్‌కట్ వజ్రాలను కొనుగోలు చేసిన కస్టమర్లకు రూ.2,000 విలువైన గిఫ్ట్ వోచర్‌ను ఇవ్వనుంది. అలాగే రూ.50,000, అంతకు పైబడిన బంగారు ఆభరణాలు కొనుగోలు చేసిన వారికి రూ.1,000 విలువ గల గిఫ్ట్ వోచర్, రూ.10,000 విలువైన వెండి ఆభరణాలు కొనుగోలు చేసిన కస్టమర్లకు రూ.500 విలువైన గిఫ్ట్ వోచర్‌ను అందించనున్నట్లు తెలిపింది. అలాగే ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు ద్వారా చెల్లింపులు జరిపిన వారికి 5 శాతం రాయితీ కూడా ఇస్తుంది. నేటి నుంచి(14వ తేదీ) ప్రారంభమై ఈ నెల 28వ తేదీ వరకు అందుబాటులో ఉండే ఈ అద్భుతమైన ఆఫర్‌ను కస్టమర్లంతా వినియోగించుకోవాలని కంపెనీ ఎండీ జాయ్ అలుక్కాస్ కోరారు.

తొమ్మిదో రోజూ లాభాలే

- ఆదుకున్న ఆఖరి గంట కొనుగోళ్లు
- ఇంట్రాడేలో ఒడిదుడుకులు
- సెన్సెక్స్ లాభం 38 పాయింట్లు
- 16 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- అంబేద్కర్ జయంతి సందర్భంగా నేడు మార్కెట్లకు సెలవు

ముంబై: ఆఖర్లో బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీల ర్యాలీ తొమ్మిదోరోజూ కొనసాగింది. గడిచిన రెండేళ్లలో సూచీలు వరుసగా తొమ్మిది రోజుల పాటు ర్యాలీ చేయడం ఇదే తొలిసారి. జాతీయ, అంతర్జాతీయంగా నెలకొన్న బలహీన సంకేతాల కారణంగా ఇంట్రాడేలో సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. సెన్సెక్స్ ఉదయం 29 పాయింట్ల నష్టంతో 60,364 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 405 పాయింట్ల పరిధిలో కదలాడి 60,081 వద్ద కనిష్టాన్ని 60,487 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 38 పాయింట్ల స్వల్ప లాభంతో 60,431 వద్ద ముగిసింది. నిఫ్టీ అయిదు పాయింట్లను కోల్పోయి 17,807 వద్ద 17,635 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ఇంట్రాడేలో 17,730 వద్ద కనిష్టాన్ని 17,842 వద్ద గరిష్టాన్ని తాకింది. ఆఖరికి 16 పాయింట్లు పెరిగి 17,828 వద్ద స్థిరపడింది. ఐటీ, ఫార్మా, ఇంధన, మీడియా రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ మిడ్ క్యాప్ సూచీ 0.33%, స్మాల్ క్యాప్ సూచీ 0.16 శాతం చొప్పున లాభపడ్డాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 28 పైసలు బలపడి 81.85 వద్ద స్థిరపడింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.222 కోట్ల షేర్లను కొన్నారు.



సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.274 కోట్ల షేర్లను అమ్మేశారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా నేడు మార్కెట్లకు సెలవు. శని, ఆది వారాలు సాధారణ సెలవు దినాలు కావడంతో ఎక్స్ఛేంజీలు తిరిగి సోమవారం యథావిధిగా ప్రారంభమవుతాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి. "టీసీఎస్ క్యూ4 ఆర్థిక ఫలితాల సందర్భంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసులు, బీమా విభాగం(బీఎఫ్ఎస్ఐ) పనితీరు, అవుట్‌లుక్‌పై యాజమాన్యం ఆందోళనకర వ్యాఖ్యలతో దేశీయ ఐటీ రంగ షేర్లన్నీ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. మరోవైపు అమెరికాలో ద్రవ్యోల్బణం దిగివచ్చినప్పటికీ.., బ్యాంకింగ్ సంక్షోభం కారణంగా మాంద్యం పరిస్థితులు తలెత్తవచ్చని ఎఫ్ఓఎంసీ మినిట్స్ సూచించడంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా కదలాడాయి. ఈ జాతీయ, అంతర్జాతీయ పరిణామాల ప్రభావంతో సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి" అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

రిలయన్స్ కేజీ-డీ6 గ్యాస్‌కు డిమాండ్

ఐవోసీ టాప్ బిడ్డర్

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్‌కి చెందిన కేజీ-డీ6 బ్లాక్ నుంచి వెలికితీసే గ్యాస్ విక్రయం కోసం నిర్వహించిన వేలానికి మంచి స్పందన కనిపించింది. వివిధ రంగాలకు చెందిన 41 కంపెనీలు వేలంలో పాల్గొనగా 29 సంస్థలు 5 ఏళ్ల కాలానికి గ్యాస్‌ను కొనుగోలు చేశాయి. ప్రభుత్వ రంగ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ), అదానీ-టోటల్ గ్యాస్, షెల్ తదితర కంపెనీలు వీటిలో ఉన్నాయి. రోజుకు 6 మిలియన్ ఘనపు మీటర్ల (ఎంసీఎండీ) గ్యాస్‌ను విక్రయించగా ఐవోసీ దాదాపు సగభాగాన్ని (2.9 ఎంసీఎండీ) దక్కించుకుంది. గెయిల్ 0.7 ఎంసీఎండీ, అదానీ-టోటల్ గ్యాస్ 0.4 ఎంసీఎండీ, షెల్ 0.5 ఎంసీఎండీ, జీఎస్‌పీసీ 0.25 ఎంసీఎండీ, ఐజీఎస్ మరో 0.5 ఎంసీఎండీ గ్యాస్‌ను కొనుగోలు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. నిర్దిష్ట ఫార్ములా ప్రకారం గ్యాస్ ధర యూనిట్‌కు (ఎంబీటీయూ) 13.35 డాలర్లుగా ఉంటుందని పేర్కొన్నాయి. అయితే, సంక్లిష్ట ప్రాంతాల నుంచి ఉత్పత్తి చేసే గ్యాస్‌కు ప్రభుత్వం నిర్దేశించిన సీలింగ్ రేటును చెల్లించాల్సి ఉంటుందని వివరించాయి. ఏప్రిల్-సెప్టెంబర్ కాలానికి ఇది 12.12 డాలర్లుగా ఉందని తెలిపాయి. ఈ రేటును కేంద్రం 6 నెలలకోసారి సవరిస్తుంది. రిలయన్స్, దాని భాగస్వామి బీపీ ఈ జనవరిలోనే వేలం నిర్వహించాలని భావించినప్పటికీ జనవరి 13న కేంద్రం కొత్త ధరల విధానాన్ని ప్రకటించింది. దీంతో వేలాన్ని వాయిదా వేసుకుని, మార్చి 9 నుంచి నిర్వహించింది.





సామ్సన్‌పై రూ. 12 లక్షల జరిమానా

రాజస్తాన్ రాయల్స్ జట్టు కెప్టెన్ సంజూ సామ్సన్‌పై రూ. 12 లక్షల జరిమానా విధించారు. చెన్నై సూపర్ కింగ్స్ జట్టుతో బుధవారం జరిగిన మ్యాచ్‌లో రాజస్తాన్ జట్టు నిర్ణీత సమయంలో పూర్తి ఓవర్ల కోటా పూర్తి చేయనందుకు ఐపీఎల్ నిర్వాహకులు ఈ చర్య తీసుకున్నారు. బెంగళూరు జట్టు కెప్టెన్ డుప్లెసిస్ తర్వాత జరిమానా ఎదుర్కొన్న రెండో కెప్టెన్ సామ్సన్. మరోవైపు ఇదే మ్యాచ్‌లో అంపైరింగ్‌పై అసంతృప్తి వ్యక్తం చేసిన రాజస్తాన్ రాయల్స్ స్పిన్నర్ అశ్విన్‌పై అతని మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించారు.

హైదరాబాద్ ఎఫ్‌సీ మ్యాచ్ 'డ్రా'

సూపర్ కప్ టోర్నీలో హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) తొలి 'డ్రా' నమోదు చేసింది. కేరళలో జరుగుతున్న ఈ టోర్నీలో ఈస్ట్ బెంగాల్ జట్టుతో జరిగిన గ్రూప్ 'బి' రెండో లీగ్ మ్యాచ్‌ను హైదరాబాద్ 3-3తో 'డ్రా'గా ముగించింది. సోమవారం జరిగే తమ చివరి లీగ్ మ్యాచ్‌లో ఒడిశాతో హైదరాబాద్ ఆడుతుంది.

విజేత షణ్ముఖ



ముంబై: అఖిల భారత 'ఫిడే' రేటింగ్ చెస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ పి.షణ్ముఖ విజేతగా నిలిచాడు. తొమ్మిది రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో షణ్ముఖతోపాటు విక్రమాదిత్య కులకర్ణి, సౌరవ్ ఖేరెడ్కర్ 7.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించారు. షణ్ముఖకు టైటిల్ ఖరారు కాగా... విక్రమాదిత్య రన్నరప్‌గా, సౌరవ్ సెకండ్ రన్నరప్‌గా నిలిచారు. ఈ టోర్నీలో షణ్ముఖ ఏడు గేముల్లో గెలిచి, ఒక గేమ్‌ను 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడిపోయాడు. విజేతగా నిలిచిన షణ్ముఖకు ట్రోఫీతోపాటు రూ. 75 వేలు ప్రైజ్‌మనీగా లభించింది.

డైమండ్ లీగ్ టోర్నీతో నీరజ్ సీజన్ షురూ



న్యూఢిల్లీ: భారత స్టార్ జావెలిన్ త్రోయర్, టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా ఈ ఏడాది అంతర్జాతీయ సీజన్‌ను డైమండ్ లీగ్ టోర్నీతో మొదలుపెట్టనున్నాడు. గత ఏడాది సెప్టెంబర్‌లో డైమండ్ లీగ్ ఫైనల్లో నీరజ్ పసిడి పతకం గెలిచి చాంపియన్‌గా నిలిచాడు. ఈ ఏడాది డైమండ్ లీగ్ సీజన్‌లో మొత్తం 14 వన్డే టోర్నీలు ఉన్నాయి. మే 5న దోహాలో తొలి టోర్నీ జరుగుతుంది.

జూనియర్ ప్రపంచకప్ షూటింగ్ టోర్నీకి ధనుశ్ శ్రీకాంత్



న్యూఢిల్లీ: జూన్ తొలి వారంలో జర్మనీలో జరిగే ప్రపంచకప్ జూనియర్ షూటింగ్ టోర్నీలో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. హైదరాబాద్‌కు చెందిన ధనుశ్ శ్రీకాంత్‌కు ఈ జట్టులో చోటు దక్కింది. 20 ఏళ్ల ధనుశ్ 2019లో దోహాలో జరిగిన ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత, టీమ్ ఈవెంట్‌లో... 2021లో పెరూ ఆతిథ్యమిచ్చిన ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాలు సాధించాడు.

గుజరాత్ గెలిచె...

- ఒక బంతి మిగిలి ఉండగా నెగ్గిన డిఫెండింగ్ చాంపియన్
- రాణించిన గిల్, మోహిత్ శర్మ
- పంజాబ్ కింగ్స్‌కు రెండో ఓటమి

మొహాలి: డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఐపీఎల్ టోర్నీలో తమ ఖాతాలో మూడో విజయాన్ని జమ చేసుకుంది. పంజాబ్ కింగ్స్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా సారథ్యంలోని గుజరాత్ టైటాన్స్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. గుజరాత్ టాస్ నెగ్గి ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 153 పరుగులు సాధించింది. పంజాబ్ జట్టులో ఏ ఒక్కరూ భారీ ఇన్నింగ్స్ ఆడలేకపోయారు. నిలదొక్కుకుంటున్న దశలో పెవిలియన్ చేరుకున్నారు. క్రీజులో ఉన్నంతసేపు ధాటిగా ఆడిన మాథ్యూ షార్ట్ (24 బంతుల్లో 36; 6 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. జితేశ్ శర్మ (23 బంతుల్లో 25; 5 ఫోర్లు), స్యామ్ కరన్ (22 బంతుల్లో 22; 1 ఫోర్, 1 సిక్స్), షారుఖ్ ఖాన్ (9 బంతుల్లో 22; 1 ఫోర్, 2 సిక్స్‌లు), రాజపక్స (26 బంతుల్లో 20; 1 ఫోర్) ఫర్వాలేదనిపించారు. గుజరాత్ పేస్ బౌలర్, 2020 తర్వాత మళ్లీ ఐపీఎల్ మ్యాచ్ ఆడుతున్న 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మోహిత్ శర్మ 18 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం గుజరాత్ టైటాన్స్ జట్టు 19.5 ఓవర్లలో 4 వికెట్లకు 154 పరుగులు చేసి గెలిచింది. శుబ్‌మన్ గిల్ (49 బంతుల్లో 67; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో గుజరాత్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఓపెనర్లు వృద్ధిమాన్ సాహా (19 బంతుల్లో 30; 5 ఫోర్లు), గిల్ ధాటిగా ఆడటంతో గుజరాత్ పవర్ ప్లేలో 56 పరుగులు సాధించింది. అనంతరం సాయి సుదర్శన్, హార్దిక్ పాండ్యా తక్కువ స్కోర్లకే వెనుదిరిగినా... మరోవైపు శుబ్‌మన్ గిల్ గుజరాత్ స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు.



అచితూచి ఆడుతూనే అవకాశం దొరికినపుడల్లా బంతిని బౌండరీ దాటించిన గిల్ 40 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. డేవిడ్ మిల్లర్ (18 బంతుల్లో 17 నాటౌట్; 1 ఫోర్)తో కలిసి నాలుగో వికెట్‌కు 42 పరుగుల భాగస్వామ్యం జోడించాడు. చివరి ఓవర్లో గుజరాత్ విజయానికి 7 పరుగులు అవసరమయ్యాయి. స్యామ్ కరన్ వేసిన ఈ ఓవర్లో తొలి బంతికి మిల్లర్ సింగిల్ తీయగా... రెండో బంతికి గిల్ బౌల్డయ్యాడు. తెవాటియా క్రీజులోకి వచ్చి సింగిల్ తీశాడు. నాలుగో బంతికి మిల్లర్ కూడా సింగిల్ తీశాడు. దాంతో గుజరాత్ విజయానికి చివరి 2 బంతుల్లో 4 పరుగులు కావల్సి రావడంతో కాస్త ఉత్కంఠ నెలకొంది. అయితే ఐదో బంతికి రాహుల్ తెవాటియా (2 బంతుల్లో 5 నాటౌట్; 1 ఫోర్) స్కూప్ షాట్‌తో బంతిని బౌండరీకి తరలించడంతో గుజరాత్ విజయం ఖరారైంది.

అంతకుముందు పంజాబ్ జట్టుకు తొలి ఓవర్లోనే దెబ్బ పడింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ ఖాతా తెరవకుండానే షమీ బౌలింగ్‌లో రషీద్ ఖాన్‌కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. కెప్టెన్ శిఖర్ ధావన్ (8 బంతుల్లో 8; 2 ఫోర్లు) రెండు ఫోర్లు కొట్టినా భారీ షాట్‌కు యత్నించి నిష్క్రమించాడు. ప్రమాదకరంగా కనిపిస్తున్న షార్ట్‌ను రషీద్ బౌల్డ్ చేయడంతో పంజాబ్ ఇబ్బందుల్లో పడింది. చివర్లో షారుఖ్ ధాటిగా ఆడటంతో పంజాబ్ స్కోరు 150 దాటింది.



స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ సింగ్ (సి) రషీద్ ఖాన్ (బి) షమీ 0; శిఖర్ ధావన్ (సి) జోసెఫ్ (బి) లిటిల్ 8; మాథ్యూ షార్ట్ (బి) రషీద్ ఖాన్ 36; రాజపక్స (సి) గిల్ (బి) జోసెఫ్ 20; జితేశ్ శర్మ (సి) సాహా (బి) మోహిత్ శర్మ 25; స్యామ్ కరన్ (సి) గిల్ (బి) మోహిత్ శర్మ 22; షారుఖ్ ఖాన్ (రనౌట్) 22; హర్‌ప్రీత్ బ్రార్ (నాటౌట్) 8; రిషి ధావన్ (రనౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 153. వికెట్ల పతనం: 1-0, 2-28, 3-55, 4-92, 5-115, 6-136, 7-152, 8-153. బౌలింగ్: షమీ 4-0-44-1, జోష్ లిటిల్ 4-0-31-1, అల్జారి జోసెఫ్ 4-0-32-1, రషీద్ ఖాన్ 4-0-26-1, మోహిత్ శర్మ 4-0-18-2.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) షార్ట్ (బి) రబడ 30; గిల్ (బి) స్యామ్ కరన్ 67; సాయి సుదర్శన్ (సి) ప్రభ్‌సిమ్రన్ సింగ్ (బి) అర్ష్‌దీప్ 19; హార్దిక్ పాండ్యా (సి) స్యామ్ కరన్ (బి) హర్‌ప్రీత్ బ్రార్ 8; డేవిడ్ మిల్లర్ (నాటౌట్) 17; రాహుల్ తెవాటియా (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 8; మొత్తం (19.5 ఓవర్లలో 4 వికెట్లకు) 154. వికెట్ల పతనం: 1-48, 2-89, 3-106, 4-148. బౌలింగ్: అర్ష్‌దీప్ 4-0-33-1, రబడ 4-0-36-1, హర్‌ప్రీత్ 4-0-20-1, స్యామ్ కరన్ 3.5-0-25-1, రాహుల్ చహర్ 3-0-24-0, మాథ్యూ షార్ట్ 1-0-8-0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	4	3	1	6	1.588
లక్నో	4	3	1	6	1.048
గుజరాత్	4	3	1	6	0.341
కోల్‌కతా	3	2	1	4	1.375
చెన్నై	4	2	2	4	0.225
పంజాబ్	4	2	2	4	-0.226
బెంగళూరు	3	1	2	2	-0.800
ముంబై	3	1	2	2	-0.879
హైదరాబాద్	3	1	2	2	-1.502
ఢిల్లీ	4	0	4	0	-1.576

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా x హైదరాబాద్ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

అమన్ 'పసిడి పట్టు'

ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్‌కు స్వర్ణం

అస్తానా (కజకిస్తాన్): ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో ఎట్టకేలకు భారత్ ఖాతాలో తొలి స్వర్ణ పతకం చేరింది. ఈ టోర్నీ ఐదో రోజు గురువారం పురుషుల ఫ్రీస్టయిల్ 57 కేజీల విభాగంలో అమన్ సెహ్రావత్ భారత్‌కు తొలి పసిడి పతకాన్ని అందించాడు. ఫైనల్లో అమన్ 9-4 పాయింట్ల తేడాతో అల్మాజ్ సమన్‌బెకోవ్ (కిర్గిస్తాన్)పై గెలుపొందాడు. నేరుగా క్వార్టర్ ఫైనల్ బౌట్ ఆడిన అమన్ 7-1తో రికుటో అరాయ్ (జపాన్)పై, సెమీఫైనల్లో 7-4తో వాన్‌హావో జు (చైనా)పై విజయం సాధించాడు. అమన్ ప్రదర్శనతో వరుసగా నాలుగో ఏడాది 57 కేజీల విభాగంలో భారత్ ఖాతాలోనే స్వర్ణ పతకం చేరడం విశేషం. 2020, 2021, 2022లలో రవి కుమార్ దహియా ఈ విభాగంలో విజేతగా నిలిచాడు. గాయం కారణంగా ఈసారి రవి ఈ టోర్నీకి దూరంగా ఉన్నాడు. ఢిల్లీలోని విఖ్యాత ఛత్రశాల్ స్టేడియంలో ప్రాక్టీస్ చేసే అమన్ గత ఏడాది అండర్-23 ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనూ స్వర్ణ పతకం సాధించాడు. ఈ ఏడాది అమన్‌కిది రెండో పతకం. ఫిబ్రవరిలో జాగ్రెబ్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నీలో అమన్ కాంస్య పతకం గెలిచాడు. గురువారం జరిగిన ఇతర నాలుగు వెయిట్ కేటగిరీల్లో మూడింట భారత రెజ్లర్లకు నిరాశ ఎదురైంది. 79 కేజీల విభాగంలో దీపక్ కుక్నా కాంస్య పతకం నెగ్గగా... 97 కేజీల విభాగంలో దీపక్ నెహ్రా కాంస్య పతక బౌట్‌లో ఓడిపోయాడు. దీపక్ కుక్నా 12-1తో షురాత్ బొజొరోవ్ (తజికిస్తాన్)పై గెలుపొందగా... దీపక్ నెహ్రా 9-12తో మక్సూద్ వెసలోవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో పోరాడి ఓడిపోయాడు. అనూజ్ (65 కేజీలు) క్వార్టర్ ఫైనల్లో, ములాయం యాదవ్ (70 కేజీలు) క్వాలిఫయింగ్ రౌండ్‌లో ఓటమి పాలయ్యారు.



అమన్

డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడికి ఊరట!



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలను నిరూపించడంలో భారత అగ్రశ్రేణి రెజ్లర్లు విఫలమయ్యారని తెలిసింది. ఈ కేసును విచారించేందుకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ దిగ్గజ బాక్సర్ మేరీకోమ్ నేతృత్వంలో పర్యవేక్షణ కమిటీని నియమించింది. ఈ కమిటీ తమ నివేదికను క్రీడా శాఖకు సమర్పించింది. కొన్నేళ్లుగా బ్రిజ్ భూషణ్ రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్నాడని, ఆయనను ఈ పదవి నుంచి తప్పించాలని ఆరోపిస్తూ జనవరిలో జంతర్‌మంతర్ వద్ద రెజ్లర్లు నిరసన చేపట్టారు. అయితే బ్రిజ్‌భూషణ్‌పై లైంగిక ఆరోపణలు నిజమేనని నిరూపించేందుకు రెజ్లర్లు వినేశ్, సాక్షి, బజరంగ్ పర్యవేక్షణ కమిటీకి కచ్చితమైన ఆధారాలు సమర్పించలేదని సమాచారం. ఈ కేసుకు సంబంధించి పలువురిని పర్యవేక్షణ కమిటీ విచారించినా ఒక్కరు కూడా బ్రిజ్ భూషణ్‌కు వ్యతిరేకంగా చెప్పలేదని క్రీడా శాఖ వర్గాలు తెలిపాయి.

భారత్‌కు తొలి ఓటమి



అంకిత

తాష్కెంట్ (ఉజ్బెకిస్తాన్): బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా జోన్ గ్రూప్-1 మహిళల టీమ్ టెన్నిస్ టోర్నీలో భారత జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. చైనా జట్టుతో గురువారం జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 0-3తో పరాజయం చవిచూసింది. తొలి సింగిల్స్‌లో రుతుజా భోస్లే 3-6, 5-7తో జియాంగ్ జిన్యు చేతిలో ఓడిపోగా... రెండో సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ అంకిత రైనా 5-7, 1-6తో యువాన్ యు చేతిలో ఓటమి పాలైంది. దాంతో భారత పరాజయం ఖరారైంది. నామమాత్రంగా జరిగిన డబుల్స్ మ్యాచ్‌లో శ్రీవల్లి రష్మిక-వైదేహి చౌదరీ ద్వయం 0-6, 1-6తో జియాంగ్ జిన్యు-యాంగ్ జావోజువాన్ జోడీ చేతిలో ఓడిపోయింది. నేడు జరిగే నాలుగో లీగ్ మ్యాచ్‌లో జపాన్‌తో భారత్ తలపడుతుంది. ఈ టోర్నీలో జపాన్ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి అజేయంగా ఉంది.

క్లుప్తంగా...

మహిళా ఉద్యోగుల భద్రతకు ఉమెన్ సేఫ్టీవింగ్ స్పెషల్‌డ్రైవ్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కీలక స్థానాలతోపాటు అన్ని స్థాయిల్లోనూ పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు అండగా నిలవడానికి రాష్ట్ర మహిళా భద్రతా విభాగం ప్రత్యేకంగా ఓ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా ఈనెల 10 నుంచి 'వర్క్‌ప్లేస్ సేఫ్టీ' అంశంపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తోంది. నెల రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఇప్పటికే ప్రతి కార్యాలయంలోనూ వేధింపుల నిరోధక కమిటీలు పనిచేస్తున్నాయి. వాటి ద్వారా పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. మాటల ద్వారా, మానసికంగా వేధించడం, ఆన్‌లైన్‌లో వేధింపులు, అలాగే లైంగిక దాడి, శారీరకంగా హింసించడం వంటి సమస్యల విషయంలో తాము అండగా ఉంటామని ఈనెల రోజుల ప్రచార కార్యక్రమంలో మహిళా భద్రతా విభాగం వివరించనుంది. ఇబ్బందులకు గురిచేసే వారిపై మహిళా భద్రతా విభాగం అధికారులకు నేరుగా లేదా వాట్సాప్ నంబర్ 9441669988లో ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. లేదా డయల్ 100కు సైతం సమాచారం ఇవ్వొచ్చని అధికారులు చెబుతున్నారు.

నేరాల శోధనకు సాంకేతిక సాధన

పోలీస్ సిబ్బందికి సీఈఐఆర్ శిక్షణలో డీజీపీ అంజనీకుమార్

సాక్షి, హైదరాబాద్: నేరాలను పరిష్కరించేందుకు పోలీస్ అధికారులు సైతం సాంకేతికంగా సన్నద్ధం కావాలని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ సూచించారు. ఈ రోజుల్లో ప్రతీ నేరం ఎలక్ట్రానిక్ పరికరాలతో అనుసంధానమై ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. మొబైల్ ఫోన్ల చోరీ కేసు దర్యాప్తులో కీలకమైన సాంకేతికత సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్)ను టెలీకమ్యూనికేషన్ విభాగం ఇటీవల అందుబాటులోకి తెచ్చింది. గురువారం డీజీపీ కార్యాలయంలో ఈ విధానంపై పోలీస్ అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్, టెలీకమ్యూనికేషన్ విభాగం డైరెక్టర్ మురళీకృష్ణ, ఇంటెలిజెన్స్ ఎస్పీ విజయ్‌కుమార్‌తో కలిసి అంజనీకుమార్ పాల్గొన్నారు. డీజీపీ మాట్లాడుతూ గుర్తింపును దొంగిలించడం ఈ రోజుల్లో అతిపెద్ద నేరంగా మారిందని, నేరగాళ్లు తాము దొంగిలించిన ఒక వ్యక్తి సమాచారం, గుర్తింపుతో మరొక వ్యక్తిని సృష్టించే ప్రమాదం ఉందన్నారు. మొబైల్ దొంగతనం వంటి నేరాలను అరికట్టేందుకు, కేసుల దర్యాప్తునకు సంబంధించిన భాగస్వాములందరినీ టెలీకమ్యూనికేషన్ శాఖ ఒకేతాటిపైకి తెచ్చిందని పేర్కొన్నారు. పోలీస్ శాఖలోకి వస్తున్న యువ అధికారులు సాంకేతికంగా ఎంతో అవగాహన కలిగి ఉంటున్నారని, వారిని సాంకేతికత నేర పరిశోధనలో మరింత ప్రోత్సహించాలని సూచించారు. సీఈఐఆర్ విధానం గురించి మహేశ్ భగవత్ మాట్లాడుతూ పోగొట్టుకున్న లేదా చోరీకి గురైన మొబైల్‌ను బ్లాక్‌చేయడం, మొబైల్ దొరికిన తర్వాత దాన్ని అన్‌బ్లాక్ చేయడం వంటి అంశాలను వివరించారు. ఈ నూతన విధానం వినియోగించుకునేలా రాష్ట్రంలోని మొత్తం 746 పోలీస్‌స్టేషన్లు, అన్ని పోలీస్ కమిషనరేట్లు, జిల్లాల లాగిన్ ఐడీలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో టెలీకమ్యూనికేషన్ విభాగం అడిషనల్ డైరెక్టర్ రాఘవరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధికి ప్రైవేటు భాగస్వామ్యం



సాక్షి, హైదరాబాద్: దేశంలో అన్ని చోట్ల టూరిజం అభివృద్ధి కేవలం ప్రభుత్వాలతోనే సాధ్యం కాదని, ప్రైవేటు వారిని కూడా ఆహ్వానిస్తున్నామని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్‌లో టూరిజం అభివృద్ధిపై జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు పెట్టుబడులతో అభివృద్ధి చేయడానికి త్వరలోనే ఢిల్లీలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎక్కడెక్కడ పర్యాటక అభివృద్ధి అవసరమో నివేదిక అడిగామని, తదనుగుణంగా కార్యాచరణ ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో రూ.472 కోట్లతో టూరిజం అభివృద్ధి పనులు చేస్తుందని, దీంట్లో రాష్ట్ర ప్రభుత్వ నిధులు లేవన్నారు. ప్రసాద్ పథకం కింద మరికొన్ని దేవాలయాలు తీసుకోవాలని రాష్ట్ర పర్యాటక మంత్రి శ్రీనివాస్ గౌడ్ కోరారని, దశల వారీగా ప్రసాద్ పథకం కింద ఆలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. సైన్స్ సిటీ కోసం 25 ఎకరాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పిన కేంద్ర మంత్రి భూమి ఇవ్వగానే పూర్తిగా కేంద్ర నిధులతోనే పనులు చేపడతామని ఆయన అన్నారు.

కౌన్సిలర్లకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ ఫోరం చైర్మన్ రాము నాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. హెల్త్ కార్డుతో పాటు ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తానని మంత్రి భరోసా ఇచ్చారని రాము నాయక్ తెలిపారు.

ఆవిష్కరణలు.. అద్భుతం

సోలార్ హ్యాండ్ డిష్ వాషర్‌కు మొదటి బహుమతి.. ఐఐటీహెచ్‌లో ఫ్యూచర్ ఇన్వెంటర్స్ ఫెయిర్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా కందిలోని హైదరాబాద్ ఐఐటీలో గురువారం ఫ్యూచర్ ఇన్వెంటర్స్ (భవిష్యత్ ఆవిష్కర్తలు) ఫెయిర్ నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 24 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణలను ఈ ఫెయిర్‌లో ప్రదర్శించారు. కామారెడ్డి జిల్లా ఇసాయిపేట్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఆవిష్కరించిన సోలార్ డిష్ వాషర్‌కు మొదటి బహుమతి లభించింది. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలు అనేది తమ నినాదం మాత్రమే కాదని, తమ విద్యాసంస్థ డీఎన్ఏ అని వ్యాఖ్యానించారు. విద్యార్థుల్లో ఎన్నో ఆలోచనలున్నాయని, సరైన మార్గదర్శకత్వం, సరైన వేదికలు లభిస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత ఉద్యోగాలు చేయడం కాదు, ఉన్నత ఉద్యోగాలను సృష్టించే అవకాశం ఈ నూతన ఆవిష్కరణలతో లభిస్తుందని చెప్పారు. కాగా ఈ ఫెయిర్‌లో మొత్తం ఐదు ఆవిష్కరణలకు బహుమతులు లభించాయి.

సోలార్ హ్యాండ్ డిష్ వాషర్





➤ వంట పాత్రలను శుభ్రం చేయడంలో ఎంతో ఉపయోగపడే నూతన సోలార్ హ్యాండ్ డిష్ వాషర్‌ను కామారెడ్డి జిల్లా ఇసాయిపేట్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఆవిష్కరించారు. అన్ని వైపులా తిరిగేందుకు వీలుండే ఓ మోటార్‌కు స్క్రబ్బర్‌తో కూడిన ప్రత్యేక పరికరం అమర్చారు. సౌర విద్యుత్‌తో పాటు, బ్యాటరీతో కూడా పనిచేసేలా దీనిని తయారు చేశారు. అందుబాటులో ఉన్న సామగ్రితో తయారైన ఈ హ్యాండ్ డిష్ వాషర్‌కు ఫెయిర్‌లో మొదటి బహుమతి లభించింది. తమ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండే పాత్రలను శుభ్రం చేయడానికి పడుతున్న ఇబ్బందులను చూసి ఈ హ్యాండ్ డిష్ వాషర్‌ను రూపొందించామని విద్యార్థులు సాకేత్, హర్ష, ప్రణయ్, నవీన్, రక్షితలు పేర్కొన్నారు.

పర్యావరణహిత శానిటరీ న్యాప్‌కిన్‌లు



➤ రసాయనాలతో కూడిన శానిటరీ న్యాప్‌కిన్‌లను వాడటంతో మహిళలు పలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. పైగా ఇవి పర్యావరణానికి కూడా హాని చేస్తున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు హైదరాబాద్ పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థులు సహజ సిద్ధంగా లభించే పత్తి, అరటి ఫైబర్ (కాండంలో ఉండే నార), మొక్కజొన్న పిండి, వేప రసాన్ని వంటి వాటిని ఉపయోగించి న్యాప్‌కిన్‌లు తయారు చేశారు. వీటివల్ల మహిళలకు ఎలాంటి ఇబ్బందులు రావు. లీక్ ప్రూఫ్‌తో పాటు పర్యావరణానికి కూడా అనుకూలమైనవి. ఈ న్యాప్‌కిన్‌లు అందుబాటు ధరలో లభించే అవకాశాలున్నాయని విద్యార్థినులు అక్షయ, హన్సిక, మానసలు పేర్కొన్నారు. ఈ ఆవిష్కరణకు రెండో బహుమతి లభించింది.

అగ్ని ప్రమాదాలపై 'డ్రయిడ్' అలర్ట్

➤ అగ్ని ప్రమాదాలపై అలర్ట్ చేయడంతో పాటు, ప్రమాదం జరిగినప్పుడు ప్రాణ, ఆస్తినష్టం లేకుండా నివారించే 'కెలామెటీ కంట్రోల్ డ్రయిడ్'ను హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (రామంతపూర్) విద్యార్థులు ఆవిష్కరించారు. ఏఐ టెక్నాలజీ సాయంతో పనిచేసే ఈ డ్రయిడ్ అగ్నిప్రమాదం జరిగితే వెంటనే గుర్తించి., మొబైల్ టెక్నాలజీతో ఫైర్ స్టేషన్‌కు సమాచారాన్ని పంపుతుంది. మంటలు విస్తరించకుండా నీటితో ఆర్పివేస్తుంది. సెన్సార్‌ల సాయంతో అగ్నిప్రమాదంలో ఎవరైనా మనుషులు చిక్కుకున్న విషయాన్ని కూడా పసిగట్టి ఫైర్ స్టేషన్‌కు సమాచారం పంపుతుంది. ఈ ఆవిష్కరణకు తృతీయ బహుమతి వచ్చింది. విద్యార్థులు సూరజ్ గుప్తా, రిషిక్, కార్తికేయలు ఈ డ్రయిడ్‌ను ఆవిష్కరించారు.



ఆటోలైట్ మెకానిజం ఎట్ కల్వర్ట్..

➤ కల్వర్టుల వద్ద తరచు రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొనడం గానీ, పక్కనే ఉన్న కల్వర్టును ఢీ కొనడం వంటి ఘటనలు మనం చూస్తుంటాం. ఇలాంటి కల్వర్టుల వద్ద ప్రమాదాల నివారణకు కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన ఎక్స్‌లెంట్ స్టార్ హైస్కూల్ విద్యార్థి రయాన్ 'ఆటోలైట్ మెకానిజం ఎట్ కల్వర్ట్' అనే నూతన పరిజ్ఞానాన్ని ఆవిష్కరించారు. కల్వర్టుల వద్ద ఆర్.ఎఫ్ ట్రాన్స్‌మీటర్, వాహనంలో ఆర్.ఎఫ్.రిసీవర్‌లను అమర్చడం ద్వారా వాహనం లైట్ ఆటోమెటిక్‌గా లోయర్ డిప్పర్‌లోకి మారుతుంది. దీంతో ఎదురుగా వస్తున్న వాహనం స్పష్టంగా కనిపించి రోడ్డు ప్రమాదం తప్పుతుంది. దీనికి కన్సొలేషన్ బహుమతి వచ్చింది.



ఉమెన్స్ ఫ్రెండ్లీ యుటెన్సిల్ సపోర్టర్..

➤ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండి వడ్డించే బాధ్యతను మహిళా సంఘాలే చూస్తున్నాయి. ఎక్కువ బరువున్న వంట పాత్రలను పొయ్యి పైనుంచి దించడం, అన్నం వార్చడం వంటి పనులు చేయలేక మహిళలు ఇబ్బందులు పడుతుంటారు. ఈ నేపథ్యంలో భారీ వంట పాత్రలోని అన్నాన్ని సులభంగా వార్చడానికి ఉపయోగపడే ఉమెన్స్ ఫ్రెండ్లీ యుటెన్సిల్ సపోర్టు పరికరానికి రాజన్న సిరిసిల్ల జిల్లా దమ్మన్నపేట్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రూపకల్పన చేశారు. దీన్ని ఎక్కడికైనా తరలించేందుకు వీలుంది. వినీల, నందు, శ్రీచైత్ర, సుప్రియ రూపొందించిన ఈ పరికరానికి కూడా కన్సొలేషన్ బహుమతి లభించింది.



సీసీ కెమెరా ఉంటేనే నిర్మాణ అనుమతులు!

పురపాలకశాఖకు రాచకొండ పోలీసుల లేఖ

- ఈ మేరకు భవన నిబంధనలను సవరించాలని సూచన
- ఆ కెమెరాలన్నీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం!
- దీనితో నేరాల నియంత్రణ, నేరస్తుల గుర్తింపు సులభమనే అంచనా
- మహారాష్ట్ర తరహాలో తెలంగాణలో అమలుకు అధ్యయనం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భవన నిర్మాణ అనుమతుల మంజూరులో కొత్త నిబంధన అమల్లోకి రానుంది. సీసీ టీవీ (క్లోజ్డ్ సర్క్యూట్ టెలివిజన్) కెమెరా ఏర్పాటు చేస్తేనే భవనాలు, వాణిజ్య సముదాయాలకు అనుమతుల జారీకి రంగం సిద్ధమవుతోంది. నేరాల నియంత్రణ, నేరస్తుల గుర్తింపులో సీసీ కెమెరాలు కీలకంగా మారిన నేపథ్యంలో.. వాటి ఏర్పాటును భవన నిర్మాణ అనుమతులలో భాగం చేస్తే మేలని రాచకొండ పోలీసు ఉన్నతాధికారులు ఆలోచనకు వచ్చారు. ఈ మేరకు నిబంధనలను అమల్లోకి తేవాలంటూ రాష్ట్ర పురపాలకశాఖకు లేఖ రాసినట్టు తెలిసింది. ఇవేగాకుండా పెట్రోల్ బంకులు, విద్యా సంస్థలు, ఆస్పత్రులు, బ్యాంకులు, వ్యాపార సముదాయాలు, ఐదు లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉండే కార్యాలయాల వద్ద కూడా సీసీ కెమెరాల ఏర్పాటును తప్పనిసరి చేయాలని కోరింది. ఇప్పటికే మహారాష్ట్ర, అస్సాం వంటి రాష్ట్రాల్లో ఉన్న ఈ విధానాన్ని అధ్యయనం చేసి.. తుది నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం.

భారం తక్కువ.. భద్రత ఎక్కువ..

ఇప్పటివరకు గేటెడ్ కమ్యూనిటీలు, భారీ భవనాలు, కాలనీలలో నివాసితుల అసోసియేషన్లే సొంతంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. కానీ అంతటా ఈ విధానాన్ని తప్పనిసరి చేయాలని, ఆ తర్వాతే జీహెచ్ఎంసీ/హెచ్ఎండీఏ/డీటీసీపీలు నిర్మాణ అనుమతులు ఇవ్వాలని రాచకొండ పోలీసు ఉన్నతాధికారులు సూచించినట్టు తెలిసింది. భారీ ఖర్చుతో అపార్ట్‌మెంట్లు, భవనాలను నిర్మించే డెవలపర్లకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయటం పెద్ద భారమేమీ కాదని.. ఇదే సమయంలో మరింత భద్రత కూడా అని పోలీసు వర్గాలు చెప్తున్నాయి.

కమాండ్ సెంటర్‌తో అనుసంధానంతో..

అంతర్రాష్ట్ర నిందితులు పలుచోట్ల తిష్ట వేసి చెయిన్ స్నాచింగ్‌లు, బ్యాంకులు, జ్యువెలరీ షాపుల దోపిడీలకు పాల్పడుతుండటం, అనుమానాస్పద హత్యలు, ఇతర నేరాలు చేస్తుండటం పెరిగిపోతోంది. ఈ క్రమంలో నేరాల నియంత్రణ, మరింత భద్రత కోసం సీసీ కెమెరాలన్నింటినీ 'రాష్ట్ర పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీఎస్‌పీఐసీసీసీ)'కు అనుసంధానించాలని పోలీసులు భావిస్తున్నారు. తద్వారా పాత నేరస్తుల కదలికలు, సున్నిత ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారం, నేరాలకు పాల్పడినవారు ఎక్కడున్నారన్నదీ సీసీ కెమెరాల ద్వారా పోలీసులు తెలుసుకోగలుగుతారని చెప్తున్నారు. ఏదైనా సమస్య వచ్చినా, అనుమానాస్పదంగా అనిపించినా.. స్థానిక పోలీసులను, పెట్రోలింగ్ సిబ్బందిని అప్రమత్తం చేస్తారని వివరిస్తున్నారు.



సీసీ కెమెరాలు ఎక్కడ ఏర్పాటు చేయాలంటే..?

భవనాల ప్రహరీపై నలువైపులా, ప్రవేశ, నిష్క్రమణ ద్వారం, మెట్ల మార్గం, లిఫ్ట్ దగ్గర, పార్కింగ్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. అపార్ట్‌మెంట్‌లోని ప్రతీ అంతస్తు సీసీ కెమెరాలో రికార్డయ్యేలా చూసుకోవాలి. సీసీ కెమెరాలను ఇన్‌స్టాల్ చేసిన చోట్లను జీపీఎస్ లొకేషన్‌తో సహా స్థానిక పోలీసుస్టేషన్‌లో నమోదు చేయాలి. ఆ కెమెరాల ఫుటేజీ కనీసం 30 రోజులు నిల్వ ఉండేలా చూసుకోవాలి. కెమెరాల పనితీరు, నిర్వహణ బాధ్యత సంబంధిత భవన యజమానిదే. ప్రజల గోప్యతకు ఏ మాత్రం భంగం కలిగించకుండా పోలీసులు ఆయా సీసీటీవీ కెమెరాలను పర్యవేక్షిస్తారు.



ఆకలి రుచెరగదు.. నిద్ర సుఖమెరగదంటారు. కానీ, ఆకలి చోటునూ పట్టించుకోదని ఈ చిన్నారులను చూస్తే తెలుస్తుంది. ఎండిన డొక్కలతో ఉన్న ఈ ఇద్దరు పిల్లలు ఆకలికి తాళలేక అపరిశుభ్ర స్థలంలో ఆహారం కోసం వెతుకుతున్నారు. కరీంనగర్‌లోని ఆటోనగర్ డంప్‌యార్డు సమీపంలో పడేసిన ఆహారం కోసం పందులతో పోటీ పడుతున్న తీరు చూసిన వారందరినీ కలచివేసింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

వలస వెళ్లేందుకే మొగ్గు

- 'కరోనా'తరువాత ఉపాధి కోసం గల్ఫ్, యూరప్ దేశాలకు..
- 129 శాతానికి పెరిగిన వీసా దరఖాస్తుల సంఖ్య
- వీఎఫ్ఎస్ గ్లోబల్ సంస్థ వెల్లడి

మోర్తాడ్ (బాల్కొండ): కరోనా కల్లోలం నుంచి ప్రపంచం తేరుకున్న తరువాత తెలంగాణ నుంచి విదేశాలకు వలస వెళ్లడానికి ఆసక్తి చూపుతున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. గల్ఫ్, యూరప్‌లోని దేశాలకు వలస వెళ్లి ఏదో ఒక ఉపాధి వెతుక్కోవాలనే ఆశతో వీసాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య గతంలో కంటే ఇప్పుడు గణనీయంగా పెరిగింది. వీసాల దరఖాస్తులు, జారీ ప్రక్రియను పరిశీలించే వీసా ఫెసిలిటేషన్ సర్వీస్ (వీఎఫ్ఎస్) గ్లోబల్ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం.. తెలంగాణ నుంచి వీసాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 95 శాతం నుంచి 129 శాతానికి చేరుకుంది. కరోనా వల్ల అనేక కుటుంబాల ఆర్థిక స్థితి తలకిందులు కావడం, వ్యాపారాలు సాగక రోడ్డున పడటం, ప్రైవేటు రంగంలోనివారు ఉద్యోగాలను కోల్పోవడం.. తదితర కారణాలతో విదేశాల్లో ఉపాధికోసం మొగ్గుచూపే వారి సంఖ్య పెరిగినట్లు వీఎఫ్ఎస్ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. 2018 నుంచి 2022 వరకు గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన వారి సంఖ్య 12,51,101గా నమోదైంది. ఈ మేరకు వర్క్ వీసాలు పొంది గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన వారి సంఖ్య ఈమైగ్రేట్ పోర్టల్‌లో నమోదైంది. అయితే విజిట్ వీసాలపై యూఏఈ, బహ్రెయిన్, కువైట్, ఖతర్, ఒమన్ వెళ్లినవారు అక్కడ వర్క్ వీసాలను పొందితే వారి వివరాలు ఇక్కడ నమోదయ్యే అవకాశం లేదు. ఈ లెక్కన గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన వారి సంఖ్య తెలంగాణ నుంచి 15 లక్షలకు మించి ఉంటుందని అంచనా.



కొత్త దేశాలకు బాటలు..

తెలంగాణ నుంచి గల్ఫ్ దేశాలకు వలస వెళ్లడం చాలా సంవత్సరాలనుంచి ఉంది. అయితే ఇప్పటి తరం వారు గల్ఫ్ దేశాలకు బదులు యూరప్, ఇతర దేశాలకు వలస వెళ్లడానికి బాటలు వేసుకుంటున్నారు. ఈ క్రమంలో యునైటెడ్ కింగ్‌డమ్, మాల్టా, సెర్బియా, పోలాండ్, హంగేరి, ఫ్రాన్స్, ఇటలీ, స్లొవేకియా, ఆస్ట్రియా, డెన్మార్క్, ఫిన్లాండ్, ఆస్ట్రేలియా, గ్రీస్, కెనడా ఇతరత్రా దేశాల్లో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే భావనతో ఆయా దేశాలకు వెళ్లడానికి నిరుద్యోగులు వీసాల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. కన్సల్టెన్సీల ద్వారా తెలంగాణ నుంచి యూరప్, ఇతర దేశాలకు వలస వెళ్లిన వారి సంఖ్య ఏడాది కాలంలో 1.50 లక్షల వరకు ఉంటుందని వీఎఫ్ఎస్ గ్లోబల్ పరిశీలనలో తేలింది. కాగా, వర్క్ వీసాకు బదులు విజిట్ వీసాలపైనే పలు దేశాలకు వలస వెళుతున్నారు. తాము కోరిన దేశానికి చేరుకున్న తరువాత వర్క్ వీసా పొందడానికి నిరుద్యోగులు ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కొందరు ఇంటి ముఖం పడుతుండగా మరి కొందరు వీసా నిబంధనలను ఉల్లంఘించి ఆయా దేశాల్లో ఉండిపోతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.